


వ్యవస్థాపకులు

**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 24 సంచిక : 5

మార్చి - 2021

'శార్వరి' మాఘ ఫాల్గుణాలు

**సంపాదకులు**

**సాగి కమలాకర శర్మ**

**Printed and Published by**

B. Anantha Laxmi

***Type Setting at :***

**Kavyasree Graphics**

**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process**

**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**

**సంవత్సర చందా : 200/-**

**శాశ్వత సభ్యత్వం : 2500/-**

(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక'** **(MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

**వివరాలకు : మేనేజర్, మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక,**

**2-2-1109/బికె - ఎల్ఐజి-10,**

**బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,**

**హైదరాబాద్ - 500 013**

**ఫోన్ : 9347971177**

**email : editormusi@gmail.com**

INTERNATIONAL STANDARD SERIAL NUMBER

**ISSN 2457-0796**




# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక**

**చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక**

## ఈ సంచికలో ...

### వ్యాసాలు


మూసీ సాహిత్య ధార 6

తెలుగులో ప్రాగ్రూప విమర్శారంభకులు - కోవెల సుప్రసన్నాచార్య ... డా.వారె దస్తగిరి 7

సీమ అస్తిత్వ గానం - చిలుకూరి దత్తగేయం ... డా. అప్పిరెడ్డి హరినాథ రెడ్డి 11

పుష్పవిలాపంపై కరుణశ్రీ వివరణ ... భాగవతము రామారావు 17

బోధన పరిశోధనలలో నిఘంటువు ప్రయోజనం ... ఆచార్య వై. రెడ్డి శ్యామల 19

పద్య మనోహరం -18 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 22

గ్రంథాంతరంగం - ఆంధ్ర వాఙ్మయ చరిత్రము ... శ్రీ ఘట్టమరాజు 23

తెలంగాణ సామెతలు - జన చిత్రణ ... పర్వయ్యగారి భాస్కర్ రావు 27

దేశ హితైషి - సంస్కరణాభిలాషి ... డా. వొజ్జల శరత్ బాబు 31

సాహిత్యం - సిద్ధాంతం - ఆచరణ - సమాజం ... వడ్డేపల్లి మల్లేశము 35

తెలంగాణ అభ్యుదయ కథలు - చైతన్యము ... డా. కె. సుభాష్ చంద్రబోస్ 37

మూసీ పదవినోదం - 27 ... డా. తాడేపల్లి పతంజలి 40

బాలసాహితీవేత్త - కీ.శే. వాసాల నరసయ్య ... బర్ల రవికుమార్ 41

కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 11 ... టి. లక్ష్మీనారాయణ 43

విశ్వర్షి వాసిలి 'నేను' దీర్ఘకావ్యం - సౌందర్య దృక్పథం ... ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు 49

శాసనముల ద్వారా తెలుగు భాషా పరిణామము ... కీ.శే. బి.ఎన్.శాస్త్రి 53

తెలంగాణ కథల పొదరిల్లు - గూడూరి సీతారాం ... ఎన్. మృదుల 55


### కవితలు


జయపతాక నెత్తుకొనుదు జయము మీదె ...అన్నమరాజు ప్రభాకర రావు - 5; తుకారాం అభంగం... మంత్రి శ్రీనివాస్ - 6; దృష్టి ... డా. ఎన్. గోపి - 29; భిన్నత్వంలో ఏకత్వం ... డా. గన్నోజు శ్రీనివాసాచారి - 30; నీ స్వాతంత్ర్యం కోసం పోరాడు ... యడవల్లి సైదులు - 30; అచ్చులతో మెరుపులు ... పూజారి చౌదయ్య - 36; భాషలందు మాతృభాష లెస్స ... ఎం.డి. ఖాజా మైనుద్దీన్ - 42; నన్నేరుక రండి ... బోళ్ల ప్రవీణ్ కుమార్ - 48; పసితనం ... బాటసారి - 52; ఆశ్రమానికి అమ్మకురా ... సుగుణా రెడ్డి - 52; నా అక్షరాలు ... సిరిసిల్లా గఫూర్ శిక్షక్ - 62;


### సమీక్షలు


సి.వి. శ్రీనివాస్ 'నానీల జీవధార' ... డా. తిరునగరి 57

అమృతలత 'సృష్టిలో తీయనిది' (నవల) ... ర్యాగట్ల సాయిలక్ష్మి 58

తిరుమల వారి 'తెలుగు పత్రికల సాహిత్య సేవ' ... అట్టెం దత్తయ్య 59

స్వీకృతి ... 61


**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**


*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.

*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.


*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.

*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

## సంపాదకీయం







**వ్యక్తి శక్తి కావాలి**

**మనిషి మనీషి కావాలి**

**మానవుడు
మహనీయుడు కావాలి**

**ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి**

**పరిమితుడు
అపరిమితుడు కావాలి**


**స్థాయి విస్తరించాలి**


**దైవత్వం మేల్కొనాలి**

**తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి**

**అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి**

**నీలో దీపం వెలిగించు
నీవే వెలుగై వ్యాపించు**





## బంధం

బంధం, అనుబంధం, సంబంధం అనే శబ్దాలు మనం వింటూనే ఉంటాం. బంధం ఎవరితో ఉంటే వారిని బంధువులు అంటున్నాం. బంధాన్ని అనుసరించేది అనుబంధం. సరియైన, స్పష్టమైన బంధం ఉంటే సంబంధం. కట్టిపడివేసేది బంధం. కదలకుండా చేసేది బంధం. ఈ లోకంలో మనతో ఉండేవన్నీ బంధాలే. శరీరం మొదటి బంధం. అమ్మ నాన్న అక్క చెల్లి అన్న తమ్ముడు దగ్గరి బంధువులు ఉద్యోగం ఇల్లు ... అన్నీ బంధనం వల్ల ఏర్పడినవే. మనసు వేటివైపు దృష్టి కేంద్రీకరించి ఉంటుందో అవే బంధంగా మారుతాయి. ఏవి బంధాలో వాటి చుట్టే ఆలోచనలుంటాయి. ఈ ఆలోచనలే మళ్ళీ బంధాలుగా మారుతాయి. బంధాలు ... బంధనంగా మారకుండా చూసుకోవాలని ఆధ్యాత్మిక వేత్తలు చెపుతుంటారు.

రసాయన శాస్త్రంలో మూలకాలు, పదార్థాలుగా మారడానికి కూడా బంధాలు కావాలి. వాటినే అయానిక, సమయోజనీయ బంధాలు అనే పేరుతో ఉపయోగిస్తున్నారు. బాండ్స్ అనే ఆంగ్ల శబ్దం కూడా దీనినే సూచిస్తుంది. మనిషి ఈ ప్రకృతితో అనేక రూపాల్లో బంధింపబడి ఉన్నాడు. పంచభూతాలతో బంధింపబడనిది ఎవరు? పాంచభౌతికమైన దేహం, పాంచభౌతిక ప్రకృతి మధ్యలో ఉన్న బంధం వల్ల మానవుని మనుగడ కొనసాగుతుంది. శబ్ద స్పర్శ రూప రస గంధాదుల వల్ల బంధనం మరింత బలిష్టమౌతుంది. వీటన్నింటినీ నిత్యజీవితంలో అన్వయం చేసుకుంటే బంధనం వల్ల కలిగే గుణదోషాలు మనకు అర్థమౌతాయి. మనం దేనికి లోబడితే అది బంధం. లోబడిన దానిని తెలుసుకోవడం జ్ఞానం. తెలుసుకున్న దానిని అధిగమించగలిగి బంధ రాహిత్యం వైపు అడుగు వేసే ప్రయత్నమే సాధన. సాధకులు అంటే బంధనాలలో ఉన్నట్లు ఉన్నా ... క్రమంగా ఒక్కొక్క దానిని వదిలించుకునే ప్రయత్నం చేసేవారే.

బంధంలో ఉన్నప్పుడు పరిమితమైన శక్తి మాత్రమే ఉంటుంది. బంధం క్రమంగా వదులుతుంటే శక్తి విస్తరిస్తుంది. చుట్టూ ఉన్న బంధాలను అధిగమించడం వైపు దృష్టి సారిస్తే చాలు.. వ్యక్తి శక్తి వంతుడైనట్లే. లాగుతున్న మనసే మనకెన్ని బంధాలున్నాయో, అవి ఎంతగా బంధనాలుగా మారాయో తెలుపుతుంది. బంధాలు వదలితే స్థాయి విస్తరిస్తుంది. రక్షించుకునే స్థాయి నుండి రక్షించే స్థాయి వరకు ఎదుగుతుంది. బంధాల బురదలో మునిగిపోయి అదే లోకంగా భావిస్తున్నదీ లోకం. అన్నింటికన్నా ముఖ్యమైన బంధం మన శరీరమే. దాని చుట్టూనే మిగిలిన బంధాలన్నీ. ఈ శరీరం, మనసు కోరుకుంటున్న అంశాలను గమనించడం అలవాటు కావాలి. అవి నిజం కాదన్న జ్ఞానం కావాలి. అప్పుడే బంధ విచ్ఛేదం అవుతుంది. ఈ విషయాలు తెలియజేయడానికి ఒక గురువు కూడా కావాలి.

మంచు ముక్క బంధనాన్ని బలంగా పెంచుకోవడం వల్ల ఘనీభవించి గడ్డకట్టి కనిపిస్తుంది. గురువు అనే అగ్ని తోడైతే జలంగా మారుతూ కొంత ప్రవాహ శక్తిని పొందుతుంది. ఇంకా అదే విధంగా గురువనే అగ్నితో సంబంధం పెట్టుకొని ఆ మార్గంలోనే ఉంటే నీరులోని బంధనాలు కూడా విడిపోయి నీటి ఆవిరిగా విస్తరించి రూపరహితమవుతాయి. బంధనాలు పెంచుకుంటే రూప సహితమై బాధలు అనుభవించాలి. రూపమై వచ్చినవారంతా రూప రహితం కావడానికి ప్రయత్నం చేసి తీరాల్సిందే. బంధనాలు వదలితేనే రూప రహితమవడానికి అవకాశం. దానికి తగిన జ్ఞానం, తీవ్రమైన ప్రయత్నం, మంచి మార్గదర్శనం కావాలి. ఈ సందర్భంలో ఒక కవి మాటలు గుర్తుకు వస్తున్నాయి.... **"వేణువై వచ్చాను భువనానికి ... గాలినై పోతాను గగనానికి"**

# జయ పతాక నెత్తుకొనుడు.. జయము మీదె



తే.గీ. అబల యంచు పేరొందినయట్టి సబల
యామె, శక్తి యామె, ప్రకృతి యామె, జనని
యామె, సర్వ సృష్టి మూలమామె, సకల
కార్యదక్షురాలామె, యే గతిని జూడ

సీ. సంగీతమందున, సాహిత్యమందున,
గోష్ఠుల యందున, కొలువులందు,
సైన్యమందున, వ్యవసాయము నందున,
సాంకేతికము నందు, శాస్త్ర మందు,
ప్రాతినిధ్యంబున, పారిశుధ్యంబున,
వైద్యము నందున, విద్య యందు,
ఆర్థికమందున, ఆతిథ్యమందున,
అద్రుల యందున, అవని యందు,



తే.గీ. రోదసి లోన, సముద్రము లోన నెందు
జూచిన మహిళాభ్యున్నతి స్థూల సూక్ష్మ
కారణాకృతుల్ దాల్చుచు ఘనత నొంద
గాంతురు జనులు కలికియే కల్మి యనుచు

తే.గీ. అట్టి సోదరిన్ పుత్రికన్ అమ్మ నాత్మ
భావనాప్రకృతిన్ పరాభవము పాలు
జేతు రకట ! మాత్సర్యమా ? చిన్నచూప ?
జంతులక్షణోపేతులై సంచరింత్రు



మ. మనకంటెన్ ముదితల్ ప్రపంచమున సంపాద్యంబు నొందంగ రా
దు, నవోన్మేషము నొందరాదు, జగమున్ ద్రోలంగరా దేకతన్,
వెనుకన్ బ్రాకుచు పొర్లిగింత లిడుచున్ వీతాత్మమర్యాదులై
చనుచున్ దుఃఖితులై మనంగవలె, మా చట్టంబిదే యందురే !!

మధ్యా. వీధిలో తిరుగగ ముప్పు, వీసమంతయు లేదు రక్ష,
బాధలె గానంగ నగును పదుగురిలో చొరబార,
సాధింప రాదేదియు తమ శక్తిసామర్థ్యముల్ జూపి,
యీ ధర వనితల బ్రతుకు లిట్లుండె నెంత దారుణమొ


ఓ మహిళలార !

తే.గీ. మీరె పోరాడవలె నింకమీద, మీరె
ముందడుగు వేయవలెనమ్మ, చిందు ద్రొక్కి,
నింగి హద్దుగ చెలరేగి పొంగి పొందు,
జయపతాక నెత్తుకొనుడు, జయము మీదె

అన్నమరాజు ప్రభాకర రావు
హైదరాబాదు
ఫోన్ : 94402 58292

# మూసీ సాహిత్య ధార - 29

**'పరిశోధన-నిఘంటువుల ఉపయోగం, వినియోగ విధానం'**



ప్రతిమాస ఉపన్యాస స్రవంతి 'మూసీ సాహిత్య ధార'లో 29వ వక్తగా తెలుగు విశ్వవిద్యాలయంలోని ఆచార్యులు, నిఘంటు నిర్మాణవేత్త, డా. వై. రెడ్డి శ్యామలగారు విచ్చేసినారు. 'పరిశోధన - నిఘంటువుల ఉపయోగం, వినియోగ విధానం' అనే అంశంపై చక్కని ప్రసంగం కొనసాగింది. నిఘంటువుల చరిత్రను, విభాగాలను తెలిపి, పఠనకు, రచనకు, పరిశోధనకు నిఘంటువుల ఆవశ్యకతను తెలిపారు. వినియోగ విధానం గురించి వివరించారు. ముఖ్యంగా పరిశోధకులు నిఘంటువును చూసే పద్ధతులను వ్యక్తపరిచారు. అందుబాటులో ఉన్న నిఘంటువులు, అందరి దగ్గర ఉండవల్సిన నిఘంటువులను గురించి ఎరుకపరిచారు. ఇప్పుడు ఆధునికంగా వస్తున్న నిఘంటువుల తీరును గుర్తుచేస్తారు. మొత్తంగా ఈ ఉపన్యాసం ఆసాంతం ఆసక్తిని కలిగించి వీనులవిందు చేసింది. పరిశోధక విద్యార్థులకే కాకుండా అధ్యాపకులకు, ఆచార్యులకు కూడా మంచి చర్చలకు అవకాశం కలిగింది.

యథావిధిగా ఈ వేదికమీద నలుగురు పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు. అందులో పర్వయ్యగారి భాస్కర్ 'తెలంగాణ సామెతలు - జన చిత్రణ' అంశంపై తాను చేస్తున్న పరిశోధను అద్దంలో చూపించే ప్రయత్నం చేసినారు. మరో విద్యార్థిని ర్యాగట్ల సాయిలక్ష్మి 'సృష్టిలో తీయనిది'అనే నవలను సమీక్షించారు. కవితాగానంలో భాగంగా బోళ్ళ ప్రవీణ్ కుమార్ యాత్రా కవితను చదువగా, యడవల్లి సైదులు యువత కర్తవ్యాన్ని గుర్తుచేసే కవిత చదివి మన్ననలు పొందారు. ఈ సమావేశాన్నంతటిని సమీక్షించి డా. ఎస్.రఘు గారు పరిశోధక వక్తలకు తగిన సూచనలందించారు. అంతర్జాల వేదిక సాగిన ఈ సమావేశంలో వివిధ విశ్వవిద్యాలయ ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు, సాహితీ ప్రియులు పాల్గొని విజయవంతం చేసారు.

## తుకారాం అభంగం

ఇష్టమిదే పండరీ
భీమానది పాండురంగా
చంద్రభాగ తీర లింగా
ఓ పాండురంగా!

కామధేనువు నీవే
కల్పవృక్షము నీవే
చింతామణి నీవే
మా ప్రీతి ధనము నీవే

తుకా పలికే జీవుడా
పలుకు ఘనత నీ ముఖతా
ఉంచబోకు అన్య ఆకలి
ఉంచబోకు అన్య దాహము




**అనువాదం : మంత్రి శ్రీనివాస్**
**పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉ.వి.,**
**ఫోన్ : 83283 33720**

# తెలుగులో ప్రాగ్రూప విమర్శారంభకులు – కోవెల సుప్రసన్నాచార్య

**డా॥ వారె దస్తగిరి,** నిజామాబాద్.. ఫోన్ : 95050 23001

ఫ్రాయిడ్ కంటే ముందు మానసిక శాస్త్రవేత్తలు వ్యక్తి జ్ఞాతమనస్సు మీద పరిశోధనలు చేశారు. కాని ఫ్రాయిడ్ అజ్ఞాతమనస్సు గురించి పరిశోధించాడు. సభ్యసమాజంలో చెప్పుకోలేని కోరికలను, అసాధ్యమైన కోరికలను మనుషులు తమ అజ్ఞాత మనస్సులో అణచి ఉంచుతారు. అలా అణచివేయడం ద్వారా మానసిక ఒత్తిడితో రుగ్మతలకు లోనవుతారు. కళాకారులు మాత్రం వాటిని వారి కళల్లో ప్రదర్శింప చేసి మానసిక ఒత్తిడిని అధిగమిస్తారు అని ఫ్రాయిడ్ సిద్ధాంతీకరించాడు. ఈ సిద్ధాంతాన్ని సమర్థించడంతో పాటు మానవునిలో ఆత్మ న్యూనతాభావాలు, ఆత్మ ఆధిక్యతాభావాలు ఉంటాయని ఆల్ఫ్రెడ్ ఆడ్లర్ గుర్తించాడు. ఫ్రాయిడ్, ఆడ్లర్ ఇద్దరూ వ్యక్తి అజ్ఞాతమనస్సులోని సంఘర్షణల కారణంగా సాహిత్యం సృష్టించబడుతుందని ప్రతిపాదించారు. ఆ తరువాత వచ్చిన ఫ్రాయిడ్ శిష్యుడు కార్ల్ గుస్టవ్ యూంగ్ మాత్రం ఇంకొంచెం ముందుకు వెళ్లి సమష్టి అజ్ఞాతమనస్సు అనే భావనను ప్రతిపాదించాడు. ఈ సమష్టి అజ్ఞాతమనస్సులో ఆదిమకాలంనాటి మానవుల సంచిత అనుభవాలు, నమ్మకాలు, ఆచారాలు, పురాగాథలు వాసనలరూపంలో ఉంటాయని ప్రతిపాదించాడు. రచయితలు సాహిత్య సృజన చేస్తున్నప్పుడు అతని ప్రమేయంలేకుండానే అవి రచనలో ప్రతిబింబిస్తాయని తెలిపాడు. వాటికి ArcheTypes (ప్రాగ్రూపాలు)అని నామకరణం చేశాడు. అలా రచయిత సమష్టి అజ్ఞాతమనస్సులోని ప్రాగ్రూపాలు పాఠకుల సమష్టి అజ్ఞాత మనస్సులోని ప్రాగ్రూపాలతో సంవదించబడి వారిని స్పందింప చేస్తాయని యూంగ్ అభిప్రాయపడ్డాడు.

ArcheTypes అనే పదానికి సమానార్థకాలుగా మూలరూపాలు, ఆదిమరూపాలు, అనుభూతి రూపాలు, ప్రథమచ్ఛదం మొదలైన పదాలను వాడుతున్నప్పటికీ కోవెల సుప్రసన్నాచార్య మొదటిసారిగా వాడిన ప్రాగ్రూపం అనే పదం మాత్రం సర్వసమ్మతంగా వాడబడుతున్నది. ఈ పదం మొదటిసారి **"గరుడోపాఖ్యానము – మహాభారతము"** (రహస్య కథన సంప్రదాయము) అనే వ్యాసంలో సుప్రసన్న ఉపయోగించారు. ఈ వ్యాసం విమర్శిని పత్రికలో 1980లో ప్రచురితమైనది. ఈవ్యాసంలో మహాభారత కథకు గరుడోపాఖ్యాన కథ ప్రాగ్రూపంగా నిలిచిందని ప్రతిపాదించడంతో పాటు అనేక ఉదాహరణల ద్వారా నిరూపించారు. దీనితో సరిపెట్టకుండా **"సాహిత్యానుశీలనలో ప్రాగ్రూపాల, పురాగాథల ప్రాధాన్యము"** అనే వ్యాసం ద్వారా తెలుగులో ప్రాగ్రూప విమర్శకు సుప్రసన్నాచార్య పునాది వేశారు. అసలు ప్రాగ్రూపాలు అంటే ఏమిటి? వాటిని ఎలా గుర్తించాలి? సాహిత్యాభిమానికి ప్రాగ్రూపవిమర్శాజ్ఞానం



ఎందుకు, ఎలా ఉపయోగపడుతుంది? అనే అంశాలను వివరించారు. ప్రాచ్య, పాశ్చాత్య పురాగాథలలో సారూప్యతలు కనిపించడానికి కారణం యూంగ్ సిద్ధాంతీకకరించిన సమష్టి అజ్ఞాతమనస్సులోని ప్రాగ్రూపాలే అని తెలియపరిచారు. దీనిని 1985 ఫిబ్రవరిలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో జారిగిన జాతీయ సదస్సులో సమర్పించారు. ఆ తరువాతనే మిగిలిన విమర్శకులు తమ వ్యాసాలలో ప్రాగ్రూప పదాన్ని వాడినట్లు కనిపిస్తుంది.

తెలుగులో సాహిత్య విమర్శ (అవతరణ – వికాసములు) అనే ఎస్వీ రామారావు పరిశోధనా గ్రంథం 1974 లో వెలువడింది. దీనిలో ఆర్కిటైపులు అని వాడారు కాని ప్రాగ్రూప పద ప్రయోగం చేయలేదు. రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి మహాభారత కథకు అందులో అంతర్భాగమైన నలకథ ప్రాగ్రూపంగా నిలిచిందని ఒక వ్యాసాన్ని "తెలుగు" మాస పత్రిక నవంబర్ 1988 సంచికలో రాశారు. ప్రాగ్రూపాలను ఆధునిక సాహిత్యంతో పాటు అభ్యుదయ సాహిత్యానికి అన్వయిస్తూ సి. ఆనందారామం **"తులనాత్మక సాహిత్యం – నవలా ప్రక్రియ"** అనే గ్రంథాన్ని వెలువరిచారు. ఈ గ్రంథం 1990 వెలువడింది. ఆ తరువాత సర్దేశాయ్ తిరుమలరావు **"విశ్వ సాహిత్యంలో ప్రాగ్రూపాలు"** పేరుతో ఒక చక్కని పట్టికను "వాఙ్మయి" జనవరి – జూన్ 1991 లో సంచికలో ప్రచురించారు. ఇది చాల విలువైన సమాచారాన్ని ప్రాగ్రూప విమర్శకులకు అందించింది. పాశ్చాత్య సాహిత్య విమర్శ చరిత్ర సిద్ధాంతాలు అనే గ్రంథాన్ని వడలి మందేశ్వర రావు 1994లో ప్రచురించారు. దీనిలో కూడా

ప్రాగ్రూపాలకు సంబంధించి విలువైన సమాచారం ఉంది. **"20వ శతాబ్ది విశ్వసాహిత్య విమర్శ"** అనే గ్రంథం 1999లో వెలువడింది. దీనిని జి.వి.సుబ్రహ్మణ్యం రాశారు. దీనిలో రెండు మంచి వ్యాసాలు ప్రాగ్రూపాలకు సంబంధించి ఉన్నవి. లక్ష్మణ చక్రవర్తి, పి. వారిజా రాణి, జి. విజయ్ కుమార్‌ల సంపాదకత్వంలో వచ్చిన **"ఆధునిక సాహిత్య విమర్శారీతులు"** అనే గ్రంథం 2004లో వెలువడింది. దీనిలో రావి ప్రేమలత అత్యంత సులభ శైలిలో ప్రాగ్రూప విమర్శను వివరించారు. అప్పటివరకు జరిగిన కృషిని అద్దంలో చూపినట్లు ఆ వ్యాసాన్ని రాశారు. **"జానపద సరస్వతి 2013"** అనే గ్రంథంలో కూడా జానపద సాహిత్యం ప్రాగ్రూప విమర్శ అనే పేరుతో ఒక వాసాన్ని రాసి ప్రాగ్రూపాలను జానపద సాహిత్యానికి అన్వయించారు.

ఈ రచనలన్నీ సుప్రసన్నాచార్య రాసిన వ్యాసం తరువాత వెలువడినవే కావున వారే తెలుగులో ప్రాగ్రూప విమర్శను ప్రారంభించారని అనుకోవచ్చు. కాని **"సాలభంజిక"** పేరుతో తుమ్మపూడి కోటీశ్వరరావు వెలువరించిన విమర్శా వ్యాస సంకలనం లో **"ప్రథమచ్ఛదం – ప్రతీక"** అనే ఒక వ్యాసం ఉంది. ఈ వ్యాసం ప్రథమచ్ఛదం అనే పేరుతో ప్రాగ్రూప లక్షణాలను వివరించింది. ఈ గ్రంథం 1999లో ప్రచురించ బడింది. కాని ఈ వ్యాసం ఎప్పుడు రాశారో తెలియలేదు. **"తెలుగు సాహిత్యం – ప్రాగ్రూప విమర్శ"** అనే (ఈ వ్యాసరచయిత అముద్రిత) పరిశోధనా గ్రంథానికి ముందుమాట రాస్తూ తెలుగులో మొదటిసారి ప్రాగ్రూప విమర్శను, రహస్యకథన సంప్రదాయాన్ని స్నాతకోత్తర స్థాయిలో ప్రవేశపెట్టింది కాకతీయ విశ్వవిద్యాలయంలోనే కావచ్చునని సుప్రసన్నాచార్య అన్నారు. దీనిని బట్టి ప్రాగ్రూప విమర్శ పదాన్ని గ్రంథ రూపంలో ప్రవేశపెట్టిన వారు సుప్రసన్నయే అనే విషయం నిర్వివాదాంశమే అయినా మొదటి వ్యాసం రాసినవారుగా గుర్తించడానికి మాత్రం తుమ్మపూడి కోటీశ్వరరావు వ్యాసం ఎప్పుడు రాశారో తెలియాల్సి ఉంది.

**ప్రాచ్య పాశ్చాత్య సిద్ధాంతాల సమన్వయం :**

**"అసంశయం క్షత్ర పరిగ్రహ క్షమా"** అన్న సందర్భంలో కాళిదాసు అంతఃకరణ ప్రవృత్తికి ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందని, ఈ అంతఃకరణంలో స్ఫురించే సహజ బోధ ఏ మనోవిజ్ఞాన భూమిక లోంచి ఆవిర్భవిస్తుందో చెప్పేదే యూంగ్ సిద్ధాంతం అని సుప్రసన్న అభిప్రాయపడ్డారు. జననాంతర సహృదములు భావ స్థిరములు అనే చోట భావ శబ్దానికి అర్థం చెప్పేటప్పుడు ప్రాగ్రూపాల ఉనికిని నిర్ధారించవచ్చు అని పాశ్చాత్య మనోవిజ్ఞాన శాస్త్ర సిద్ధాంతమైన ప్రాగ్రూప సిద్ధాంతాన్ని కాళిదాసు భావాలతో పోల్చి భారతీయ తత్వశాస్త్ర ఔన్నత్యాన్ని చాటి చెప్పారు.

దీనితోపాటు మాండూక్యోపనిషత్తు మనస్తత్వ శాస్త్రాంశాలను చర్చించిందని, అవస్థాత్రయ నిరూపణలో జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలలో భిన్న చైతన్యాలను నిరూపించిందని, వీటిలోని స్వప్న దశను అవచేతనగా, సుషుప్తి అవస్థని సమష్టి అవచేతనగా సుప్రసన్న అన్వయించారు. మాండూక్యోపనిషత్తు చెప్పిన తురీయావస్థను మాత్రం ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రం ఇంకా చేరుకోలేదని భారతీయ తత్త్వశాస్త్ర ఆధిక్యతను వివరించారు.

**జననాంతర సౌహృదాని, ప్రవేదిరే ప్రాక్తన జన్మవిద్యః** అని అన్నప్పుడు సంస్కార పరంపరకు మూలం జన్మ పరంపరగా కనిపిస్తుంది. ఆధునిక మనస్తత్వ శాస్త్రవేత్తలు జన్మ పరంపరను అంగీకరించలేదు. ప్రాచ్య పాశ్చాత్య పురాగాథలలో ఈ ఒక్క అంశమే తేడా. అక్కడ తరాల పరంపరకు, ఇక్కడ జన్మ పరంపరకు సమాన స్థానం కనిపిస్తుంది. ఇది తప్ప మిగిలిన వన్నింటిని సమన్వయ పరచవచ్చు అని సుప్రసన్న పేర్కొన్నారు. యూంగ్ ఆత్మ పదార్థాన్ని అంగీకరించడానికి సన్నిహితంగా వచ్చినమాట నిజమే కాని అంగీకరించలేదని తీర్మానించారు.

ప్రాగ్రూప ఆవిర్భావ స్థానము సైకి. దీనిని భారతీయ పరిభాషలో చిత్ అనవచ్చు. ఈ చిత్ ప్రాక్తజనుల మనో లక్షణాలను, విశ్వాసాలను, అలవాట్లను, జానపద పౌరాణిక విజ్ఞానాన్ని, మత భావాలను తనలో ఇముడ్చుకొని ఉంటుంది. ప్రాగ్రూపమంటే మన సమష్టి అవచేతనలో నుంచి వచ్చే కథాంశాలుగాని, పాత్రలుగాని, భావాలుగాని కావచ్చు. ప్రాగ్రూప వివేచన, ప్రాగ్రూపాలను గుర్తించడం, ప్రాగ్రూప ప్రవృత్తిని గుర్తించడం అనే మూడు విధానాలను సుప్రసన్న సూచించారు. వీటిని గురించి ముదిగొండ వీరభద్రయ్య **"సుప్రసన్న సమన్విత విమర్శ"** గ్రంథంలో రాస్తూ తెలుగులో ఇంకా మొదటి దశకూడా దాటలేదు. అది జరగకుండా మిగిలిన రెండు జరిగినా నిరర్థకము అని సుప్రసన్న ముందు చూపును తెలిపారు.

**ప్రాగ్రూపాలు విశ్వజనీనాలు.** అందుచేత వాటి మీద ఆధారపడి నిర్మితమైన పురాగాథలు కూడా విశ్వజనీనాలు అవుతాయని సుప్రసన్న ప్రధానమైన ఐదు ప్రాగ్రూపాలను సూచించారు. అవి. 1. మాతృ, పితృ ప్రాగ్రూపం లేదా స్త్రీ పురుష ప్రాగ్రూపం 2. పునర్జన్మ ప్రాగ్రూపం 3. సమూహ వ్యక్తిత్వాన్ని పొందడం 4. తెగల నాయకునితో తాదాత్మ్యం చెందడం 5. మనిషి ఈ జన్మలోనే మరల కొత్త జీవితాన్ని ప్రారంభించడం. వీటితోపాటు మనిషిలోని ప్రేమ, దయ, క్రోధము, పగ మొదలైనవి కూడా ప్రాగ్రూపాలే అని అవి అనుకూల, ప్రతికూల పక్షాలలో ఉంటాయని చెప్పారు.

**సాహిత్యంలో సుప్రసన్న గుర్తించిన ప్రాగ్రూపాలు :**

ఉదయ సూర్యుణ్ణి సముద్రంలో నుంచి అవతరించిన దివ్య వీరుడుగా, ఆకాశం మీద రథం నడిపేవాడుగా, పడమటనున్న భయంకర సర్పం అతన్ని మ్రింగివేస్తే, రాత్రంతా దానిలో ఉంటూనే దాన్ని చీల్చి రక్తసిక్తాంగుడై తిరిగి ఉదయిస్తాడనే పాశ్చాత్య కథకు, భారతదేశంలో ఉదయసూర్యుడు మందేహులనే రాక్షసులతో యుద్ధంచేసి రక్తసిక్తాంగుడై రథంపై ప్రయాణం చేస్తాడనే కథకు

సామ్యతను గుర్తించారు. ఈ ప్రాగ్రూపం విశ్వనాథ వారి "నీరథము" అనే రచనలో అప్రతిహత రథయానాన్ని, దాని కింద పడి నలిగిపోయే వాళ్ళను వర్ణించడంలో కనిపిస్తుందని చెప్పారు.

మహాభారతంలో పాండవులు, ద్రౌపదితో పాటు ధర్మ స్వరూపమైన కుక్క హిమాలయాలపై ప్రయాణం చేసినట్లు మహాప్రస్థాన పర్వంలో ఉంది. ఖురాన్ లోని అసాహబ్ ఏ కహాబ్ అనే వృత్తాంతంలో ఆరుగురు వ్యక్తులు ఒక కుక్కతో ప్రయాణం చేసి ఒక గుహలో కొన్ని వందల సంవత్సరాలు నిద్రించినట్లు ఉందని తెలిపారు.

పురాణగాథలలో ఉన్న జయవిజయుల మూడు జన్మలను యూంగ్ గుర్తించిన మూడురకాల మనస్సులతో సంవదించారు. హిరణ్యాక్ష హిరణ్యకశిపులను సమష్టి అవచేతనగా భావించి ఒక్కొక్కరిని సంహరించడానికి ఒక్కో అవతారం అవసరమైనదని చెప్పారు. రావణ కుంభకర్ణులను వ్యక్తిగత అవచేతనగా సూచించి రాముడొక్కడే ఇద్దరినీ సంహరించాడన్నారు. శ్రీకృష్ణుడు సంహరించిన వారిలో శిశుపాల దంతవక్త్రులను అప్రధాన్యం కలిగిన పాత్రలని పేర్కొన్నారు. వారిని వ్యక్త చేతనగా ఉదహరించారు.

విశ్వనాథ పురాణ వైరగ్రంథమాలలోని జయద్రథుని పాత్రలోని భగవత్ విరోధం అనాదియైన సైతాన్ స్వరూపంగా ప్రతిపాదించారు. గురజాడ కన్యకలో సతీ దేహ త్యాగము, వీరభద్రుని విజృంభణముగా ప్రాగ్రూప ప్రవృత్తి గోచరిస్తుందని వివరించారు.

మాలపల్లి కథానిర్మాణం వెనుక మహాభారత కథాసూత్రం గర్భితమై ఉన్నదని తెలుపుతూ, రామదాసు, వెంకటదాసు, సంగదాసులు క్రమంగా ధర్మజ భీమార్జునులుగా సూచించారు. సంగదాసు మరణానికి ముందు బుచ్చయ్య దగ్గర ఉపదేశంపొందడం, వెంటనే సంఘర్షణకు దిగడం మహాభారతంలోని గీతోపదేశ సన్నివేశం గుర్తుకు వస్తుందని వివరించారు. కమల వికృత రూపంలో రావడం, నలుడు బాహుకుడై దమయంతి దగ్గరకు రావడంగా భావించారు. సెటిల్మెంటు జీవితం, జైలు జీవితం అరణ్య అజ్ఞాత వాసాలుగా చెప్పారు.

వేయిపడగలు నవలలో ప్రాగ్రూపాల ప్రాచుర్యం ఎక్కువగా కనిపిస్తుంది. నవలలోని కలలు, పాములపడగలు, వాటి భిన్న భిన్న దర్శనాలు, గణాచారి, పసరిక ఇవాన్నీ ప్రాగ్రూపాలే అంటారు. పాములు కాలాన్ని, వ్యవస్థనూ సూచించడం ఒకవైపు, పృథ్వికి ప్రతీకయైన జీవశక్తిని సూచించడం రెండోవైపు. సుబ్రహ్మణ్య స్వామిని తీర్చిదిద్దడంలో ప్రాగ్రూప స్ఫురణతో పాటు రచయిత పురాణ విజ్ఞానము, యోగసాధనా జ్ఞానము సమ్మిళితం చేయబడ్డాయి. పసరిక మరణం సందర్భంలో ఆదిమ మానవుని శిక్షాస్మృతి గోచరిస్తుంది. సుబ్బన్నపేట ఆవిర్భావం సందర్భంలో ఆవు, పాము, పుట్ట మొదలైన వృత్తాంతం పురాణాలలోని పృథుకథను సూచిస్తుంది. అని వివరించారు.

ఏకవీరలో రేణుకా కథ గోచరిస్తుంది. బుచ్చిబాబు చివరికి మిగిలేది నవలలో స్త్రీ పాత్రలన్నీ ప్రణయ భావనకు, సమాజ నీతికి మధ్య నలిగిపోయేవే. మైదానం, తుఫాను, చెలియలికట్ట మొదలైన నవలల్లో రేణుకా ప్రాగ్రూప ప్రతిఫలనం కనిపిస్తుందని పేర్కొన్నారు. పురాణాలలోని బుధ – ఇల వృత్తాంతం అనిమా అనిమస్ సమైక్య లక్షణంగా సుప్రసన్న భావించారు. శ్రీశ్రీ మహాప్రస్థానం, సోమసుందర్ వజ్రాయుధం మొదలైన పేర్లలో ప్రాగ్రూప ప్రభావముందంటారు సుప్రసన్న. శ్రీశ్రీ ప్రయోగించిన పరమేష్ఠిజూకాలు, జగన్నాథ రథచక్రాలు కూడా ప్రాగ్రూప ప్రభావాన్ని తెలుపుతాయంటారు.

గరుడోపాఖ్యానము మహాభారత కథకు ప్రాగ్రూపంగా కనిపిస్తుందని కింది పోలికలద్వారా నిరూపించారు. కుంతీ గాంధారులకు కశ్యపుని భార్యలైన వినత కద్రువలకు పోలికలున్నాయి. వినత కుంతిలాగా అల్పసంతానం కలది. గాంధారి కద్రువలాగా అధిక సంతానం కలది. కద్రువ సంతానం పాములు ధర్మబుద్ధి లేనివి. గాంధారి సంతానమైన కౌరవులకు ప్రాతినిధ్యం వహిస్తాయి. కౌరవులలో ప్రథముడు దుర్యోధనుడు నాగ ధ్వజుడు. ఈ ధ్వజ ప్రతీక కౌరవ సర్పసామ్యము ఎంత సన్నిహితమో తెలుపుతుంది. అనూరుడు కర్ణుడితో సామ్యం కలవాడు. అనూరుడు సూర్య సారథి, కర్ణుడు సూర్య సంతానంతో పాటు రథసారథి పుత్రుడు. అనూరుడి లాగానే కర్ణుడు కూడా తల్లికి అకాలంలో జన్మిస్తాడు. పుట్టినప్పటి నుండి తల్లికి దూరంగా ఉండిపోయాడు. జీవితమంతా వికలాంగుడై అనూరుడు, అనేక శాపములతో కర్ణుడు ఇద్దరూ బాధపడ్డావారె. వినత దాస్యం కద్రువసంతానమైన నాగుల మోసం వల్ల కలిగింది. పాండవదాస్యం కూడా నాగధ్వజుడైన దుర్యోధనుని మాయాజూదమనే మోసం కారణంగా కలిగింది. అర్జునునికి గరుడునికి పోలికలున్నాయి. గరుడుడు అమృతం కోసం ఇంద్రునితో విరోధిస్తే, అర్జునుడు వనపర్వంలో ఖాండవదహన వేళ ఇంద్రునితో విరోధిస్తాడు. గరుడుడు భీమసేనులిద్దరికి అధిక ఆకలి ఉంటుంది. ఇద్దరికీ వాయువుతో సంబంధం ఉంది. గరుడుడు గాలిలో విహరిస్తే, భీముడు వాయుపుత్రుడు. పాండవపత్ని ద్రౌపదికి సూర్యపత్నులైన సంధ్యా, ఛాయలకు సంబంధమున్నది. ద్రౌపది సంధ్యలిద్దరు అగ్ని నుండి పుట్టినవారు. ఛాయ ద్రౌపదులిద్దరు నల్లని వర్ణం కలవారు.

మహాభారతంలోని ఉపరిచరవసు వృత్తాంతానికి ఋగ్వేదంలోని వృత్రాసుర వధ మూలమని (ప్రాగ్రూపం అనే పదాన్ని వాడకుండా) దానిలోని ఆంతర్యాలను ఉద్దీపన పేరుతో వసుచరిత్రకు పీఠిక రాస్తూ కిందివిధంగా వివరించారు. ఈ కథలో మూడు పొరలున్నాయి. 1. ఉపరిచరవసు వృత్తాంతము(పైకి కనిపించే కథ) 2. ఇంద్ర వృత్రాసుర కథ (అంతర్గతంగా ఉన్న కథ) 3. జలం కథ (సామాన్య ప్రకృతి సన్నివేశం). ఆకాశంలో మేఘములు కప్పుకొని మెరుపులు మెరిసి జలము కురియగా మేఘుడు రాక్షసుడని, వానిని ఇంద్రుడు మెరుపు

అనే ఆయుధంతో చంపి వర్షాన్ని ప్రసాదించాడని ఆదిమ కాలంనుండి నమ్ముతున్న ఒక జానపద కథ.

వసుచరిత్రకు శాకుంతలానికి పోలికలున్నాయని కుడా అదే పీఠికలో చెప్పారు. వసురాజు ఉద్యానవనానికి వెళ్ళగా, దుష్యంతుడు వేటకోసం అడవికి వెళ్ళాడు. వసురాజు గిరిక సంగీతం విని అక్కడికి వెళ్ళాడు. శాకుంతలంలో ఒక సారంగం దుష్యంతున్ని కణ్వమహర్షి ఆశ్రమానికి తీసుకుపోయింది. ఇక్కడ సారంగమే సంగీతమైనది. దుష్యంతుడు వసురాజు ఇద్దరు తరుఛాయాలలో దాగినారు. దుష్యంతుడు తన స్వరూపాన్ని కనిపించనీయలేదు, వసురాజు మారువేషంలో కనిపించాడు. వసుచరిత్రలోని మంజువాణి శాకుంతలంలోని అనసూయ, ప్రియంవద, సానుమతి స్థానాలలో కనిపిస్తుంది.

ప్రాగ్రూపాలకు ప్రతీకలకు మధ్య విస్పష్టమైన విభజనరేఖ గీయటం సాధ్యం కాదన్నారు. ప్రాగ్రూపం కవి ఇచ్ఛారహితంగా అతని రచనలో ఆవిష్కృతమైతే, కవి ఇచ్ఛా సంయోగం కలిగిన పురాగాథల ఒత్తిడి కారణంగా ప్రతీక ఆవిర్భవిస్తుందని తెలిపారు. అన్ని ప్రాగ్రూపాలు ప్రతీకలు కావు. అలాగే అన్ని ప్రతీకలు ప్రాగ్రూపాలు కావు. కొన్ని ప్రాగ్రూపాలు మాత్రం ప్రతీక లక్షణాలను కలిగి ఉంటాయని సూత్రీకరించారు.

**"ప్రాచీన, ఆది భావాంశాలు కాలక్రమాన ప్రసరిస్తూ, ప్రవహిస్తూ, ఘనీభవించే దశకు చేరుకుంటాయి. ఈ దశను ప్రాగ్రూప ఆవిర్భావ దశ అనవచ్చు." "సాహిత్య సృజనకు ఏ దశలోనైనా ఆ జాతి పురాగాథాలు దాని అనంత కాలపు అనుభవాలు సంపుటాలుగా నిలిచి ఆధార సామగ్రిగా నిలిచి ఉంటాయి. రచనలో ఉపమాది సామాగ్రియైనా నిర్మాణపు మాదిరులైనా ఈ పురాగాథల ఆధారం మీద నిలిచి ఉండడం కద్దు"** అని సుప్రసన్న పురాగాథల ప్రభావాన్ని వివరించారు.

ప్రాగ్రూప విజ్ఞానం లేకపోతే పురాణ వాఙ్మయమంతా అర్థంకాక నిరర్థకంగా కనిపిస్తుంది. పురాగాథలలోని అంశాలు అన్ని అనన్వితాలుగా, దుర్గమాలుగా తయారవుతాయి. రచనలను, రచయితలను అంచనా వేయడంలో కొన్ని నూతనాంశాలు బయటికి వస్తాయి. రచయిత జీవించే సమాజపు పరంపరాయాతమైన వ్యక్తిత్వం తెలుస్తుంది. అని ప్రాగ్రూప విమర్శా ప్రయోజనాలను వివరించారు. **"యూంగ్ ప్రతిపాదించిన ప్రాగ్రూప తత్త్వవివేచన అపూర్వ అనుసంధానమై ప్రాచీన పరంపరాయాతాలుగా వస్తూ ఉన్న పురాగాథల ఆంతర్యాన్ని ఆధునిక సాహిత్య సృజనలో వాటి ప్రాధమ్యాన్ని వ్యక్తం చేయడంలో వినూత్న జ్ఞానకవాటాలు తెరిచింది."** అని వివరించి ఆ వివేచనను తెలుగు వారికి అందించి తెలుగులో ప్రాగ్రూప వివేచనకు ప్రారంభకులుగా సుప్రసన్నాచార్య నిలిచారు.

**ఆధార గ్రంథాలు :**


1. ఆనందారామం, సి. (1990). తులనాత్మక సాహిత్యం-నవలాప్రక్రియ (వ్యవస్థాగత దృక్పథం). హైదరాబాద్: విశాలాంధ్ర బుక్ హౌస్.
2. కోటేశ్వరరావు, తుమ్మపూడి (1999). సాలభంజిక. అనంతపురం : ఆంధ్ర భారతి.
3. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం (2008). కొన్ని కావ్యాలు-కొందరు కవులు. అనంతపురం: లక్ష్మీ గ్రాఫిక్స్.
4. తిరుమలరావు, సర్దేశాయ్ (2002). విమర్శ-ప్రతి విమర్శ. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
5. ప్రేమలత, రావి(1983). తెలుగు జానపద సాహిత్యము - పురాణగాథలు. సికింద్రాబాద్: అవేర్ ప్రింటింగ్ ప్రెస్.
6. ప్రేమలత, రావి(2015). ఆలోకనం. హైదరాబాద్:కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్.
7. మందేశ్వరరావు, వడలి (1994). పాశ్చాత్య సాహిత్య విమర్శచరిత్ర-సిద్ధాంతాలు. హైదరాబాద్: పొట్టి శ్రీరాములుతెలుగు విశ్వవిద్యాలయం.
8. సుప్రసన్నాచార్య, కోవెల(1993). భావుకసీమ (సాహిత్య వ్యాస సంపుటి). హైదరాబాద్: యువభారతి.
9. సుప్రసన్నాచార్య, కోవెల (1983). సహృదయ చక్రము. వరంగల్: శ్రీ వాణి ప్రచురణలు.
10. సుప్రసన్నాచార్య, కోవెల (2006). అంతరంగం (పీఠికా సముచ్చయం). వరంగల్: సృజనలోకం.
11. Barbara Hunnah, (1976). Jung;His life and work. London: Putnam Adult.
12. Bodkin, Maud(1978). Archetypal Patterns in Poetry.London: Oxford University Press.
13. Campbell, J.(1956).The Hero with a Thousand Faces.New Jersey: Princeton University Press.
14. Freud, Sigmund (1972). Creative Writers and Day Dreaming. In David Lodge (Ed.), 20th century criticism. London: Longman Group Ltd.
15. Frye, Northrop (1957).The Anatomy of Criticism (Four Essays) (Third Essay; Archetypal Criticism: Theory of Myths). London: Penguin Books.

# సీమ అస్తిత్వ గానం - చిలుకూరి దత్తగేయం

**డా. అప్పిరెడ్డి హరినాథ రెడ్డి,** అనంతపురం. ఫోన్ : **996 391 7187**

ప్రస్తుతం రాయలసీమ అని వ్యవహారంలో ఉన్న ప్రాంతం ఆంగ్లేయుల పాలనలో దత్తమండలాలుగా పేరుతో పిలిచేవారు. క్రీ.శ 1800 నాడు బళ్ళారి జిల్లాతో కూడిన రాయలసీమ ప్రాంతాన్ని నిజాం నవాబు సైన్యసహకార పద్ధతిలో తనకు కావలసిన సైన్యం కోసం బ్రిటిష్ వారికి వదిలేసాడు. ఇక్కడ వదిలేసాడు అని ఎందుకంటున్నా నంటే "సీడెడ్ డిస్ట్రిక్ట్స్" అని బ్రిటిష్ వారు ఈ ప్రాంతానికి పేరు కొనసాగించారు. పై సీడెడ్ కు "వదిలివేసిన" అని అర్థం. అంటే నిజాం వదిలివేసిన ప్రాంతం అని భావం. ఈ పదం తెలుగులో వాడకం ఎబ్బెట్టుగా ఉంటుందని ఎవరో పుణ్యాత్ములు "దత్త" అని అనువాదం చేసి వాడుకలోకి తీసుకొచ్చారు. ఏదైన తాకట్టు పెట్టారనే సందర్భంలో దత్తుకు పెట్టారని ఈ ప్రాంతంలో వాడకలో ఉంది. అంటే ఈ ప్రాంతాన్ని బ్రిటిష్ వారికి దత్తుకు ఇచ్చారు. అవకాశం ఉంటే తిరిగి విడిపించుకొని వెనక్కు తీసుకొనే అవకాశం దత్తులో ఉంటుంది. నిజాం తాత్కాలికంగా దత్తుకు పెట్టినా, ఆ తరువాత విడిపించుకోలేక వదిలేసాడు. నిర్దిష్ట సమయానికి దత్తు రద్దు చేసుకోవాలి. లేదంటే అది తీసుకొన్న వారి పరం అవుతుంది. ఎలాగూ నిజాం విడిపించుకోలేడని భావించిన ఆంగ్లేయులు 'వదిలేసిన ప్రాంతం' అని తొలిరోజులలోనే నిశ్చయించుకొన్నట్టున్నారు. వదిలేసిన మండలాలు అనే కంటే ఈ ప్రాంతంలోని దత్తుకు అర్థంలో 'దత్త మండలాలు' అని ఉండటం కొంత గౌరవంగా ఉంటాదని ఆనాటి ఈ ప్రాంతం వారు భావించి ఉంటారు.

దత్తమండలం అని ఏకవచనంలో కాకుండా మండలాలు అని బహువచనంగా ఆంగ్లేయులు అనడం ఇక్కడ గమనించవలసిన అంశం. ఈ ప్రాంతం చారిత్రకంగా, పాలనా పరంగా అప్పటికే మనుగడ సాగిస్తున్న ఒక నిర్దిష్ట భూభాగాన్ని బహువచనంగా వారు భావించడంలో, ప్రచారం చేయడంలో అంతరార్థం ఉంది. ఈ ప్రాంతం ఐక్యం కాకూడదనే ఉద్దేశం వారిది. ఇదంతా ఒకే ప్రాంతం, చరిత్ర, సంస్కృతి అనే భావన రాకుండా మండలాలు అని లేని విభజన కల్పించారు. ఐక్యమై తిరుగుబాట్లు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకొన్నారనిపిస్తుంది. ఇది ఒక రకమైన మానసిక ఎత్తుగడ. అయినా ఈ ప్రాంతంలో 1800 నుండి 1847 దాకా అర్ధ శతాబ్దం పాటు ప్రజలు తిరుగుబాట్లు చేసారు. సాయుధ పోరాటాలు కూడా చేసారు.

1800 నుండి 1928 దాకా అంటే 128 సంవత్సరాల పాటు ఈ ప్రాంతాన్ని దత్త అనే ఎందుకు పిలవాలి? ప్రత్యామ్నాయంగా ఇతరా ఏదైనా పేరు ఉంటే హుందాగా ఉంటుంది కదా అని




ఆలోచించిన వారు లేరు. ఈ ప్రాంతం అభివృద్ధి విషయంలోనే కాదు సాంస్కృతికంగాను ఆ రోజులలో ఎంత వెనుకబడి ఉందో దీని బట్టి అర్థమవుతుంది. బ్రిటిష్ పాలనలో తొలిదశ అనంతరం పెత్తందారులు, గ్రామాధిపత్యం వహించే వర్గాలు పూర్తిగా వారికి లొంగిపోయారు. ఇతర ప్రాంతాలలో అంటే కోస్తాంధ్రలో జమీందారులకు పాలన అప్పజెప్పి బ్రిటిష్ వారు పన్నులు స్వీకరించేవారు. కొద్దో గొప్పో జమీందారుల వల్ల సంస్థానాలలో సాహిత్యం, కళలు, సాంస్కృతిక వికాసానికి తోడ్పడినాయి. ఈ ప్రాంతంలో బ్రిటిష్ వారు ప్రత్యేక్షంగా తమ కింది స్థాయిలో గ్రామం వరకు తమ అధికారులను నియమించారు. జమీందారుల లాగా ఇక్కడ సాహిత్య, సాంస్కృతిక రంగాలకు ప్రత్యేక పోషణ లేకపోయింది. గ్రామాధికారులు, పెత్తందారుల ప్రయోజనాలు, ఆసక్తులు వేరు. వారి నుండి సాంస్కృతిక రంగాలకు ఒరిగిందేమి లేదు. ఏదో ఆసక్తి ఉన్న సంప్రదాయ కుటుంబాల నుండి పద్యసాహిత్యం అలాగే కొనసాగుతూ వచ్చింది.

1900 నుండి భారతదేశం, ఆంధ్రదేశంలో వస్తున్న సంస్కరణోద్యమాలు, జాతీయోద్యమం తదితర మార్పులను దత్త ప్రాంతం లోని విద్యావంతులు, యువకులు పరిశీలిస్తూ వచ్చారు. అలాంటి వారిలో గుత్తి కేశవపిళ్ళై, బళ్ళారి లోని కొలాచలం వెంకటరావు తదితరులు ముఖ్యులు. కాంగ్రెస్ కార్యకలాపాలు,

సామాజిక కార్యక్రమాలను శక్తివంతంగా కొనసాగించారు. ప్రధానంగా రాజకీయరంగంలో నిలిచారు. వీరి సమకాలీన సాహిత్యరంగాల వారు ఈ ప్రాంత చరిత్ర, సంస్కృతి, ఔన్నత్యంపై దృష్టి సారించే వాతావరణం ఏర్పడలేదు. కట్టమంచి రామలింగారెడ్డి ముసలమ్మ వద్ద, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ పెనుగొండ పాట వద్ద ఆ రోజులకు ఉన్నారు. అనంతపురము లో పప్పూరు రామాచార్యులు మరికొంతమంది కలిసి 1922 లోనే స్థానికంగా ఉన్న నది పేరుతో "పినాకిని" పత్రిక స్థాపించి, ఈ ప్రాంత జీవన స్థితిగతులు అద్దం పట్టాలని ప్రయత్నించారు. అక్కడ కూడా దత్తమండలం పేరు ఎందుకుండాలనేంత వరకు ఆలోచన కలగలేదు. పప్పూరి వారే 1926 లో సాధన పత్రిక కొత్తగా ఏర్పాటు చేసినా పత్రిక ఉపశీర్షికగా "ది వాయిస్ ఆఫ్ సీడెడ్ డిస్ట్రిక్ట్స్" దగ్గరే ఉండిపోయారు. ఈ ప్రాంతంలో సామాజిక సంస్కరణలు, పత్రికల స్థాపన, రాజకీయ పోరాటాలు విస్తృతంగా సాగుతున్నా పేరు మార్పు విషయమై ఇప్పటికి లభిస్తున్న వివరాలతో చూసినపుడు 1928 దాకా ఎవరికీ తట్టలేదని పిస్తుంది. అలా తట్టక పోవడానికి కారణం ఆంధ్ర నాయకత్వం లోని జాతీయ కాంగ్రెస్ నిర్ణయాలను ఈ ప్రాంత నాయకులు అమలు చేసుకొంటూ ఉండటం, ఈ ప్రాంత పై స్థాయి నాయకత్వం జాతీయ కాంగ్రెస్‌లో ఇమిడిపోవడం, తన ప్రయోజాలను వదులుకొని విశాల దృక్పథంతో సాగడం, కలిసి ఉంటే ఈ ప్రాంతానికి మేలు చేస్తుందనే భావన నెలకొనడం, జాతీయోద్యమమే ప్రధానం కావడం ఇలా అనేక కారణాల వలన దత్తమండలం పేరు విషయమే కాదు మరెన్నో విషయాలలోను ప్రాంతీయ దృష్టి కొరవడింది.

ఈ చారిత్రక నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజల అస్తిత్వాన్ని, భవితవ్యాన్ని గురించి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆంధ్రోద్యమం, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆలోచింప చేసాయి. 1926లో ఆంధ్ర విశ్వ విద్యాలయం విజయవాడ కేంద్రంగా స్థాపించారు. అనేక ఏళ్ళుగా ఆశలు పెట్టుకున్న దత్తమండల వాసుల కలచెదిరిపోయింది. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఆందోళన నెలకొంది. మద్రాసు శాసనమండలిలో ఈ విషయమై ఓటింగ్ జరిగింది. అనంతపురము లోనే విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని తీర్మానం నెగ్గింది. సెనేట్‌లో, ఆంధ్రమహాసభలో కూడా అమోదం తెలిపారు. కానీ చివరకు 1928 డిసెంబర్ లో అనంతపురము కాదని విశాఖపట్నంలో విశ్వవిద్యాలయం స్థాపించారు. 1925 నుండి 1928 దాకా దత్తమండలంలోని సంఘాలు, పత్రికలు, నాయకులు ఈ విశ్వవిద్యాలయం విషయంగా తీవ్రమైన చర్చ జరిగి ఈ ప్రాంత సాధారణ ప్రజలలో కూడా రాజకీయ చైతన్యం రావడానికి కారణమైంది.

మరో వైపు 1913 లో ఆంధ్రమహాసభ మొదలై ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనకు కృషి చేసింది. దత్తమండల వాసుల మద్దతు లేనిదే ఆంధ్రరాష్ట్రం ఏర్పడటం అసాధ్యం. దత్తమండల వాసులు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం, మద్రాసు లోనే ఉండడం, ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటం అలా విభిన్న ఆలోచనలలో ఉన్నారు. ఎలాగైనా దత్తమండల వాసుల మద్దతు సాధించాలని ఆంధ్రమహాసభ ప్రయత్నాలు చేసింది. ఈ క్రమంలోనే అనంతపురములో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కూడా ఆంధ్రమహాభ ఒప్పుకుంది. దత్తమండల వాసుల అసంతృప్తిని ఆంధ్రమహాసభ గమనించింది. 1928 నవంబర్ 17,18 తేదిలలో ఆంధ్రమహాసభలు నంద్యాలలో ఏర్పాటుకు సన్నాహాలు చేసింది. దత్తమండల నాయకులు ఆంధ్రమహాసభలలో భాగంగా దత్తమండల సభను ప్రత్యేకంగా ఒక పూట ఏర్పాటు చేసి ఈ ప్రాంత సమస్యలు చర్చించాలని పట్టుబట్టారు. తప్పని పరిస్థితులలో ఆంధ్రమహాసభ అందుకు సమ్మతించింది. ఇందులో భాగంగా 18వ తేదీన ప్రథమ దత్తమండల సభ జరిగింది. ఈ సభలో అనేకమంది దత్తమండల నాయకులు సాహితీవేత్తలతో పాటు చిలుకూరు నారాయణరావుగారు కూడా పాల్గొన్నారు. చిలుకూరు వారికి దత్తమండలంతో ఉన్న సంబంధం ఈ సందర్భంలో పరిశీలించాలి.

చిలుకూరి నారాయణరావు 1889 సంవత్సరంలో విశాఖపట్నం జిల్లా, పొందూరు దగ్గర ఆనందపురంలో జన్మించారు. అక్కడే ప్రాథమిక విద్య పూర్తి చేసారు. తర్వాత 1914 లో యం.ఏ పూర్తి చేసారు. ఉన్నత విద్యాబోధనకు అవసరమైన ఎల్.టి పట్టా పొందారు. 1914లో శ్రీకాకుళం మునిసిపల్ హైస్కూలులో తాత్కాలికంగా ఉపాధ్యాయ ఉద్యోగం లభించింది. తర్వాత విశాఖపట్నం సి.బి.యం పాఠశాలలో పని చేసారు. స్కూళ్ళ ఇన్స్పెక్టర్ జె.ఏ.ఏట్స్ తోను చిలుకూరి గారికి ఎంతో సాన్నిహిత్యం ఉండేది. రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాలలో తెలుగు సంస్కృత పండితుడుగా, వెర్నాక్యులర్స్ సూపరింటెండెంట్ గా ఉద్యోగం చేరాడు. ఈ సమయంలోనే "ఆంధ్రదేశీయేతిహాస పరిశోధక మండలి"ని స్థాపించి చారిత్రక, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగించారు. 1927 జనవరి నెల ఆఖరున అనంతపురము సీడెడ్ డిస్ట్రిక్ట్స్ ఆర్ట్స్ కాలేజిలో ప్రాచ్యభాషా శాఖాధిపతిగా బాధ్యతలు చేపట్టాడు. ఈ విధంగా చిలుకూరి వారు ఉత్తరాంధ్ర నుండి దత్త మండలానికి ఉద్యోగ బాధ్యతలపై వచ్చి అనంతపురములోనే స్థిరపడ్డారు.


దత్త కళాశాల అని పేరు చూడగానే భాష, సాహిత్య, చరిత్రలతో విశేష పరిచయం ఉన్న చిలుకూరి వారు అసలు ఈ ప్రాంతాన్ని దత్త అని అనడం సబబేనా? అని ఆలోచించాడు. వెంటనే దత్త కళాశాల కళాశాల మ్యాగజైన్ లో "దత్త" పేరుతో గేయం రాసాడు. ఈ మ్యాగజైన్ లోని ఆ గేయాన్ని 1928 సెప్టెంబరు 8న సాధన పత్రికలో పప్పూరు రామాచార్యులు ప్రచురించాడు. దత్తగేయం గురించి తర్వాత పరిశీలిద్దాం.

ఆంధ్రవిశ్వవిద్యాలయం వివాదం, దత్త మండల వాసుల ఆకాంక్షలు, ఈ ప్రాంత సమకాలీన, సాంస్కృతిక సమస్యలన్ని

అనంతపురము చేరిన తక్కువ సమయంలోనే చిలుకూరి వారు పట్టుకోగలిగారు. నంద్యాలలో దత్తమండల ప్రథమసభ నిర్వాహకుల దృష్టికి సాధన పత్రికలో వెలువడిన దత్తగేయం గురించి తెలిసింది. ఆ సభకు చిలుకూరి వారిని కూడా ఆహ్వానించారు. ఈ ప్రాంత ప్రజల ఆత్మగౌరవం, వ్యక్తిత్వం కాపాడుకోవడానికి దాస్యచిహ్నంగా ఉన్న దత్తమండలం కాకుండా వేరే పేరు ఏదైనా ఉండాలని చర్చ జరిగింది. చిలుకూరి వారు "దత్తమండలం" బదులు "రాయలసీమ" అని ఉండటం సమంజసంగా ఉంటుందని ఆ సభలో ప్రతిపాదించాడు. "దత్తనెల్లగుదు" అని దత్తగేయంలో ప్రశ్నించిన చిలుకూరి వారే అందుకు సమాధానంగా "రాయలసీమ" అనే పేరును ఈ ప్రాంతానికి సూచించాడు. ఆ తర్వాత సాధన పత్రికలోను, జన వ్యవహారంలోను రాయలసీమ గా ఈ ప్రాంతానికి పేరు స్థిరపడింది.

ఆంధ్రుల ఐక్యత కోసం, ప్రధానంగా దత్తమండల వాసుల మద్దతు కోసం శ్రీకృష్ణదేవరాయుల నాలుగు వందల పట్టాభిషేక ఉత్సవాలను ఏర్పాటు చేయాలని ఆంధ్ర మహాసభ కార్యక్రమం చేపట్టింది. ఇందుకు సంబంధించిన ప్రకటన 1928 ఫిబ్రవరిలో వెలువడింది. అనంతపురము జిల్లా పెనుకొండలో 1929 ఫిబ్రవరి 22 న ఉత్సవాలు నిర్వహించాలని తీర్మానం చేసింది. నంద్యాల సభలో అప్పటికే ఈ ప్రాంత ప్రజల ఆత్మగౌరవ సూచకంగా రాయలసీమగా పేరు మారింది. సీమ సమస్యలపై ఆ సభలలోనే ఒక స్పష్టత వచ్చింది. ఆంధ్రవిశ్వవిద్యాలయం కూడా సీమలోనే ఉంటాదని నంద్యాలలో భావించారు. కానీ ఒక నెల తిరగకుండానే డిసెంబర్ లో ఆంధ్రవిశ్వవిద్యాలయం సీమ పోగొట్టుకొంది. సీమ వాసులు ఉడికిపోతున్న సందర్భంలో మళ్ళీ శ్రీకృష్ణదేవరాయల పేరున ఈ ప్రాంతంలో ఆంధ్ర మహాసభ ప్రవేశించడాన్ని సీమవాసులు అసంతృప్తి వ్యక్తం చేసారు. కానీ సీమ పెద్దల సయోధ్యతతో పెనుకొండలో శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక ఉత్సవాలు 1929 ఫిబ్రవరి 22 జరిగాయి. ఈ సభలు రాయలసీమ చరిత్ర, సంస్కృతుల అవగాహనకు తోడ్పడినాయి. సభలో సీమవాదులు ఆంధ్ర విశ్వవిద్యాలయం జరిగిన అన్యాయాన్ని బహిరంగంగా ఎత్తిచూపారు. సీమ సాహిత్య సాంస్కృతిక రంగాలలో కృషి జరగాలని ఆ సభలు పరోక్షంగా స్ఫూర్తినిచ్చాయి. ఈ పెనుకొండ సభలలో ఆంధ్ర, రాయలసీమ సాహిత్యరంగాల వారితో పాటు చిలుకూరి వారు కూడా పాల్గొన్నారు.

ఆ తర్వాత సంవత్సరం1930 ఫిబ్రవరి 12 నుండి 16 వరకు రాయలసీమ వాసులు స్వతంత్రంగా శ్రీకృష్ణదేవరాయలు జయంత్యుత్సవాలను చేపట్టారు. చిలుకూరి వారు ఆ సభలో అధ్యక్షోపన్యాసం చేసారు. **"శ్రీకృష్ణదేవరాయలు ఆంధ్రులందరికీ సంబంధించిన వారవుతారే తప్ప కేవలం రాయలసీమ వారికే కాదు"** అనే ఆంధ్రవారు లేవదీసిన ప్రశ్నలకు సమాధానంగా చిలుకూరి వారు ఉపన్యాసంలో



వివరించారు. రాయలసీమ అనే ఈ పేరు పెట్టడానికి గల కారణాలను సవివరంగా వివరించాడు. **"రాయలసీమ అనే పేరు శ్రీకృష్ణదేవ రాయలు సంబంధం మాత్రమే కాదని మొత్తం విజయనగర రాజుల పరంపరలో భాగమని, ఈ ప్రాంతం విజయనగర చివరి రాజుల దాకా అస్థిరంగా పాలించబడింది కాబట్టి ఈ ప్రాంతానికి రాయలసీమ అని ఉండటం ఉచితమన్నాడు. ఈ ప్రాంతం నుండే ఆంధ్రరాజ్య, భాష విస్తరణకు విశేష కృషి జరిగింది. రాయలసీమ ఆంధ్ర దేశానికి మూర్ధస్థానం అలంకరించుకుంది. రాయ శబ్దం శ్రేష్ఠవాచకంగా ఈ ప్రాంతానికి ఉండటం ఉచితం. ఎంతో పేరు ప్రఖ్యాతులున్న ఈ ప్రాంతం దత్తగా అసభ్యవాచకం ఉండడం అసమంజసం. దత్తమండలాలు అని వేరు వేరు కాకుండ రాయలసీమ అని ఏకత్వ సూచకంగాను ఉండటం సమంజసం"** అని తన అభిప్రాయాన్ని తెలిపాడు. **"మొదటి ఇప్పటి తెలుగు దేశమంతటికిని ఆంధ్రదేశమను పేరు లేకపోయినను, మొట్టమొదటి ఆంధ్రమహాజనసభలో ఆంధ్రదేశమను పేరుతో ఆంధ్రభాష వ్యవహారములో నున్న దేశమంతటికిని ఏకత్వము కలిగినది. నంద్యాల సభలో దానిలోని అంతర్భాగమయిన యీ సీమకు ఏకత్వము కలిగినది. రాయలసీమ అను నామము లోకములో ప్రాకిపోయినది. ఇక ఇక్కడివారు విడిపించుకొనుటకు గాని, ఇతరులు తీసివేయుటకు గాని సాధ్యము కాదు"** అని చిలుకూరి వారు ప్రకటించారు.

ఈ సభలలో పాల్గొన్నవారు **"రాయలసీమ పరిశోధక మండలి"** ఏర్పాటు చేసి ఈ ప్రాంతం పై పరిశోధనలు చేయాలని తీర్మానం

చేసారు. పరిశోధనలతో పాటు విద్యా, విజ్ఞాన, సాంస్కృతిక రంగాలకు తోడ్పడేలా సంస్థ ఉండాలని సూచనలు అందాయి. రాయలసీమ పరిశోధక మండలి అని ఉద్యమ స్ఫూర్తితో, సూటిగా ఏర్పడాలనే ప్రయత్నం ఎటుపోయి ఎటు తిరుక్కొంటుందో అని విశాల దృక్పథం ఉన్న పెద్దలు కొంత ఆచితూచిగా సభలో ఆలోచించినట్లున్నారు. చివరకు **"శ్రీకృష్ణదేవరాయ విద్యాపరిషత్తు"** పేరు పెట్టి చిలుకూరి నారాయణరావు, పప్పూరు రామాచార్యుల వారిని అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కల్లూరు సుబ్బారావు, కైప సుబ్రహ్మణ్యశర్మ, మల్లంపల్లి సోమశేఖరశర్మ, వార్తకవి రామచంద్రరావు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి గోపాలకృష్ణ శర్మ, శివ శంకరపిళ్ళై తదితరులు కార్యవర్గంలో ఉన్నారు. ఆ తర్వాత కాలంలో అనేక సభలు, పుస్తక ప్రచురణలు, పరిశోధనలు, ప్రదర్శనలు నిర్వహించి రాయలసీమ సాంస్కృతికోద్యమానికి ఈ పరిషత్తు విశేషంగా కృషి చేసింది.

ఈ విధంగా ఈ ప్రాంతానికి **"దత్తనెల్లగుదు"** అని ఆలోచించి **"దత్త గేయం"** రాసి, రాయలసీమ పేరు పెట్టి, సంస్థలను స్థాపించి చిలుకూరి నారాయణరావు విశేషంగా కృషి చేసారు. రాయలసీమ ప్రాంతం వారు వీరిని దత్తపుత్రుడని ఏనాడు భావించక సొంత రాయలసీమ సీమబిడ్డలా గుండెలలో దాచుకున్నారు.

ఈ మొత్తం పరిణామాలకు కారణమైన **"దత్త గేయం"** విషయం పరిశీలిద్దాం.

దత్తగేయం మంజరీ ద్విపదలో సాగింది. గేయ ప్రక్రియలో ఎన్నుకోవడంలోనే చిలుకూరి వారి ప్రజాస్వామిక దృష్టిని తెలియజేస్తుంది. సులభంగా సాధారణ ప్రజలు పాడుకోవడానికి ఈ ప్రక్రియ అనువుగా ఉంటుంది. చిలుకూరి వారు తరువాత కాలంలోను **"ముసలమ్మ, మా నంద్యాల"** తదితర రచనలు గేయాలు గా సాగాయి.

తెలుగు ఛందస్సులో జాతి విభాగానికి చెందిన ద్విపద లక్షణాలే మంజరీ ద్విపదకు వర్తిస్తాయి. రెండు పాదాలుగా ఉంటాయి. ఎన్ని పాదాలైనా రాసుకోవచ్చు. ఏ పాదానికి ఆ పాదం వేరుగా ఉంటుంది. రెండు పాదాలను ఒక పదంతో కలపరాదు. ప్రతి పాదంలోను మూడు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం వరుసగా ఉంటాయి. మూడవగణం మొదటి అక్షరం యతిస్థానంగా ఉంటుది. ద్విపదలో ప్రాస నియమం ఉంటుంది. మంజరీ ద్విపదలో ప్రాస ఉండదు. ఈ ఒక్క ప్రాస నియమం లేకుండా ఉండడమే ద్విపద నుండి మంజరీ ద్విపదను వేరు చేస్తుంది. శ్రీనాథుని 'పల్నాటి వీరచరిత్ర', తాళ్ళపాక తిమ్మక్క 'సుభద్రా కళ్యాణం' తదితర ప్రముఖ కావ్యాలు మంజరీ ద్విపదలోఉన్నాయి.

దత్త గేయం 128 పంక్తులుగా ఉంది. పాడుకోవడానికి అనువైన ఊపు, నడకలో హొయలు, పదాల అమరికలో సమయస్ఫూర్తి ఇందులో కనిపిస్తుంది. వీరత్వం, ఉత్తేజం కలిగించే విధంగా ఈ ప్రాంత వైభవాన్ని స్మృతికి తెస్తుంది. వస్తురీత్యా సమగ్రంగా ఉంది. ఒక లయాత్మక ధార గేయం చివరి దాకా కొనసాగుతుంది. ఒక నిర్దిష్ట ప్రాంతంలోని వేయేండ్ల చారిత్రక, సాంస్కృతిక అంశాలను వరుసలో క్రమంలో చెబుతూ, పై లక్షణాలను ప్రతిబింబిస్తూ గేయం నడపడం కత్తిమీద సామువంటిదే అవుతుంది. దానికి ఎంతో చారిత్రక, సాంస్కృతిక, సృజనాత్మకత, సమకాలీన అవగాహన ఉండాలి. అవన్నీ నింపాదిగా ఉన్న చిలుకూరి వారే ఆపని చేయగలిగారు.

గేయం మొత్తం స్వగతంగా ఒక ప్రాంతమే పాత్రగా మారి చెబుతున్నట్లు సాగడంతో పాఠకులు, శ్రోతలు వెంటనే తాదాత్మ్యీకరణం చెంది గేయంలో లీనమవుతారు. గేయం ప్రధానంగా రెండు అంశాల ఆధారంగా నడుస్తుంది. తోటి మరాఠా కర్నాటక ప్రాంతాలు ఈ ప్రాంతాన్ని దత్త అని ఎగతాళి చేయడంతో వారికి సమాధానంగా ఈ ప్రాంత వైభవం వివరించడం ఒక ఎత్తు. ఇలాంటి పరిస్థితులలో తోటి ఆంధ్రులు ఈ ప్రాంతానికి మరింత అండగా నిలిచి కలిసి ఐక్యతతో సాగి అభివృద్ధి వైపు సాగాలనే సందేశం మరో భాగంగా కనిపిస్తుంది.

గత చరిత్రను, సమకాలీన పరిస్థితులను ఎంతో సమన్వయంగా ఇందులో మిళితం చేసాడు. ఆంధ్రోద్యమం సాగిస్తున్న ఆంధ్రులు సీమ విషయంగా ఉదారంగా ఉంటూ మరింత మద్దతు సంపాదించాలని ఒక పెద్దమనిషిలా సూచిస్తాడు. సీమ వాసులు కూడా ఆత్మనూన్యత వీడి తమ పూర్వీకుల చారిత్రక, సాంస్కృతిక మూలాలతో, ఆత్మవిశ్వాసంతో సాగాలనే ప్రబోధం కూడా ఇందులో కనిపిస్తుంది.

"మారాష్ట్రి నామాట మరచినా వమ్మా
కర్ణాటి నా పాటు కన్నావటమ్మ
దత్తనందురు నన్ను దత్తనెల్లగుదు
రిత్తమాటల చేత చిత్తమ్ము కలిగె
ఇచ్చినదెవరో పుచ్చినదెవరొ
పుచ్చుకొన్నట్టి యసపురుషులు నెవరొ
'తురక బిడ్డండిచ్చె దొరబిడ్డ పట్టె
మరదలా!' యని యిటు మరియాదమీరి
పరిహాసములు సేయ తరిగాదు నేడు
వెర వెరగించుడీ యిరవుగా మీరు
అత్తసొమ్మును గొని యల్లుడు దాన
మమరజేసె నటన్న యట్టులున్నదిది
నేనాంధ్రి ననుమాట యేనాడు నుండె
నీవాడు నానాటికి కిట్టిపాటొదవె
వదినరో! కర్ణాటి వచియింపవమ్మ
వదినరో! మారాష్ట్రి పలుకవేమమ్మ"... అని గేయం ప్రారంభమవుతుంది.

తెలుగు వారికి సమీపంగా ఉన్న మరాఠీ కర్ణాటక వారు దత్త అని ఈ ప్రాంతాన్ని పరిహాసం చేస్తున్న నేపథ్యంలో వారిని దత్త అని నన్ను ఎలా అంటారు? నేను ఆంధ్రిని, నా గొప్పదనం మీకు తెలియదా? అని ప్రశ్నిస్తున్నట్లు గేయం ప్రారంభమవుతుంది.

"ఆంధ్ర రాజులు నాకు నండయైనప్పు
డా చళుక్యులు నన్ను గాచియున్నప్పుడు
రాష్ట్ర కూటులు నన్ను రక్షించినపుడు
కాదంబులు నన్ను కాపాడినపుడు
బాణరాజులు నన్ను పాలించినపుడు
కాకతీయులు నన్ను సాకినయపుడు
నేనే కదా యాంధ్రి నీవాడిదేమి
యీ దబ్బరలు పల్కి యిట్లు సేసెదరు".... అని ఈ ప్రాంతం వివిధ కాలాలలోని రాజ వంశాల పాలనల గురించి తెలియచేస్తాడు. వృథా మాటలతో బాధపెడుతూ మాట్లాడేదేంది? అని ఈ ప్రాంత గొప్పదనం తెలియచేస్తాడు.

"విద్యల నగరము విజయనగరము
చోద్యమందుచు మీరు చూడలేదమ్మా
రత్నాల తోరణాల్ రంజిల్లుచుండ
వజ్రాల దీపికల్ వరుసగా వెలుగ
ముత్యాలముగ్గులు ముచ్చటల్ గొలువ
బంగారు పసుములు ప్రబలుచునుండ
నా వైభవము పెంపు నాయింటి సొంపు
నగళుల నాడెపు నవ్య మౌనింపు
చూచినారే కదా చోద్యమమందుచును" ... అని ఒకనాటి ఈప్రాంత రాజధాని నగరమైన విజయనగర వైభవాన్ని ఘనంగా తెలియచేస్తాడు.

"కన్యనిచ్చినయట్టి కటకేశుడెరుగు
ఉదయ గిరీశుండు నుదురుచు దెలుపు
శ్రీ వెంకటేశుండు చెలువొప్పజెప్పు
సింహాద్రినాథుండు చేయెత్తి పలుకు
నా విరూపాక్షుండు నను వీడలేదు
మీరు గానక యున్న మించిన దేమి?" .. అని వివిధ రాజులు ఇచ్చిన గౌరవాన్ని, ఈ ప్రాంతంలోని ఆలయాలతో ఉన్న అనుబంధాన్ని తెలియచేస్తాడు.

"దక్షిణ దేశంబు తడవించె నన్ను
ఉత్తరదేశంబు నుతికించె నన్ను
తూరుపు దేశంబు దోపించె నన్ను
పడమటి దేశాన ప్రబలించె నన్ను"..... ఇలా ఈ ప్రాంతం అన్ని వైపులా ఇబ్బందులు ఎదురైన కాలంలో.....

"వీరుడై శౌర్యంబు వెలయించి సజ్జ
నాధారుండై ధారుణీధవుండగుచు
రాజ్యంబునెల్లను రంజిల్ల జేసే
నా ముద్దు కృష్ణుడు సరనాథమౌళి
నా కృష్ణరాయండు నానాథుడాత
డాతని పరిచయ మానాడు కొంత
కాంతలారా మీకు కలిగియున్నదియె" ... అని శ్రీ కృష్ణదేవరాయల వీరత్వాన్ని గురించి తెలియచేస్తాడు.

"ఆంధ్ర సామ్రాజ్యంబు ననుభవించితిని
ఆంధ్రుల దేశాలయందు నిల్పితిని
ఆంధ్రులకీర్తిని నంతట జాటితిని
ఆంధ్ర మర్యాదల నాదరించితిని" .... అని ఆంధ్రతో ఉండే సంబంధ బాంధవ్యాలను తెలిపి...

"నేనాంధ్రి యగుదునో యెవ్వతె యగునో
యే సవతికి బట్టు నీ పేరు నేడు?
దత్తనందురు నన్ను దత్త నెట్లగుదు
రిత్త దబ్బరలచే చిత్తమ్ము కలిగె"... అని బాధను వ్యక్తం చేస్తాడు.

ఇలా దత్త పేరుతో అవమానాల పాలవుతున్న ఈ ప్రాంతానికి తోటి ఆంధ్రులు...

"సాయంబుగా నాకు చేయూత యొసగి
చేర్పరే యాయింట చెలిమితో మీరు
చెప్పరేయాయమ్మ చెవికెక్క మీరు
ఇది పాడి గాదని యెరిగింపరమ్మ
యిరువురికిని మేలు నెంచ జెపుడమ్మ" ... అని బాధ్యతను గుర్తు చేస్తాడు.

"పోతన్న నావాడు పొమ్మనలేదు
తిమ్మన నావాడు సుమ్మనలేదు
మూర్తి నావాడని మురియంగలేదు
సుబ్బడు నావాడె సుమ్మనలేదు
మా వారు మీ వారు మన వారటంచు
నెల్లకాలంబును నెంచు చుంటి"... అని ఇలా ఈ గడ్డపై ఎందరో కవులు ఉన్నా మన వారే అనుకొన్నాను. ఏనాడు వేరుగా చూడలేదని తెలుపుతాడు.

ఆంధ్రతో ఎంతో అనుబంధంగా కొనసాగే ఈ ప్రాంతం ఇపుడు.....

"నల్లకొండలు మధ్య నడ్డువచ్చెనని
నన్నెడసేయగా న్యాయంబు గాదు
నడవులు నంతరాలడ్డువచ్చెనని
నను జూడకుండుట న్యాయంబు గాదు"... అని ఆవేదనతో చిత్రిస్తాడు.

"నా భాగ్యమే తనదౌ భాగ్యమనుచు
నా లేమియే తనదౌ లేమి యనుచు
నా సౌఖ్యమే తనదౌ సౌఖ్యమనుచు
నా కష్టమె తనదౌ కష్టమనుచు
చెప్పరే యానతి చెవికెక్క మీరు
చాటరే సభలలో సరియైన తీరు"... అని ఆంధ్ర సోదరులు సీమ పట్ల నమ్మకం కలించి, అండగా నిలవాలని, సభలలో బహిరంగంగా చాటాలని కోరుతాడు.

"దరిచేర్చి నా సేమమరసిరయేని
ఇరుగువారలు మన పొరుగువారలును
సరిజూచి మన్నించి సఖ్యంబు నెరపి
గౌరవ బుద్ధితో గాంతురు మనల
నంతతో జూపట్టు నాంధ్రాభ్యుదయము"... అని గేయాన్ని ముగిస్తాడు. ఇరువురు సఖ్యతతో, ఐక్యతతో ఉంటేనే ఇతరులు గౌరవంగా చూస్తారు. ఇరు ప్రాంతాల అభ్యుదయం కూడా కొనసాగుతుందని చివరగా అంటాడు.

దత్తపుత్రుడు.. అనే పేరుతో ముగించిన ఈ గేయం దత్త అనే అవమానకరమైన పదం ఈ ప్రాంతానికి అసమంజసమని చాటుతుంది. ఈ ప్రాంత చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని, ఔన్నత్యాన్ని ఎలుగెత్తి చాటుతుంది. ఎన్నో ఏళ్ళుగా అనుబంధంగా కలసి సాగిన ఆంధ్రసోదరులు చిన్న చిన్న అవంతారాలు, అడ్డంకులను సాకుగా చూపి పట్టనట్లుగా వ్యవహరించ కూడదని తెలుపుతుంది. కష్టమైనా, సుఖమైన ఇరువురు నమ్మకంతో సాగితే అభివృద్ధి సాకరమవుతుందని తెలియచేస్తుంది. గౌరవంగాను ఉంటుందని చాటాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తదితర అంశాలలో ఇరుప్రాంతాల మధ్య తీవ్రవాదోపవాదాలు, అపనమ్మకాలు పెరిగిపోతు వచ్చాయి. ఆ తరుణంలో ఒక సమతాస్థితిలో చిలుకూరి నారాయణరావు అత్యంత నైపుణ్యంగా ఈ గేయం రాసాడు.

గేయంలో పాదాల చివరన కొన్నిచోట్ల నాలుగు పాదాలలో వరుసగా అంత్యప్రాసలు వినసొంపుగా గాచియున్నపుడు, రక్షించినపుడు, కాపాడినపుడు, పాలించినపుడు, సాకినయపుడు అని అమరాయి. ఇలాంటివి మరికొన్ని చోట్ల సహజంగా కుదిరాయి. ప్రతి పాదంలో మధ్యన ఒక పదం వరుసగా వాడడం కూడా విశేషంగా ఉంది. 'నాభాగ్యమే తనదౌ భాగ్యమనచు'. తర్వాత పాదాలలో 'తనదౌ' పద ప్రయోగం మూడు సార్లు ఆవృతమవుతుంది.

కొన్ని చోట్ల పాదాలు ఎంతో లయాత్మకంగా ఇలా సాగుతాయి.
"మీ వారు మావారు మనవారటంచు"
"చెప్పరే యానతి చెవికెక్క మీరు
చాటరే సభలలో సరియైన తీరు" ఇలాంటివి మరిన్ని కనిపిస్తాయి.

స్థానికంగా ఉపయోగించే "అత్తసొమ్మును గొని యల్లుడు దాన మమర జేసెనటన్న" వంటి జాతీయాలు కూడా గేయంలో సందర్భోచితంగా ఉన్నాయి.

తొమ్మిది దశాబ్దాల నాడే సీమ అస్తిత్వం నిలబెడుతూ గొప్ప గేయాన్ని చిలుకూరి నారాయణరావు వెలువరించినా అనంతర కాలంలో ఆ స్ఫూర్తిని వస్తుపరంగా, ప్రక్రియ పరంగాను సమీప కాలం వారు అందుకోలేక పోయారు. 1935 పుట్టపర్తి నారాయణాచార్యులు పెనుగొండ లక్ష్మి కావ్యంగా స్థానిక ఒక చారిత్రక పట్టణం పై రాసారు. 1953లో బెళ్ళూరి శ్రీనివాసమూర్తి కరువు నేపథ్యంగా "తపోవనం" ఖండిక రాసారు. 1956లో విద్వాన్ విశ్వం "పెన్నేటిపాట" గా ఒక సమగ్ర కావ్యం రాసారు. ఇవన్నీ వైయుక్తిక ప్రయత్నాలుగా కనిపిస్తాయి. సామూహిక పరంపరగా ఇవి సాగలేదు. ఇప్పటికీ సీమ సాంస్కృతిక, చారిత్రక అస్తిత్వాలను సాహితీ కరించడంలోనూ వెనుకబడి ఉన్నారు. ప్రజలకు అత్యంత చేరువగా ఉండే గేయం, పాట ప్రక్రియలలో చెప్పుకోదగ్గ పురోగతి లేదు. ఈ అంశాలపై దృష్టి సారించాలి. ఇన్నేళ్ళవుతున్నా ఇప్పటికీ చలనచిత్ర బాక్సుల పంపిణీ ప్రకటనలలో సీడెడ్ అని వాడుతుండటం కనిపిస్తుంది. అలా ఎందుకు వాడుతారని ప్రశ్నించే వారు కూడా అరుదు. ఈ ప్రాంత చైతన్యరాహిత్యాన్ని ఇది సూచిస్తుంది. ఫ్యాక్షన్ ఇతివృత్త సినిమాలలో ఒకటికి రెండుగా కల్పితం చేసి అదే పనిగా అవమానపరచడం, ఈ ప్రాంత భాషను కించపరచడం జరుగుతూనే ఉంది. చిలుకూరివారి దత్తగేయం స్ఫూర్తితో మరెన్నో గేయాలు నేటి సమకాలీన పరిస్థితులను అనుసరించి రావలసి ఉంది.

సరిగ్గా తొంబై ఎళ్ళనాటి పరిస్థితే నేడు ఆంధ్ర, రాయలసీమల మధ్య కొనసాగుతుంది. ఒకరిపట్ల ఒకరికి అపనమ్మకాలు కొనసాగుతూనే ఉన్నాయి. సీమ పరిస్థితిలో ఆనాడైనా ఈనాడైనా పెద్దగా మార్పులైతే లేవు. అభివృద్ధిలో సమానత్వం, వనరుల వినియోగంలో సరైనన్యాయం జరగనంతవరకు మనస్పర్థలు అలాగే ఉంటాయి. ఇరుప్రాంతాల పెద్దలు కుదుర్చుకొన్న శ్రీభాగ్ ఒప్పందం అమలు కానంత వరకూ మరెన్నో దత్తగేయాలు ఉదయిస్తూనే ఉంటాయి.

-----

**ఆధార గ్రంథాలు :**

1. సాధన పత్రిక – సంపాదకులు, పప్పూరు రామాచార్యులు.

2. శ్రీకృష్ణదేవరాయ జయంత్యుత్సవ ఉపన్యాసాలు, వ్యాసాలు – సంపాదకత్వం, డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి.

3. వాఙ్మయ తపస్వి డా.చిలుకూరి నారాయణరావు– డా. అవధానం ఉమామహేశ్వరరావు.

4. ఆత్మగౌరవవానికి ప్రతీక రాయలసీమ నామకరణం – డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి (వ్యాసం, పెన్నేరు పత్రిక, డిసెంబరు 2016)

# పుష్పవిలాపంపై కరుణశ్రీ వివరణ

**భాగవతము రామారావు,** హైదరాబాద్, ఫోన్ : 9398 236 421



నా చదువు, ఉద్యోగం, పదవీవిరమణ తర్వాత నివాసం భాగ్యనగరంలోనే. కాని ఉద్యోగరీత్యా చెన్నైలో పది (గత 9వ దశకంలో) సంవత్సరాలున్నాను. అపుడు చాల విశ్రాంతి ఉండేది. ఏవో చిన్నచిన్న పనులు చేస్తుండేవాడిని. వాటిలో కరుణశ్రీగారికి పుష్పవిలాపంపై లేఖ వ్రాయటం ఒకటి.

కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి గురించి పుష్పవిలాపం గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. పుష్పవిలాపంయొక్క కవిత్వ ఔన్నత్యం గురించి విభేదాలు లేవు. కాని ఒక దృష్టితో విమర్శలు రాకపోలేదు. పూలు, తులసి మొదలైనవాటితో భగవంతుని పూజించటం భారతీయ సంస్కృతిలో జీర్ణించుకొనిపోయిన సంప్రదాయం. దానిని పుష్పవిలాపం కొంత వ్యతిరేకిస్తున్నట్లు భావించటంలో ఆశ్చర్యం లేదు. కాని దీనిలోని వ్యంగ్యవైభవాన్ని గ్రహించక కరుణశ్రీ భగవంతుని పూజను నిరసించేవాడని బౌద్ధుడని భావించేవారు లేకపోలేదు. ఈవిధమైన సందేహాలు నాకూ కలిగి వాటిని నివారించుకొనుటకు కరుణశ్రీగారికి 1990లో నాతిదీర్ఘమైన లేఖ వ్రాసినాను. ఇట్టివి ఎందరో వ్రాసి ఉంటారు ఎందరికని సమాధాన మిస్తారని అనుకున్నాను. అందునా నేనేమీ రచయితను కాను. ప్రసిద్ధుడను కాను. కాని కొంచెం ఆలస్యంగానైన వచ్చిన వారి వివరణ నన్ను ఆశ్చర్య పరచింది. చదివిన తర్వాత ఇంత వివరంగా వ్రాసిన వారి సౌజన్యానికి వినయసంపత్తికి పొంగిపోయి ఆనందబాష్పాలను రాల్చాను. మూడు దశాబ్దాల తర్వాత ఆ ఉత్తరం తిరిగి కనబడి చదువగా వారి కరుణార్ద్ర హృదయం తిరిగి అవగతమైంది. పీడితజనావళిపై కారుణ్యం కలిగి తోటి మానవులుగా వారి కష్టసుఖాలను ఆకళింపు చేసికొనాలని వారిచ్చే సందేశమే పుష్పవిలాపమని తెలిసినపుడు వారిపై ఎనలేని గౌరవాభిమానాలతో హృదయం నిండిపోయినది. ఈ ఉత్తరాన్ని చాలాసార్లు చదివినాను. ఇక వారిచ్చిన వివరణాత్మకమైన ఉత్తరం మీరూ చదవగలరు.

Jandhyala Papaiah Sastry

కల్యాణభారతి, Chief Editor, రవీంద్రనగర్,

Potana Bhagavatam Project, గుంటూరు-6

Tirumala Tirupati Devasthanams, 1-3-91

**శ్రీయుతులు బి.రామారావు మహోదయులకు, కస్తూరిబాయినగర్ మద్రాసు.**

ఆర్యా! నమస్కారాలు. సుదీర్ఘమైన తమ లేఖ అందినది. తమకు నా యందు నాకవిత్వమునందు గల ఆదరాభిమానాలకు ధన్యవాదాలు. తమరు వ్రాసిన విధంగానే చాలామంది వ్రాస్తుంటారు. కొందరు విద్వత్కవులు **పుష్పవిలాపం** మీద దండెత్తి **పుష్పవిలాసం** వ్రాశారు. మరి కొందరు మా యింటికి వచ్చి ప్రశ్నలు కురిపించారు. మొత్తము మీద పుష్పవిలాపానికి వ్యతిరేకంగా పది పన్నెండు రచనలు (పద్య కవితలు) వచ్చాయి. అవి కాలగర్భంలో కలిసిపోయినాయి. నేను నవ్వి ఊరుకున్నాను. ఏ కవితనూ ఖండించలేదు. ఇక ప్రస్తుతంలోకి వస్తాను. తమ లేఖ చూచాను. తమకు సమాధానం వ్రాయాలని అనిపించింది. తమ జిజ్ఞాసకు ధన్యవాదాలు.

విశ్వశ్రేయః కావ్యం అన్నాడు ఆదికవి. అవును. కవిత ఎప్పుడూ విశ్వశ్రేయస్సునే ప్రబోధించేదిగా ఉండాలి. సౌందర్యానికి తోడు సందేశం కూడా ఉంటే ఆ కవిత రాణిస్తుంది. పది కాలాలపాటు నిలుస్తుంది. ఈ సందేశం రెండువిధాలుగా ఉంటుంది. వాచ్యం వ్యంగ్యం. వాచ్యంకంటె ధ్వనితోకూడిన కవితనే ఉత్తమంగా పరిగణించారు పెద్దలు.

వ్యంగ్యదృష్టితో చూస్తే పుష్పవిలాపంలోని పుష్పాలు పుష్పాలు కాదు. అవి పీడిత తాడిత పతిత దీన హీన మానవుల కంఠాలకు ప్రతీకలు.

**మా యౌవనమెల్ల కొల్లగొని ఆపయి చీపురుతోడ చిమ్మి మమ్మావల పారబోతురు**

**మా రెక్కలు జారిపోన్ పరిహరింతురు మమ్ముల పెంట దిబ్బపై.**

**మా జీవితమెల్ల మీకయి త్యజించి కృశించి నశించి పోయె.**

**గుండె తడిలేక నూనెలో వండి పిండి అత్తరు చేసి మా పేద నెత్తురులను.**

ఇత్యాది పంక్తులు మదాంధుల అధికారాంధుల చెప్పుల కాళ్ళ క్రిందపడి నలిగి నశించి పోయే నిరుపేద బ్రతుకుల నీరసకంఠాలకు

ప్రతిరూపాలు. పువ్వులను ప్రేమించగలిగినవాడు తోడి మానవులను హీనంగా చూడలేడు. పూలు మానవజీవితాలకు ప్రతిబింబాలు. భగవంతుని ఆనందబాష్పాలకు పుష్పాలు భాష్యం చెబుతాయి. అటువంటి సుందర సుకుమార సుమాలను మానవుడు చీలుస్తున్నాడు. చెప్పుల కాళ్ళతో తొక్కుతున్నాడు. నూనెలో వండి పిండి సెంట్లు అత్తరులు చేస్తున్నాడు.

ఎచ్చమ్మ అనే భక్తురాలు రమణమహర్షితో స్వామీ! ఇవాళ నేను ఒక గొప్ప పని చేశాను అందిట. ఏమిటి అన్నాడు మహర్షి. మన తోటలోని తులసి మొక్కలనుంచి వెయ్యి తులసిదళాలు గిల్లి దేవుడికి పూజచేశాను అన్నది ఎచ్చమ్మ. అప్పుడు స్వామి ఎచ్చమ్మా! అలా వెయ్యిసార్లు తులసిని గిల్లకపోతే వందసార్లు నీ ఒళ్ళు గిల్లుకోక పోయినావా అన్నారుట!

అభిజ్ఞానశాకుంతలంలో కాళిదాసమహాకవి శకుంతలను అత్తవారింటికి పంపే సందర్భంలో కణ్వమహర్షినోటివెంట ఇలా పలికిస్తాడు. ఓ లతా తరులారా! ఏ శకుంతల మీ పాదులకు నీళ్ళు పోయకుండా తాను నీళ్ళు తాగేదికాదో ఏ శకుంతల అలంకార ప్రియ అయి కూడ మీ చిగురాకు గిల్లి తలలో పెట్టుకోడానికి ఇష్టపడేది కాదో ఆమె ఆ శకుంతల అత్తవారింటికి వెళ్ళుతున్నది అనుజ్ఞ ఇవ్వండి. ఇలా అనడం వల్ల శకుంతలలోని ప్రేమ, అనురాగం, కరుణ, మానవత్వం, అహింసాభావం వెల్లడవుతున్నాయి. అంటే మానవుడు లతలను, తరువులను పుష్పాలను పల్లవాలను ప్రేమించడం నేర్చుకోవాలి అని కవి భావం.

ఇక వాచ్యదృష్టితో చూద్దాం.

నేర్చుకోవాలి మానవుడు. ఈ క్రింది నా అనుభవాలు నాచేత **పుష్పవిలాపం** వ్రాయించాయి.

1. ఒక మంత్రి మహాశయుడు బూట్లకాళ్ళతో చల్లుతున్న పుష్పాలను దున్నపోతులా తొక్కుకుంటు వేదికపైకి వచ్చాడు.

2. ఒక బంగారుతల్లి బుట్టెడు పారిజాతపుష్పాలను మల్లెపూలను మంగలంలో పోసి వేయించి మసి చేస్తున్నది. ఎందుకంటె ఆ మసితో చాదు చేస్తారట! అది సుగంధాలు చిమ్ముతుందట.

3. ఒక వైద్యశిఖామణి సన్నజాజిపూలను సన్నెకల్లులో వేసి మెత్తగా నూరుతున్నాడు. ఇంగిలీకంతో కలిపి మాత్రలు చేస్తే జ్వరాలు తగ్గిస్తాయట. రక్తశుద్ధి కలుగుతుందట.

4. మా యింటికి వచ్చిన మిత్రుడికి మా వాకిట్లో పూచిన జంట గులాబీపూలగుత్తి ఇచ్చి కాఫీ తెద్దామని లోపలికి వెళ్ళాను. నేను వచ్చేసరికి వాడిచేతిలో గులాబీ తొడిమ మాత్రమే మిగిలి ఉంది. మేకలాగా వాడు ఆ అందాల గులాబీరేకులను నములుతున్నాడు. పైగా ఇది చాల ఆరోగ్యమంటాడు ఆ పశువు.

5. ఇంకొక్క వనితామణి ముద్దులు మూటగట్టే ముద్దబంతి పువ్వులను చిదిమి రేకులు చీల్చి మాలకట్టి జడలో అలంకరించు కుంటున్నది.

6. ఇంకో జవరాలు మల్లెపూల గుండెల్లో సూదులు గ్రుచ్చి దండ తయారు చేస్తున్నది.

7. ఒక సన్మానసభలో ఒక మహావిద్వాంసుడి మెడలో పూలదండ వేశారు. మదరాసునుంచి మాలలు తెప్పించి వేశారు. సుమారు రెండు వందల దండలు వేశారు. అవన్నీ ఒక బండెడు అయినాయి. వేసేవి వేస్తుంటే తీసేవి తీసి ఒకమూల విసరి వేస్తున్నారు. ఆదిక్కు మాలిన పూల దిక్కు చూచేవారెవరూ లేరు.

8. పై అనుభవం నాకు కూడ జరిగింది. స్వయంగా ఆ బాధ అనుభవించాను.

9. ఒక మహాసభలో నాలుగు గంపలనిండా చేమంతి, బంతి గులాబీలు తెచ్చి రాసి పోసి పదిమంది ఆడపిల్లలు చుట్టూ కూర్చొని రెక్కలు ఊడదీస్తున్నారు. ఎందుకన్నాను. మీకు పుష్పాభిషేకం చేయాలన్నారు కార్యకర్తలు. నాగుండెలు ఆగిపోయినంత పని అయింది. రెక్కలు తుంచకుండా పూలు పూలుగానే నా మీద పోయండని వాళ్ళతో రాజీ పడ్డాను. అప్పుడంతకంటె ఏమీ చేయలేక పోయాను.

10. ఒక మహిషాసురుడు పట్టెమంచం మీద పరుపు పరుపు మీద జానెడెత్తున మల్లె పూలు పరుచుకొని కాని పడుకోడు. లేకపోతే ఆయన గారికి నిద్ర రాదట. ఎంత ప్రేమో పూలంటే పాపం.

పై దృశ్యాలన్నీ హింసాత్మకంగా కనిపించాయి. ప్రేమానురాగాలు ఏ మాత్రం లేవు. అందువల్ల మానవులు పుష్పాలను ప్రేమతో ఆదరించాలని పూలలో భగవంతుణ్ణి దర్శించాలని ఆ సౌందర్య సౌభాగ్యాలను ఆకళించుకొని ఆరాధించాలనీ నా భావం. పూలను హత్య చేయవద్దన్నాను. అందాన్ని హత్య చేయవద్దన్నాను.

మా ఆవిడ ఒకే ఒక పువ్వు అదీ ముందుగా స్వామికి సమర్పించి తలలో ధరించేది. నేను భగవంతునికి పూలతో పూజ చేస్తాను. నాలుగు ఐదు మాత్రమే. అవీ ఎంతో ప్రేమతో భక్తితో బాధతో. నేను ఎవరినీ పూజ చేయవద్దని చెప్పను. పూలను తుంచేటప్పుడు దయా దాక్షిణ్యాలను నేర్చుకోమంటాను. వాటిని మన ఆరాధనకు సాధనాలుగా వాడుకోవద్దంటాను. వాడిపోయిన పూలను జాలిగా చూడటం నేర్చుకుంటే తోడి మానవులను ఆదరించటం తెలుస్తుంది. నా సోదరసోదరీమణులను ఇదే ప్రార్థిస్తాను. పూలకు కూడ ప్రాణం ఉంది. అవి భగవంతుని వరప్రసాదాలు. శాంతిదూతలు. కాంతి ప్రదాతలు. వాటిని హింసించకండి. ప్రేమించండి. అందుకనే **బండెబారెనటోయి! నీ గుండెకాయ శివునికై పూయవే నాల్గు చిన్ని పూలు** అన్నాను. ఇటువంటి మానసికపూజకు తొలిమెట్టు లౌకిక పుష్ప పూజ. నేను హిందువునే బౌద్ధుడను కాను. కాని బుద్ధుడంటే చాల ఇష్టం. ఇందుతో పుష్పవిలాపం పంపాను. మళ్ళీ చదువండి. నా ఉదయశ్రీ లోని బీదపూజ అనే ఖండిక చదువండి.

వాస్తవానికి భగవంతునికి ప్రియమైన పుష్పాలు వేరే ఉన్నవి.

**శ్లో॥ అహింసా ప్రథమం పుష్పం పుష్పమింద్రియనిగ్రహ: ।**
**సర్వభూతదయాపుష్పం క్షమాపుష్పం విశేషత: ॥**
**శ్లో॥ శాంతి: పుష్పం తప: పుష్పం ధ్యానపుష్పం తథైవ చ ।**
**సత్యమష్టవిధం పుష్పం విష్ణో ప్రీతికరం భవేత్ ॥**

మూసీ సాహిత్యధార
ప్రధాన ప్రసంగం

# బోధన పరిశోధనలలో నిఘంటువు ప్రయోజనం

**డా. వై. రెడ్డి శ్యామల,** ఆచార్యులు, నిఘంటు నిర్మాణశాఖ, పొ.తె.వి.విద్యాలయం,
ఫోన్ : 98496 97688

## పరిశోధనలో నిఘంటువుల పాత్ర

సాధారణంగా విద్యార్థులు పరిశోధనకు ఉపక్రమించగానే అంశాన్ని ఎన్నుకుంటారు. ఏ అంశాన్ని పరిశోధనకు క్షేత్రంగా చేసుకోవాలి అని వారికి ముఖ్యమైనదిగా అంతవరకు ఎవరూ చర్చించనిది, వెలుగు చూడనిది, సమాజ అభివృద్ధికి తోడ్పడేది అధ్యయనాంశంగా స్వీకరిస్తారు. ఈ ప్రక్రియలో ముందుగా తమ అంశాన్ని శీర్షికగా వ్యక్తీకరిస్తారు. ఉదాహరణకు నా పరిశోధనాంశ శీర్షికను తీసుకుంటాను. **"అన్నమాచార్య పద కవితలు – మధుర భక్తి"**. దీని పరిధి, విస్తృతి, లక్ష్యం వంటి పరిశోధనా పద్ధతులు తెలిపాక శీర్షికను వివరిస్తాం.

అన్నమయ్య వివరాలు ఇచ్చాక 'పద కవిత'ను నిర్వచిస్తాం. అలాగే 'మధురభక్తి'ని నిర్వచిస్తాం. ఇక్కడ మనకు పదంలోని ప్రతి అంశాన్ని సూక్ష్మంగా అర్థం చేసుకోవడానికి, నిర్వచించడానికి ఉపకరించేది నిఘంటువు. నేను ఎన్నుకున్న పద కవిత నిఘంటువులో దొరుకుతుందా? లేక 'పదం' అని విడదీసి చూడాలా? 'మధురం' భక్తి వీటి అర్థం. కాలానుగుణంగా అర్థంలో వచ్చిన పరిణామం లేక ఎవరైనా ముందుతరం వారు ఎలా నిర్వచించారు వంటివి తెలుసుకోవడానికి నిఘంటువే శరణ్యం. అంటే శీర్షికను నిర్వచించడం నుండి నిఘంటువు మనకు తోడ్పడుతుంది.

సాహిత్య విద్యార్థులు సాధారణంగా ఒక కాలానికి, ప్రక్రియకి, సాహిత్యకారునికి లేదా వాదానికి చెందిన అంశాలపై అధ్యయనం చేస్తుంటారు. వీటికి చెందిన రచనలను అర్థం చేసుకోవడానికి అందులోని పదాలను గురించి అవగాహన ఉండాలి.

ఈ రచనలలోని పదజాలం మనకు తెలియదు. పదానికి అర్థం అనేక కారణాల వలన కూడా అవగాహన కాదు. దీనికి 1. కాలం 2. ప్రాంతం 3. విషయం కారణం.

ఉదాహరణకు తిక్కన, అన్నమయ్య వంటి కవులు వాడిన పదజాలం కాలంలో వచ్చిన మార్పుల వలన కొన్ని అర్థం మారాయి. కొన్ని వ్యవహారం నుండి తప్పుకున్నాయి. కొన్ని విషయం తెలియకపోవడం కారణంగా అర్థం చేసుకోలేము. సంస్కృతిలో వచ్చే మార్పుల వలన కొన్ని పదాలు అర్థం కావు.

అయితే ఆధునిక కవులైనా, జానపద కవులైనా ఒక ప్రాంతానికి చెందిన పదజాలం ఉపయోగించినప్పుడు, మరొక ప్రాంతంవారు అధ్యయనం చేస్తున్నప్పుడు ఆ పదాలకు అర్థం తెలియదు.

సాహిత్యకారులు ఒక ప్రత్యేక విజ్ఞానాంశంపై సాహిత్యం వెలువరించినప్పుడు ఆ రంగానికి చెందిన పదజాలం కూడా అంత సులభంగా అర్థం కాదు.

పై అవరోధాలను అధిగమించి కవి హృదయాన్ని అర్థం చేసుకోవడానికి ఆ కవి ప్రయోగించిన మాటలకు సరైన అర్థం గ్రహించాలి.

సరైన అర్థం గ్రహించడమెలా? ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకునే ముందు నిఘంటువుల గురించి తెలుసుకోవాలి. నిఘంటువు అనే పదానికి వ్యుత్పత్తి ఇలా చెప్పబడింది. 'ని' అంటే ఉపసర్గ, 'త్యు' అనే ప్రత్యయం గల 'ఘటి' ధాతువు (ని + ఘటి + త్యు) నుండి 'నిఘంటు' శబ్ద వ్యుత్పత్తి జరిగింది. అనగా బాగుగా చెప్పునట్టిది, స్పష్టంగా, సూటిగా చెప్పునట్టిది అని అర్థం.

ఒక మాటకు అర్థాన్ని స్పష్టపరుచునది నిఘంటువు. తెలుగులో అనేక నిఘంటువులున్నాయి. మొదట పద్య నిఘంటువులు తరువాత గద్య నిఘంటువులు (అకారాది) వచ్చాయి.

**సాహిత్య విద్యార్థులకు ఉపకరించేవి :** ఏ నిఘంటువునైనా ప్రధానంగా అర్థం కోసం మనం వెదుకుతాం. కానీ మంచి నిఘంటువులో ఆ పదం ఏ భాషా భాగానికి చెందినది, క్రియ విశేషణం, నామవాచకం, క్రియా విశేషణం అవ్యయం వంటి వివరాలు ముందుగా తెలుపుతుంది. లిపిక్రమం లో వచ్చే సందేహాలు తీర్చుతుంది. అల్పప్రాణ మహాప్రాణాల అనుమానాన్ని తొలగిస్తుంది. స్పష్టమైన అర్థాన్ని ఇస్తుంది. పర్యాయ పదాలను సమకూరుస్తుంది. వ్యాకరణంలో ఏవైనా ప్రత్యేకతలు ఉంటే బోధిస్తుంది. ఉదాహరణకు చేను + లు = చేలు అనే బహువచనంలో వచ్చే తేడాని చూపిస్తుంది. ని.బ. అని నిత్య బహువచనాన్ని సూచిస్తుంది. అలాగే రూప బేధాలను ఒక దగ్గర తీసుకొని వస్తుంది. మాటల భాషా వ్యుత్పత్తిని (సంస్కృతము, ప్రాకృతము, తమిళము, ఆంగ్లము వంటి) వివరిస్తుంది. ఒకే శబ్దానికి ఉండే భిన్న అర్థాలపై (ఉదా. పాలు) గమనింపు చేస్తుంది.

కవి ఒక పదాన్ని ఉపయోగించాడు అంటే దానికి ప్రత్యేకమైన కారణం ఉంటుంది. అది విమర్శకుడిగా, పరిశోధకుడిగా మనం అందుకోవాలంటే ఆ పదానికున్న అర్థాన్ని పూర్తిగా అవగాహన పరచుకోవాలి. అర్థం కాలంపై ఆధారపడి ఉంటుంది. కనుక కవి కాలాన్ని పదాలకున్న అప్పటి అర్థాన్ని తెలుసుకోవడానికి కాలక్రమ పద్ధతిలో నిర్మితమైన నిఘంటువును చూడాలి.

తెలుగులో ఆంధ్ర వాచస్పత్యం, సూర్యరాయాంధ్ర నిఘంటువు చాలా ఉపకరిస్తాయి. సూ.రా.ని.లో కవుల రచనలనుండి ప్రయోగాలు ఉన్నాయి. కనుక ఆ కవి లేదా తత్సమాన కాలంలోని కవి ప్రయోగానికి ఉన్న అర్థం ఇచ్చారు. దీనిద్వారా మనం అర్థం తెలుసుకోవచ్చు. వాచస్పత్యంలో వీనితో పాటు సమాన పదాలు కూడా ఉన్నాయి. ఎంతో ఉపయుక్తమయ్యే నిఘంటువులివి.

ఇక వ్యుత్పత్తిని తెలుసుకోవాలి అనేందుకు ఉపయోగపడే కోశ సంపుటులు **"తెలుగు వ్యుత్పత్తి పదకోశాలు"** (8 సంపుటాలు) తెలుగు సాహిత్యంలో ద్వ్యర్థి కావ్యాలు, త్ర్యర్థికావ్యాలు కూడా వెలువడినవి. అవేకాక శ్లేషను అర్థం చేసుకోవడానికి నానార్థ నిఘంటువులు ఎంతో ఉపకరిస్తాయి.

ప్రాచీన కావ్యాలను అర్థం చేసుకునేందుకు పద్య నిఘంటువులు ప్రయోజనకారులు. పర్యాయపదాల రూపకల్పన ఎలా జరుగుతుందో కూడా మనం వీటిద్వారా గ్రహించగలం. ఆంధ్రనామ సంగ్రహం, ఆంధ్రనామ శేషం, సాంబ నిఘంటువు, ఆంధ్ర పద నిధానము వీటిలో ముఖ్యమైనవి. అచ్చతెనుగు రచనలను, పదాలను తెలుసుకోవడానికి లక్ష్మీనారాయణీయ తెలుగు నుడికడలి మార్గాన్ని సుగమం చేస్తాయి.

సాహిత్య విద్యార్థుల వద్ద కనీసం శబ్ద రత్నాకరం, చేతికి అందేంత దూరంలో ఉండాలి. ఈ పదానికి అర్థం ఇది అయి ఉంటుంది అని అనుకోకూడదు. కచ్చితమైన, స్పష్టమైన అర్థం ఎరుకపరచుకోవాలి.

**భాషాధ్యయనం :** సాహిత్యాధ్యయనం చేసే విద్యార్థులు తడిమే మరో అంశం భాష. కవుల రచనలలోని భాషను గురించి కూడ విద్యార్థులు పరిశోధనలలో స్పృశిస్తుంటారు. భాషలోని పదాలను గురించి వ్రాయడానికి భాషాంశాలను అర్థం చేసుకునేందుకు కొన్ని నిఘంటువులు తోడ్పడతాయి. క్రియల గురించి చర్చించేటప్పుడు Telugu Verbal Bases, Dravidian Etymological Dictionary, ఆంధ్ర క్రియా స్వరూప మణిదీపిక ఎంతో విశ్లేషణను చేకూరుస్తాయి. **వైకృత చంద్రిక, వైకృతపద స్వరూప నిరూపణం** చూడవలసిన నిఘంటువులు.

మాండలికాలపై అవగాహన పరిశోధనలకు మూలాధారమైనవి. **'మాండలిక వృత్తిపద కోశాలు'**. తెలుగులో పారిభాషిక పదనిర్మాణం సహజరీతిలో ఎలా ఏర్పడ్డాయో విశ్లేషణకు ఈ కోశాలు ఉపకరిస్తాయి. వీటితో వ్యవసాయం, చేనేత, వాస్తు, లోహకార, మత్స్య, మేదర, వడ్రంగం వివిధ రంగాల పారిభాషిక పదాలు, వాటి అర్థాలు దొరుకుతాయి. సాహిత్యంలో ప్రయోగింపబడిన ఇటువంటి పదజాలానికి ఇక్కడే అర్థం లభిస్తుంది.

విషయపరమైన నిఘంటువులను విజ్ఞాన సర్వస్వ నిఘంటువులుగా వర్గీకరించారు. ఉదాహరణకు లలిత కళల నిఘంటువు, సంగీత రత్నాకరము వంటివి. వీటిలో ఆయా కళలకు చెందిన పారి భాషిక పదాలను పూర్తి నిర్వచనంలో వివరిస్తారు. ఇవి కూడా సాహిత్య అధ్యయనకారులకు చేదోడై ఉంటాయి. ఏ వసుచరిత్రకారుడో, శ్రీశ్రీనో వాడే కొన్ని పదాలకు అర్థాలు మనకు బోధపడతాయి.

ఇంకా **వావిళ్ళ నిఘంటువు, శబ్దార్థ చంద్రిక,** ప్రత్యేకంగా వచ్చిన **ఆంధ్ర మహాభారత నిఘంటువు (రెండు భాగాలు), కవుల రచనలలో వచ్చిన పద ప్రయోగ కోశాలు, మాండలిక భాషా నిఘంటువులు)** మొదలైనవి మనకు కవి ప్రయోగాలను గ్రహించడానికి సహకరిస్తాయి.

ఇవి కాక టీకా తాత్పర్యాలతో వెలువడిన కావ్యాలు ప్రయోజన కారులవుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం వారు వెలువరించిన ఆంధ్ర మహాభారతం ఆ కోవలోనిదే.

## బోధనలో నిఘంటువుల పాత్ర

భాషా బోధనలో అతి ముఖ్యమైన సహచరి నిఘంటువు. మాతృభాషా బోధన లేదా ద్వితీయ భాషా బోధన రెండింటిలోనూ నిఘంటువు పాఠ్యపుస్తకం వంటిది. కనుకనే పూర్వం సంస్కృత అధ్యయనంలో **"అమరం నెమరుకు రావాలి"** అనేవారు. తెలుగు బోధనలో కూడా పద్య నిఘంటువులను కంఠస్థం చేయించేవారు. ధారణకు ఉపకరించడానికి పద్యరూపంలో నిఘంటువులు వెలువడ్డాయి. అంటే పదజాలంపై పట్టు ఎంత అవసరమో ఇది తెలుపుతుంది.

మాతృభాషా బోధనలో విద్యార్థి ప్రాథమికమైన భాషాజ్ఞానంతోనే పాఠశాలకు వస్తాడు. లేఖనం తరువాత నేర్చుకునేదంతా విషయం. విషయం భాషారూపంగా వ్యక్తీకించబడుతుంది. మెదడులో నిక్షిప్తం అవుతుంది. వ్యాకరణం మెదడులో క్రోడీకరించబడిన తరువాత ఇక అదనంగా చేరేదంతా పదజాల సంపత్తే. కనుక దానిని వృద్ధి పరచడానికి నిఘంటువులు తోడ్పాటును అందిస్తాయి. భాషలో ఏ రెండు పదాలు సమాన పదాలు కావు. ఏదో ఒకచోట అర్థఛాయ భేదం కనిపిస్తుంది. దీనిని మాతృభాషీయుడు గ్రహించగలగడానికి నిఘంటువులు సహకరిస్తాయి.

తెలుగులో విద్యాభ్యాసం చేసే విద్యార్థికి చిన్న తరగతుల నుండి నిఘంటువులను చూసే అభ్యాసాన్ని అలవరచాలి. చిన్న తరగతుల వారికి వివిధ నిఘంటువులు దొరుకుతున్నాయి. పదం – అర్థం, వీటిలో ఉంటుంది. ఉన్నత పాఠశాల స్థాయి నుండి శబ్దార్థ చంద్రిక, విద్యార్థి కల్పతరువు, తెలుగు నిఘంటువు, శబ్దరత్నాకరములలో ఏదో ఒకటి వారికి బహుమతిగానైనా ఇవ్వడం వలన అలవాటు అవుతుంది. నిఘంటువులలో క్విజ్‌లను నిర్వహించవచ్చు. పదాలు ఇచ్చి అర్థం వెతకమనడం, చూసి లిపిక్రమం రాయమనడం, అకారాది క్రమం అలవాటు చేయడం, సంధిని విసంధి చేయమనడం, భాషాభాగాలు కనుక్కొనమనడం, నానార్థాలను గుర్తించమనడం,

కొత్త పదాలను ఉపయోగించవచ్చు ప్రయోగాలను రాయమనడం, పర్యాయ పదాలు వెతకమనడం, రూపాంతరాలున్న పదాలను నాలుగు వెదకమనడం వంటివి విద్యార్థుల చేత చేయిస్తే తప్పక వారి భాషా కౌశలాలు వృద్ధి చెందుతాయి.

ద్వితీయ భాషా బోధనలో నిఘంటువు లేనిదే భాషాభ్యసనం కుదరదు. ముందుగా ఎవరైనా నిఘంటువును వారి భాషనుండి తెలుగుకు వ్రాసిన నిఘంటువు అలాగే తెలుగు నుండి వారిభాషకు వెలువడిన నిఘంటువును ఎదురుగా పెట్టుకోవలసి ఉంటుంది. కనుకనే ఆంగ్లేయులు తెలుగు నేర్చుకోవాలని ప్రారంభించినప్పుడు ముందుగా వారికి తగిన వ్యాకరణాలు, పూరకాలుగా నిఘంటువులు నిర్మించారు. 1794 ప్రాంతంలో ఫ్రెంచవారు తెలుగు – ఫ్రెంచి, ఫ్రెంచి తెలుగు నిఘంటు నిర్మాణం చేశారు.

1818లో విలియం బ్రౌన్ 'Grammar and Vocabulary of the Gentoo Language' అనే శీర్షికన కావలసిన గ్రంథాన్ని విడగొట్టి Vocabulary ని వేరు చేశారు. (ఈ నిఘంటువులో విలియం బ్రౌన్ తెలుగును అని సంబోధించారు). తరువాత అవసరాలను అనుసరించి వచ్చినవాటిలో కాంబెల్ **'డిక్షనరీ ఆఫ్ ద తెలుగు లాంగ్వేజ్' 'బ్రౌణ్య తెలుగు ఇంగ్లీషు నిఘంటువు', 'శంకర నారాయణ నిఘంటువు' 'తెలుగు – ఇంగ్లీషు డిక్షనరీ'** ముఖ్యమైనవి.


తెలుగు – ఇంగ్లీషు నిఘంటువును నిర్మించిన 1991లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ వెలువరించింది. దీనిని జెపియల్ గ్విన్, మరియు వేంకటేశ్వర శాస్త్రిగారు నిర్మించారు. ద్వితీయ భాషగా తెలుగు నేర్చుకునే వారికిది మంచి నిఘంటువు. అలాగే ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీవారి పనుపున నేను తయారు చేసిన ఇంగ్లీష్ – తెలుగు నిఘంటువు కూడా తెలుగు నేర్చుకొనే (ఇంగ్లీషు ద్వారా) వారికి, ఇంగ్లీషు నేర్చుకొనే తెలుగు వారికి మిక్కిలి ఉపయుక్తకరం.


భాషా బోధనకైనా పరిశోధనకైనా, సాహిత్యాధ్యయనానికైనా నిఘంటువు అత్యంత సహాయకారి. సందేహాలను నివృత్తి చేసే పరిష్కారి. తప్పొప్పులను తెలియపరిచే తీర్పరి. భాషా దోషాలను నిలువరించే భాషా రక్షకి నిఘంటువు.


అయితే ఏ అవసరాలకు ఎటువంటి నిఘంటువు చూడాలో తెలుసుకొని ఉండాలి.


**"యదధీత మవిజ్ఞానం నిగదేనవై శబ్దతే
అనగ్నావిక శుష్కైధో నతేజ్ జ్వలతి కర్హిచిత్"**


(అర్థం తెలుసుకోకుండా ఉచ్చరించే శబ్దాలు అగ్నిలేనిచోట వేసిన సమిధల్లా ఎప్పుడూ ప్రకాశించవు)












# పద్యమనోహరం - 18

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు,

వరంగల్, ఫోన్ : 994 901 3448

**"శ్రోతల మానసంబుల స్పృశించి, కదల్చి రసానుభూతి నే
కైత యొసంగు నయ్యదియె కైత, అదైనను ఆత్మతత్త్వ వ్యా
ఖ్యాతమయేని శ్రేష్ఠతమమట్లు కవిత్వము చెప్పునట్టి వి
ఖ్యాత కవీంద్రులే ఋషుల కారణ బంధులు మానవాళికిన్"**

కవుల సందేశాన్ని అందించే ఈ చక్కని పద్యం సుప్రసిద్ధ విద్వన్మూర్తి డా. సామల సదాశివ గారిది.

ఎవరు కవిత్వం వ్రాసినా అది సర్వమానవాళికి శుభం చేకూర్చేవిధంగా ఉండాలన్న లక్ష్యంతో ఈ పద్యం చెప్పారు డా. సదాశివగారు. ఏ కవిత్వమైనా విన్నవెంటనే శ్రోత మనస్సుకు హత్తుకొని అలరించాలి. హృదయాన్ని కదిలించాలి. రసానుభూతి నివ్వాలి. అటువంటిదే నిజమైన కవిత్వం. ఒకవేళ ఆ కవిత్వం ఆత్మతత్త్వ వ్యాఖ్యానం చేయగలిగిన స్థాయి కలిగి ఉన్నదైతే మరింత శ్రేష్ఠమైన దన్నారు. అటువంటి శక్తివంతమైన కవిత్వాన్ని అందించగలిగిన కవులే ఋషి తుల్యులు అంతేకాదు వారు లోకానికి ఉపకరించే అకారణ బంధువులుగా కూడా భావించాలి అన్నారు.

ఏదో సందర్భాన్ని బట్టి "జలాలుద్దీన్ రూమీ"లో ఈ పద్యం డా. సదాశివగారు రచించినా ఇది కేవలం వారి కవిత్వానికి మాత్రమే వర్తించేది కాదు. ఎవరు కవిత్వం వ్రాసినా సరే ఈవిధంగా ఉండాలన్న భావన ఇందులో పొందుపరచబడింది. సాధారనంగా కవిత్వం అనానే సహృదయుడైన పాఠకుణ్ణో, శ్రోతనో అలరించేదేనన్న సత్యం అందరూ అంగీకరించేదే. కవిత్వాన్ని గురించి చర్చించిన అలంకార శాస్త్రాలన్నీ ఈ విషయాన్నే చర్చించి నిగ్గు తేల్చింది కూడా ఈ సత్యాన్నే. దాన్నే ఇక్కడ కవి చెప్పే ప్రయత్నం చేశాడు. 'మానసంబుల స్పృశించి' అన్నాడు కవికి ఇదొక పెద్ద బాధ్యత. ఒక్కొక్క వ్యక్తిదీ ఒక్కో మానసిక స్థితి. మరి అటువంటి సందర్భంలో అతని మనస్సును ఇది ఎట్లా స్పృశిస్తుంది? అనేది ప్రశ్న. మనో వికాసాన్ని కలిగించే విషయంతో బాటు అతని హృదయన్ని అలరించే రచనా రీతి కూడా కవిలో ఉండాలి. అప్పుడే ఆ కవిత పాఠకుని హృదయాన్ని కదిలిస్తుంది. ఆ మాటనే 'కదిల్చి' అని పేర్కొన్నాడు. ఈవిధంగా కవిత్వ నిర్మాణం చేయలనుకున్న కవి రచించే కవిత్వం రసానుభూతిని కలిగిస్తేనే అది సాధ్యపడుతుంది. రససృష్టి చేయగలిగిన సృజన కారునికి రసదృష్టి కూడా ముఖ్యం. తాను ఎంచుకున్న వస్తువు యొక్క ప్రాధాన్యాన్ని బట్టి ఆయా రసాలు అమరించే నేర్పు కవికి ఉండాలి. అప్పుడే అసలైన రసావిర్భావం అవుతుంది. ఏ రసానుభవాన్ని తన రచన ద్వారా కవి ఇవ్వాలనుకుంటాడో ఆ రసావిర్భావానికి అనుగుణమైన శబ్దాలను ఎన్నుకొని ప్రయోగించాలి. అలంకారాలను ఉపయోగించుకోవాలి. ఇదొక ప్రత్యేకమైన శాస్త్రంగా రూపొందిన కారణం కూడా ఇదే. ఇవేవీ లేకుండా కవితా ప్రపంచంలో అడుగుపెట్టిన కవి కవిత్వం రసాభాసనే మిగిలిస్తుంది తప్ప మరొకటి కాదు. ఇవన్నీ ఒక ఎత్తైతే మరో మాట కూడా ఈ పద్యంలో కనిపిస్తుంది. 'ఆత్మ తత్త్వ వ్యాఖ్యాత మయేని' అనే మాటను అనేక విధాలుగా విశ్లేషించుకోవచ్చు. చదివిన ప్రతి పాఠకునికీ ఈ కవిత్వం తన తత్త్వాన్ని వ్యాఖ్యానించిందా అనిపించాలి, లేదా కవియొక్క తత్త్వమేమో అనైనా అనిపించాలి, అంటే లోతులకు వెళ్ళి ఆలోచించే అవకాశాన్ని ఆ రచన కల్పించాలి. అదే అసలైన కవిత్వం. అతడే అసలైన కవి అంటూ, అటువంటి కవులే 'ఋషులు', అటువంటి కవులే సర్వ మానవాళికీ అకారణ బంధువులు అన్నాడు. అంటే కవి క్రాంతదర్శి అయి ఉండాలి. కవిత్వాన్ని సమాజపరంగా చెప్పగలగాలి. అది సర్వ మానవాళికి వికాసాన్ని కలిగించాలి. అన్న భావాల్ని ఈ పద్యం పంచింది.

డా. సామల సదాశివగారు తమ బాల్యంలోనే అనేక కావ్యాలను, లక్షణ గ్రంథాలను అధ్యయనం చేసి జీర్ణించుకున్న పండితులు. తొలుత కొన్ని పద్యరచనలు చేశారు. వార ఉర్దూ భాషలోనూ అసాధారణ ప్రతిభ గలవారు. గనుక ఎందరో ఉర్దూ కవుల కవితా సౌరభాలను అనువదించి తెలుగువారికి అందించారు. సాహిత్యపు లోతులు తెలిసిన విద్వన్మణులైన డా. సదాశివగారు సంగీత శాస్త్రంలోనూ, ముఖ్యంగా హిందుస్తానీ సంగీత శాస్త్రంలోనూ పారం ముట్టిన పండితులు. దేశంలోని అనేక ఉర్దూ పత్రికలకు చాలా విలువైన వ్యాసాలు రచించి విశేష ఖ్యాతి గడించిన విమర్శకులు. సురవరం ప్రతాపరెడ్డిగారి సూచన ననుసరించి కవిత్వరంగం నుండి నిష్క్రమించి కేవలం వచన రచనలోనే చాలా విలువైన గ్రంథాలను తెలుగువారికందించారు. వారి 'స్వర లయలు" గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాప్ని వారు అందుకున్నారు. చక్కని వ్యావహారికంలో తెలంగాణ భాషా ప్రయోగాలతో హృదయ రంజకంగా రచనలు చేయగలిగే సదాశివగారి 'యాది' విస్తృత ఖ్యాతి పొందిన రచన. కాళోజీ ఫౌండేషన్ వారి పురస్కారాన్ని కూడా అందుకున్న డా. సామల సదాశివగారి రచనలన్నీ ప్రతి తెలుగువాడూ చదవవలసిన విజ్ఞాన భాండాగారాలు.



గ్రంథాంతరంగం
01

# ఆంధ్ర వాఙ్మయ చరిత్రము


శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076


(గత సంచిక తరువాయి)

తొమ్మిదవ ప్రకరణంలో అలభ్య గ్రంథాల పట్టికనిచ్చి అవి కుప్పలు తిప్పలంటూ **"…. మనకు నశించిన గ్రంథముల కంటె మిగిలినవే తక్కువ….."** (పేజి. 105) అని సెలవిచ్చారు. వంగూరివారు ఈ ప్రకరణంలో కవిత్రయాన్ని శ్రీనాథ, పినవీరభద్రుడు, మంచన మొదలైన కవులను స్మరించారే కాని వాళ్ల కావ్య వైశిష్ట్యాన్ని వివరించలేదు. కాని కవులు విలసిల్లి నాటి యుగ సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక ధర్మాలను అవలోకిస్తూ, చేసిన కొన్ని వ్యాఖ్యలు వంగూరి వారి విమర్శనా కౌశలాన్ని, దృక్పథ విశేషాన్ని చాటుతాయి. మచ్చుకి ఒకటి రెండు ఉదాహరణలు :

**"కాని మన చరిత్రకారులు వేమన వలెనే బద్దెనను విస్మరించిరి. ఇది శోచనీయము. తిక్కన కవి కంటె నతి రమ్యముగ నిమిడికగ, మనోహరముగ నున్న బద్దెన నీతులును, పామరులకు గూడ బాతములు చెప్పు వేమన వేదాంతములును వివరింపని కవి చరిత్రములు నిర్జీవములనుట సాహసము కాదు"** (పే. 219) సుబ్బారావు పంతులు గారు ఒక్కొక్కచోట చేసిన వ్యాఖ్యలు ప్రబుద్ధ విద్వాంసులను కూడా పునః ఆలోచించేందుకు ప్రేరేపిస్తాయి. ఈ వ్యాఖ్యలోని వంగూరి వారి నిశిత దృష్టిని గమనించండి. **"ఈ భారత భాగవత రామాయణము లాంధ్రములోనికి వచ్చి మన దేశము నందార్యమత వ్యాప్తి నొనొర్చి మహోపకార మొనర్చిన మాట సత్యమే కాని, ప్రాచీన భాషకు, బూర్వ వాఙ్మయమునకు, దేశీయ సంప్రదాయ ములకు నీ గ్రంథము లొనర్చిన యపకారము వర్ణింపరానిది".** (పే. 222) వంగూరివారు నన్నయకు మునుపటి తెలుగు బౌద్ధ జైన కావ్యాలు ఖిలమైనందుకు విచారిస్తున్నారనీ, ఎంతో విలువైన దేశి సారస్వతం నాశనమైనందుకు వగచుతున్నారనీ ఈ మాటలు చెప్తున్నాయి. పంతులుగారు మరొక్క అడుగు ముందుకు వేసి తిక్కన భారతాని కంటె వేమన పద్యాలకే పట్టం కట్టడం ఆశ్చర్యం కలిగిస్తుంది. వారు ఇలా అన్నారు –

**"వేమన శతకము కంటె భారత మధికమని మనము తలంచునంత కాలము, మనమాంధ్ర శబ్దార్థమునే గ్రహింపని వారమని సాహసించి పలుకవచ్చును. కాని భారతము తిక్కన భారత భాగము – తెలుగు తేనెలో నూరవేసి సంస్కృత భారతమును దెలుగు భారతముగ జేసి వేసినాడు. కావు నేమియు నింక వ్రాయలేక తిక్కన్న భారతము నందలి నుడికారంబులకు నమస్కారంబు జేసి విరమించుచున్నాను. పూర్వ వాఙ్మయమునకు భారతమొనరించిన యపకారము శోచనీయమైనను దప్పనిదియై పోయినది".** (పేజి. 223–224).


A
HISTORY
OF
THE TELUGU LITERATURE
WRITTEN AND PUBLISHED
UNDER THE DISTINGUISHED PATRONAGE
OF
Sri Sri CHELICANI LATCHA RAO GAR
*Zamindar of Yernagudem etc., Chitrada,*
GODAVARI DISTRICT.


ఆంధ్రవాఙ్మయ చరిత్రము

'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము' లోని రెండో భాగం 'పురాణములు' శీర్షికతో 225వ పేజీ నుండి మొదలవుతుంది. వంగూరివారు సంస్కృత పురాణాల్ని విస్తారంగా ప్రస్తావించి, కవిత్రయం కావ్యరచనా విధానాన్ని తడిమి ముందుకెళ్లారు. పంతులుగారు నాచన సోమన కవిత్వానికి సమ్మోహితులైనట్లు తోస్తుంది. లేకుంటే నవీన గుణ సనాథుడైన నాచన సోమనను ఇంతగా తలకెత్తుకుంటారా? చూడండి పంతులవారి అభిప్రాయం– **"ఈ ముప్పురితో సోమన్నను జేర్చి కవిత్రయమనుటకు బదులు కవి చతుష్టయమన్నచో బ్రసిద్ధమైన భారత దుష్ట చతుష్టయము జ్ఞప్తికి వచ్చునని మన వారట్లు పిలవ సందేహించెదరు కాని యీతడు పూర్వ పండితుల యభిప్రాయాను సారము కవిత్రయము కంటె ఘనుడనుట కిసుమంతయు సందేహము లేదు. పాండితి యందే ఘనుడగుటయు గాక కవిత యందును వారికి దీసిపోవడు"** (పేజి. 260). పంతులుగారు రంగనాథుడు, భాస్కరుడు, కంకంటి పాపరాజు, కుమ్మరి మొల్ల ఇత్యాది కవుల, కవయిత్రుల గురించి రెండు, మూడు మంచి మాటలు రాసి 'పురాణములు' భాగాన్ని ముగించారు.

వంగూరివారు తమ 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము'లో ప్రబంధాల లక్షణాల్ని, స్వరూప స్వభావాల్ని విశదీకరిస్తూ, ఆ యుగం నాటి సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితుల మిట్టపల్లాల్ని ప్రబంధాలకు అన్వయిస్తూ సంక్షిప్తంగానైనా లోతుగా పరిశీలించారు. సమకాలీన, తర్వాతి తెలుగు సాహిత్యచరిత్ర కారులెవ్వరూ చూపని, చూపలేనివిధంగా తమ అభిప్రాయాల్ని ధైర్యసాహసాలతో ప్రకటించారు. వంగూరి సుబ్బారావుగారి భావజాలం, అభిప్రాయ

ప్రకటనలపై కట్టమంచి రామలింగారెడ్డి గారి 'కవిత్వ తత్త్వ విచారము' ప్రభావము కొట్టవచ్చినట్లు కనపబడుతుంది. కట్టమంచివారు సంభావించిన కవిత్వ ప్రయోజనం, భావ సహజత, భాషా వైదగ్ధ్యం, తెలుగు నుడికారపు ఇంపుసొంపులు, దేశీయతాముద్ర వగైరా సులక్షణాల్ని రెండుచేతులు చాచి ఆహ్వానించారు వంగూరి పుణ్యశ్లోకులు. అసహజత్వాన్ని, అశ్లీలాన్ని రెడ్డిగారిలాగానే ఈసడించు కున్నారు కూడా. మచ్చుకి కొన్ని నిదర్శనాలు– "చెప్పియుండిరి" అని చెప్పవలసిన లాక్షణికుడు "చెప్పవలయును" అని యెప్పుడు తనకు లేని యధికారము తనపై వేసికొననో యప్పుడే కవి స్వాతంత్ర్యము కాలిపోయినది. ఇట్లే ధీరోదాత్తుడే నాయకు డుండవలెను, వేశ్య నాయిక కాగూడదు. జూదము, త్రాగుడు లేని వారికైన నవి వర్ణింపవలెనన్న ఛాందస మప్పుకవికి దరువాత మఱియు నెక్కువై మన వాఙ్మయము 17,18 శతాబ్దములలో మఱియు చెడిపోయినది" (పేజి. 285) పంతులుగారు 'ప్రబంధములు' శీర్షిక క్రింద శ్రీనాథుని కావ్యాల్ని ఇలా అంచనా వేశారు. **"ఇతడు స్వతంత్ర కావ్యములు వ్రాయగల బుద్ధి సూక్ష్మత కలవాడయ్యు, పండితుడయ్యు నూతన సృష్టి నొనర్పలేకపోయెను. ప్రబంధ సృష్టికి బీజములు మాత్రము నాటగలిగెను"** (పేజి. 295). వంగూరి వారి పరిశీలనాత్మక దృష్టిని మరింత విస్తారంగా విప్పి చెప్పినారు తర్వాతి విమర్శకులు. వంగూరివారు పురాణ కవుల ప్రతిభను కానివ్వండి, ప్రబంధ కవుల సామర్థ్యాన్ని కానివ్వండి, అంచనా వేయడంలో అద్వితీయ కౌశల్యాన్ని కనపరిచారు. పెద్దన ప్రతిభకు ఆయన ఇలా నివాళులు అర్పించారు: **"కథ యెచ్చటిదైననేమి? కల్పనము ప్రాతదైననేమి? స్వభావ సిద్ధముగ రెండు పాత్రల సృష్టించి – కాదు సృష్టినొందిన వారినే చైతన్య యుక్తులుగ నొనరించి మన యెదుట బెట్టి తన చిత్రకళా నైపుణ్యముచే మనల నానంద పెట్టు పెద్దన యేల వందనీయుడు కాదు? ప్రవరాఖ్య వరూధినీ సంభాషణము నందలి యుక్తి ప్రయుక్తులు, చేష్టలు, నాటక కళ, సంభాషణ సమీచీనత మఱి యింతవఱ కే ప్రబంధకర్త తేగలిగెను?"** (పేజి. 303) వల్లూరి వారు శ్రీకృష్ణదేవరాయల ప్రతిభ నీ విధంగా రేఖాంకితం చేశారు – **"ఇతడు కవితాశక్తి యందు బెద్దనాదులకు మిన్నయనుట కీతని స్వభావోక్తులు, మనుష్య జీవిత పరిశీలనమును సాక్ష్యమిచ్చు చున్నవి"**. (పేజి. 304) పంతులుగారు రామరాజ భూషణుని, పెద్దన కవిత్వాన్ని తులనాత్మక పరిశీలన చేసి బిందువులో సింధువుని చూపించినట్లుగా ఇట్లు తీర్పునిచ్చారు. **"వసుచరిత్రము నందలి పద్యములన్నియు రత్నములే. కాని పెద్దన్న మనుచరిత్రము రత్నహారము వంటిది. రామరాజభూషణుని రత్నము లంతకంటె విలువలో నత్యధిక మైన వగును. పనితనమున్నవగును. ప్రకాశ మానమైనవగును. కాని యా రత్నములను రామరాజ భూషణుడొక గుడ్డను మూటగట్టి తెలుగు సరస్వతికి గట్టియైన ధన్యుడు కాలేకపోయెను. ఆతడా రత్నముల నామె మూర్తిపై ద్రిమ్మరించెను. పెద్దన యొక సన్నని దారము వరత్నముల హారముగా గ్రుచ్చి రెండు మూడు పేటలుగా గ్రుచ్చి వెలలో దక్కువయైనను సరస్వతి కంఠసీమ నలంకరించి ధన్యుడైనాడు. ఇదియే వీరిరువురకును గల భేదము"** (పేజి. 307,308).

వంగూరివారు **'ద్విపద కావ్యములు'** శీర్షిక క్రింద పండితారాధ్య చరిత్ర, బసవపురాణం, రంగనాథ రామాయణం మొదలైన కావ్యాల్ని ప్రస్తావిస్తూ, ఈ సాహిత్యాన్ని **'పాటల వాఙ్మయ'** (పేజి.333) మనటమే సమంజసమన్నారు. వీటిని కవులు సామాన్య జనుల నుద్దేశించి రచించారనుకున్నా, వీటికన్నా సులభమైన శైలిలో అల్లిన పలనాటి వీరచరితము, కాటమరాజు కథ, దేసింగురాజు కథ, లక్ష్మమ్మ కథ వగైరా సంచార గాయకులతో పాడబడి పామరజనుల్ని మరింతగా ఆకట్టుకొన్నాయని చెప్పడం చాలా దూరదృష్టితో అన్నమాట. పలనాటి వీరచరిత్రాన్ని **'ప్రథమ వీరగీతం'** (పేజి. 336) గా పేర్కొనడం కూడా సుబ్బారావు పంతులుగారి దృష్టి నైశిత్యానికి ఉదాహరణగా పేర్కొనవచ్చును.

పంతులుగారు **'గేయములు'**ను చర్చిస్తూ త్యాగయ్య, భక్త రామదాసు మొదలైన వారి కీర్తనల్ని పరామర్శించారు. సమకాలీన సంఘంలో మనం ఎదుర్కొంటున్న సమస్యల్ని గేయరూపంలో ప్రకటించిన అజ్ఞాత కవి ఈ రచనను గోదావరి మండలంలో ఒక ఒంటెద్దు బండి తోలే మనిషి పాడుతుండగా విని వంగూరివారు ఇలా ఉల్లేఖించారు :

**"ఓలమ్మా! ఓలమ్మా!**
**కంట్రోలు బియ్యమొద్దే!**
**సర్కారు బియ్యమొద్దే! ఆ**
**ఎఱ్ఱటోపీ గొల్లిగాడు**
**పిఱ్ఱమీద గొట్టినాడోలమ్మా" (పేజి. 344)**


బహుశా 1914–1918 మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో చేతిలో చిల్లిగవ్వ లేని దరిద్ర నారాయణుల్ని కంట్రోలు బియ్యం కొనమని హింసించే పోలీసుల దుండగాల్ని వివరించే గేయమిది. ఇది నాటి బడుగు జనాల ఆక్రందనాలకు అక్షర రూపమే కదా. వంగూరి వారు ఏలపదాలు, తత్త్వాలు, జావళీలు, చూర్ణికలు మొదలైన గేయ రూపాల్ని ప్రస్తావించి **"మన మీ గేయములన్నియు బ్రకటించుకొని యందలి కవితా భక్తి రసామృతముల గ్రోలువఱకును మన వాఙ్మయమునకు సత్యమైన గౌరవము నిచ్చిన వారము కాము. మన సరస్వతి సత్య స్వరూపమును గ్రహించిన వారము కాజాలము"**. (పేజి. 348). 1920 నాటికి తెలుగు గేయ సాహిత్యానికి ఇంత ప్రాధమ్యమిచ్చిన విమర్శకులు కాని, విద్వాంసులు కాని లేరని చెప్పవచ్చును. కవిత్వవేది, ఖండవల్లి, దివాకర్ల ప్రభృతులు కాని ఆరుద్ర, కొర్లపాటి శ్రీరామమూర్తి గారి వంటి సాహిత్య కోవిదులు కాని గేయ సాహిత్యాన్ని ఇంత లోతుగా చర్చించలేదని అంటే వంగూరి

సుబ్బారావుగారి సూచీముఖ పరిశీలన ఎంత గొప్పదో వూహించుకోవల్సిందే.

ఆధునిక పండిత ప్రకాండులు అనాదృతంగా భావించిన శతక సాహిత్యానికి తమ శతక వాఙ్మయ చరిత్రము (నాలుగు సంపుటాలు) ద్వారా గౌరవ మర్యాదలు సంతరించిపెట్టిన విద్వాంసుల్లో ప్రథమ గణ్యులు వంగూరి సుబ్బారావుగారు. గ్రంథకర్త "ఆంధ్రవాఙ్మయ చరిత్రము"లో కేవలం 9 పేజీలే కేటాయించినా, 1920 నాటికి 500కు పైగా శతకాలు లభిస్తున్నాయన్నారు. ధూర్జటి కాళహస్తీశ్వర శతకము **"భావోద్రేకమునకు, కవి స్వతంత్రాభిప్రాయ ప్రకటనమునకు నిదర్శనముగ గనపడుచున్నది"** అన్నారు. వేమన శతకము 'అద్వైత మత ప్రబోధకమగు' రచన అనీ **"ఇందలి భాష, భావములును దెలుగు జాతి కలంకార ప్రాయము"**లని చెప్పారు. (పేజి.357) తెలుగు శతక వైశిష్ట్యాన్ని చాటి చెప్పి, ఒక ప్రత్యేక గ్రంథాన్ని వెలయించిన వరేణ్యులు వంగూరివారు.

సుబ్బారావుగారు **'వచన కావ్యములు'** శీర్షిక క్రింద చంపూ కావ్యాల్లోని గద్యాన్ని, ప్రత్యేక వచన గ్రంథాల్ని చక్కగా పరిశీలించారు. మైసూరు, దక్షిణాంధ్ర నాయకరాజుల కాలంలో రచించబడ్డ వచన గ్రంథాల్ని, కాకతీయుల నాటి ఏకామ్రనాథుని 'ప్రతాప చరిత్రము'ను స్థానాపతి విశ్వనాథమయ్య రాసిన 'రాయవాచకము'ను, 'సభాపతి లక్షణ'మను మరొక వ్యక్తి విరచిత గ్రంథాన్ని స్థూలంగా పరిశీలించారు గ్రంథకర్త.

35 సంవత్సరాలకే నూరేళ్లు నిండిన అల్పాయుష్కులు వంగూరి వారు. ఆయన ఆయుష్షు అల్పమే కాని ప్రతిభ మాత్రం అనల్పం. **'దండకములు'** అనే ప్రత్యేక శీర్షిక క్రింద వంగూరి క్రోడీకరించిన విషయ సామగ్రి గమనార్హం. 'ఆంజనేయ దండకం' పేరు విన్నవారే ఎక్కువ. కాని గాలివాన దండకము, దోపిడీ దండకము, ధూమశకట దండకము, జమాబందీ దండకము, పీపిల్సుపార్కు – అగ్ని ప్రళయ దండకము వగైరా రచనల్లో **".... ఎక్కడ జూచినను దొందర, యదాహుడి, గందరగోళము, ఆపత్తు, భయము, ప్రాణ నష్టము, అధికార బాధ ప్రదర్శితమగుచుండును లేదా గాలివానచే బెంకులు రాలిన గలగల ధ్వని వినబడుచుండును. కరణముల దస్త్రములు, తుఱుక బంట్రోతుల కేకలు, పరుగులు నివియే కనబడుచుండు. అంతేకాని సీతా దండకము, సావిత్రీ దండకము, శకుంతలా పరిణయ దండకము, కృష్ణ నిర్యాణ దండకము, రామ వనవాస దండకము నని వినబడవు. ఒకవేళ నెవ్వరైన వ్రాసిన నది తప్పక యందలి యుద్రేక కరమైన నడతనే ప్రకటించునదై యుండును. లేని యెడల దండకము నడవదు. రసోదయము సులభముగ గాదు. భావానుగుణ్యమైన భాష, నడక, యుండదు ఈ తత్త్వము నెఱిగి వ్రాసిన దండకములు రసవంతములు. ఎఱుగక వ్రాసినవి నీరసములు ననవచ్చును"** (పేజి. 380). వంగూరివారు పోతన విరచితమైన


శతకకవులచరిత్రము
పండిత. వంగూరు - సుబ్బారావుగారిచే
1924

శతక కవుల చరిత్రము
గ్రంథకర్త
కీ. శే. పండిత వంగూరి సుబ్బారావు పంతులు
దేశోద్ధారక శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు
శ్రీ నిడుదవోలు వేంకటరావు, ఎం. ఏ.,
కమల కుటీర్
నరసాపురము
1957

శృంగార రచన 'భోగిని దండకాన్ని' దాని పుత్రికలైన పద్మావతీ, పద్మినీ, విద్యావతీ, చంద్రాననా దండకాల్ని కూడ స్పృశించారు. వంగూరి ప్రాచీన తెలుగు కావ్యాల్నీ, శతక దండకాల్నీ, తలస్పర్శిగా అధ్యయనం చేసిన విద్వాంసులు. ఆంధ్ర సాహిత్య చరిత్రకారుల్లో ఇంత మౌలిక ప్రతిభ కనపరిచినవారు కాని, హాస్య వ్యంగ్య స్ఫూర్తి దాయకమైన వ్యాఖ్యలు చేసినవారు కాని లేరు. 'దండకములు' శీర్షికాంతం చూడండి. ఎంత హాస్యాన్ని స్ఫురింపచేస్తుందో!

**"ముఖ్యముగ భూతముల భయము పోగొట్టుట కాంజనేయ దండకము రాత్రివేళ నెల్లరు చదువుకొనుచుందురు. తక్కినవి వినోద పఠనమున కుపయోగించెదరు".** (పేజి. 386) వంగూరి వారు రెండు వాక్యాల్లో దండక సాహిత్య వర్తమాన, భవిష్యత్తుల్ని నిర్ణయించి వేశారు.

వంగూరివారు **'అనేకార్థ గ్రంథములు'** అని పట్టుమని పది పేజీలే రావారు. ద్వ్యర్థి, త్ర్యర్థి ఇత్యాది శ్లేష కావ్యాల్ని ఈయన కావ్యాలనడానికి ఇష్టపడక, కావ్యగుణములు లోపించిన వీనిని 'గ్రంథములు'గానే పేర్కొన్నారు. పొన్నగంటి తెలగన్న 'యయాతి చరిత్ర' అచ్చతెనుగు కావ్యం గురించి వంగూరివారి అభిప్రాయం వినండి. **"ఇట్టి కావ్యములు పట్టుదలతో వ్రాయుట నా కవుల కాండిత్యమును బ్రదర్శించి, మన కాశ్చర్యమును, వారు కోరు నవ్యత వారికిని సిద్ధింపక పోవు. కాని వారెంత పండితులైనను కావ్యగుణము కొంచెమీ పట్టుదల కావ్యముల యందు గ్రిందగుట సహజము"** (పేజి. 387,388) శేష, అనేకార్థక కావ్యాల్లో కావ్యగుణం లోపించి, పాండిత్యం ప్రకోపించిందని పంతులుగారు అభిప్రాయపడ్డారు. చిత్ర, బంధ, యమక, గర్భ కవిత్వాన్ని వంగూరివారు నిరసించారు. పిండిప్రోలు లక్ష్మణకవి రాసిన 'రావణదమ్మీయ' ద్వ్యర్థి కావ్యాన్ని తిట్టు కవిత్వంగా ఈసడించారు. వెర్రితలలు వేసిన ఈ చిత్ర, విచిత్ర కావ్యాన్ని వంగూరివారు అంచనా వేసిన వైఖరిని గమనించండి. **"కావ్యలక్ష్మి యీ యనేకార్థ కావ్యరచనమున దుదకు గాడిద వాలకములోకి దిగి మన వాఙ్మయ చరిత్రము నందు శోచనీయమైన భాగముగ బరిణమించినందులకు విచారింపవలసి యున్నది. ఈ కడపటి కావ్యములు దురాత్ములగు ప్రభువులకు భయజనకములై**

**సాధుహింస లేకుండ జేయగలిగి యున్నవి. కాని కావ్య విమర్శనమునే మనసులో బెట్టికొనిప్పుడు నీచ వాఙ్మయముగ బరిణమించుచున్నవని చెప్పవలసి వచ్చు చున్నందులకెంతయు జింతిల్లుచున్నాను"** (పేజి. 395,396).

వంగూరి సుబ్బారావుగారు **'శాస్త్రీయ గ్రంథములు'** అనే స్థూల విభాగంలో పావులూరి మల్లన సంస్కృతంలో జైన గణిత శాస్త్రజ్ఞుడైన మహావీరాచార్యుడు రచించిన గణిత సార సంగ్రహాన్ని అనుసరించి తెలుగులో పద్యరూపంలో రాసిన 'దశ విధ గణితములు'ను ప్రస్తావిస్తూ ఇతర శాస్త్రవేత్తలు రాసిన వివిధ శాస్త్రాలను పరిచయం చేశారు. ఆధునిక యుగంలో పరవస్తు రంగాచార్యులు, కందుకూరి వీరేశలింగం పంతులు మొదలైన మహనీయులు రాసిన శాస్త్ర గ్రంథాల్ని పేర్కొన్నారు. విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి వివిధ శాస్త్ర గ్రంథాల్ని ప్రచురించి చేసిన సేవను కొనియాడారు.

వంగూరివారి 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము'లోని చివరి భాగంలో **'ఆంధ్రులు - సంస్కృత వాఙ్మయము'** అనే ఒక విభాగం వుంది. పంతులుగారు సంస్కృత గ్రంథ రచయితలైన భవభూతి, లీలాశుకుడు, నారాయణతీర్థులు, జగన్నాథ పండితరాయలు మొదలైన పుణ్య శ్లోకుల్ని స్మరించారు.

వంగూరి సుబ్బారావుగారి 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము' (1920)కు నేటికి నూరేళ్లు నిండాయి. ఇది మొట్టమొదటి తెలుగు సాహిత్య చరిత్ర. తర్వాతి తెలుగు సాహిత్య చరిత్రకారులు ఈ విశిష్ట గ్రంథాన్ని స్మరించిన పుణ్యాన పోలేదు. ఐనా ఈ గ్రంథ వైశిష్ట్యం మరువరానిది, మరీ మరీ తల్చుకోవలసినది కూడా.

సుబ్బారావు పంతులు తెలుగు సాహిత్యాన్ని యుగాలుగా విభజించకున్నా పురాణములు, ప్రబంధములు, కావ్యములు, వీర గీతములు, గేయములు ఇత్యాది శీర్షికలుగా వర్గీకరించడం గమనించదగ్గ విషయం. ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు ఆంధ్ర విశ్వకళా పరిషత్తులో బి.ఏ. (ఆనర్సు) బోధిస్తూ, ఎన్నో ఏళ్ల తర్వాత ఈ చరిత్రకొక నిశ్చిత రూపం ఏర్పడిందని భావించవచ్చును. అది వీరి శిష్యులైన డా. కాకర్ల వెంకట రామ నరసింహం, డా. దివాకర్ల వెంకటావధాని, డా. పాటిబండ మాధవశర్మ, డా. పోణంగి శ్రీరామ అప్పారావు, డా. కొత్తపల్లి వీరభద్రరావు, డా. నండూరి రామకృష్ణమాచార్యులు మొదలైన మహాభాగుల ద్వారా వేలాదిమంది విద్యార్థులకు తెలుగు సాహిత్య చరిత్ర శాస్త్రీయ స్వరూప దర్శనం కలిగించింది. కాని వంగూరి సుబ్బారావుగారి ప్రతిభా సామర్థ్యాలు తెరచాటుకు వెళ్లిపోవటం మాత్రం విచారకరం.


వంగూరి సుబ్బారావుగారి 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము' యొక్క విశిష్టతను ఈవిధంగా పేర్కొనవచ్చును.

1. ఆంధ్రము, ఆంధ్రులు, ఆంధ్రదేశం గురించి విపులంగా చర్చించబడింది.
2. తెలుగు భాషకు ఇతర ద్రావిడ భాషలతో గల సంబంధాన్ని చర్చించడంతో పాటు తెలుగు సంస్కృత ప్రాకృతాలకు దగ్గరైనదని చెప్పబడింది.
3. ప్రాచీన తెలుగు కావ్య సంప్రదాయం సంస్కృత కావ్యమార్గంలో పయనించి దేశి సారస్వతానికి దూరమైనదని వంగూరివారు భావించారు.
4. నన్నయకు ముందు వెలువడ్డ బౌద్ధ, జైన కావ్యాల్ని అన్వేషిస్తే వాటిలోని ప్రజా సాహిత్య స్పృహ స్పష్టమవుతుందన్నారు.
5. జానపద మన్న మాట పేర్కొనకున్నా వీర గీతములు, గేయములన్నా, ప్రక్రియల్ని సోదాహరణంగా ఉల్లేఖించి, దేశి సారస్వత వైశిష్ట్యాన్ని వొత్తి చెప్పారు.
6. 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము'ను వంగూరి వారు 'ఉపన్యాస శైలి'లో సహజ సుందరమైన రీతిలో, స్పష్టంగా, మౌలికమైన అభిప్రాయాలు వెల్లడిస్తూ ప్రబుద్ధ పాఠకుల్ని ఆలోచించేందుకు ప్రేరేపించారు.
7. వంగూరివారు తమకు ఈ గ్రంథ రచనలో తోడ్పడిన మహనీయుల్ని, వారి రచనల్ని పలుచోట్ల పేర్కొన్నారు.

ఇన్ని విధాల విశిష్టత సంతరించుకొన్న ఈ గ్రంథం ఆదిలోనే విద్వాంసుల అభినందనలకు నోచుకోగలిగింది. ఈ సుకృతి నేటి పండితులకు, విద్యార్థులకు అందే భాగ్యమెప్పుడో?!!


**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**




ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

మూసీ సాహిత్యధార
స్వీయ పరిశోధన

# తెలంగాణ సామెతలు - జనజీవన చిత్రణ

**పర్వయ్యగారి భాస్కర్ రావు,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 9492212503

సామెతలను తెలంగాణ భాషలో శాస్త్రాలు అంటారు. సామెతల శాస్త్రాన్ని 'Paremiology' అంటారు. సామెతలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'Peremiography' అంటారు. సామెత లేని ఇల్లు ఆమెత లాంటిది అని, సామెతల మీదనే సామెత చెప్పినటువంటివారు పెద్దలు. సామెత లేని ఇల్లు కార్యం లేని ఇల్లు లాంటిదని మరికొందరు వ్యాఖ్యానించారు. ఏది ఏమైనప్పటికీ సామెత లేకుంటే సాహిత్యంలో సప్పటి మెతుకులతో సమానం. సామెతలకు పుట్టినిల్లు మన తెలంగాణ. తక్కువ మాటలో ఎక్కువ విషయం ఇమిడి ఉంటుంది. లోతైన సమాచారాన్ని అందిస్తుంది. సమాజంలో ఉన్న మంచి, చెడులను కాకుండా హాస్య, శృంగార, వ్యంగ్య, అద్భుత, విమర్శనాత్మక, విశిష్టతలను సామెతలు తెలియ జేస్తాయి. ఒక తరం నుండి మరొక తరం వరకు జీవితానుభవాలను వడబోసి, అందించే వారసత్వ మౌఖిక విజ్ఞానం సామెతలు. తెలంగాణలో ప్రతీ మనిషి ఏదో ఒక సమయంలో ఏదో ఒక సామెతను వాడకుండా ఉండలేరేమో! సమాజంలోని దురాచారాలను, చెడును, చాదస్తాన్ని హేళనరూపంలో, వ్యంగ్యరీతిలో, పరిహాసపు మాటలతో చెప్పడం సామెతల ఉద్దేశం.

ప్రజల జీవన విధానాన్ని, కట్టుబాట్లను, ఆచార వ్యవహారాలను, సంస్కృతీ సంప్రదాయాలను రానున్న తరాలకు అందిస్తాయి. కుల, వృత్తి, నీతి మొదలైనవే కాకుండా భారత, భాగవత, రామాయణ, పురాణ, ఇతిహాసాల కతల నేపథ్యం కల సామెతలు, ధ్వని, నిగూఢత, ప్రాస, ఆలంకారిక శైలి వంటి విభిన్న వైవిధ్య సారూప్యంతో సామెతలు జన వ్యవహారంలో భాగమైనాయి. పూర్వీకుల నుండి సామెతలు సూక్తులుగా, సుభాషితాలుగా, లోకోక్తులుగా, శాస్త్రాలుగా, జనాంతి కాలుగా వ్యవహార రూపంలో కనబడుతున్నాయి.

సామెతలు పదాలుగా, పదబంధాలుగా, వ్యాఖ్యలుగా, పద్య రూపకంగా, పాట రూపకంగానే కాకుండా కథల రూపంలో కూడా ఉన్నాయి. సామెతలు రెండు రకాలు. ఒకటి జనప్రియత్వం కలిగినవి. రెండు సంప్రదాయబద్ధమైనవి. ఇవి ఆచార వ్యవహారాలకు, మనోభావాలకు అనుగుణంగా ఉంటాయి. సన్నివేశానికి, సంవాదానికి సందర్భానుసారంగా వాడబడతాయి. సామెతల వల్ల ఉపన్యాస నైపుణ్యం కూడా ఏర్పడుతుంది.

**"తెలంగాణ సామెతలు - జనచిత్రణ"** అనే అంశాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించుకున్నాను.

1. తెలంగాణ సామెతలు – స్వరూప స్వభావాలు
2. తెలంగాణ సామెతలు – కుటుంబ జీవన చిత్రణ
3. తెలంగాణ సామెతలు – సాంఘిక జీవన చిత్రణ
4. తెలంగాణ సామెతలు – సాంస్కృతిక జీవన చిత్రణ
5. తెలంగాణ సామెతలు – భాషా పరిశీలన

## 1. తెలంగాణ సామెతలు - స్వరూప స్వభావాలు

"సామెత అంటే సామ్యత" అని అర్థం. సామ్యత అంటే దగ్గరి సంబంధం. జీవితానికి దగ్గరగా ఉంటాయి కాబట్టి దీనికి సామెత అని పేరు వచ్చింది. "జీవితానుభవాల సారమే సామెతలు"

"ఒక అనుభవం ప్రజల్లో బాగా ప్రచారమై, ఆ తరువాత సామెత అవుతుంది".

సామెతలకు సామాన్యంగా కర్త ఎవరో తెలియదు. సామూహిక కర్తృత్వం, సామూహిక ప్రచారం, మౌఖిక కవిత్వ సంప్రదాయం ప్రధాన లక్షణాలు. 'సామెత'ని ఇతర భాషలలో ఒక్కొక్క రకంగా పిలుస్తారు. అరబ్బీలు 'యతవ్' అని, ఆంగ్లంలో 'ప్రోవర్బ్' అని, కన్నడంలో 'గాదె' అని, సంస్కృతంలో 'సూక్తి' అని, హిందీలో 'కహవత్' అని, తమిళంలో 'పలమొళి' అని, మలయాళంలో 'పళించాల్' అని, తెలంగాణలో 'శాస్త్రాలు'అని, లంబాడి భాషలో 'సాకి' అని అంటారు.

తెలుగు సామెతలు మొదటగా సేకరించిన వారిలో డబ్ల్యు. కార్ దొరగారు ఒకరు. ఈయన అనుమతితో తొలిసారిగా అకారాది క్రమంలో సామెతలను అచ్చు వేసిన యశస్సు 'పువ్వాడ వెంకట్‌రావు' గారికి చెందుతుంది. 1969లో 'కార్' తెలుగు సామెతలను 'ఆంధ్ర లోకోక్తి చంద్రిక' అనే పేరుతో ప్రకటించారు ఇది సామెతల సంకలన గ్రంథాలలో మొదటిది.

సి.పి.బ్రౌన్ తెలుగు – ఇంగ్లీషు నిఘంటువులో కూడా కొన్ని సామెతలు కలవు.

పదునైన వాక్పరికరాలు సామెతలు అన్నాడు. "Edged tools of speech" - Bacon

"Proverb is a remnont from old philosophy preserves amidst countless destructions by reason of its brevity and fitness for use. (Aristotle)

(సంక్షిప్తత, ప్రయోగార్హత కారణాలుగా అసంఖ్యాకమైన ఆటుపోట్లకు మారొడ్డి నిలిచిన ప్రాచీన జిజ్ఞాసాల అవశేషమే సామెత)

"పదునైన భావాల్ని పదునైన మాటల్లో చెప్పడం సామెత లక్షణం" అని 'ఆర్.వి.యస్. సుందరం'.

## 2. తెలంగాణ సామెతలు – కుటుంబ జీవన చిత్రణ

మన జీవితమే కుటుంబంతో ముడిపడి ఉంటుంది. అందుకే అత్యధికంగా సామెతలు కుటుంబంలోనే ఉన్నాయి. ఈ కుటుంబ చక్రంలో అత్త–మామ, అత్త–కోడలు, బావ–బావమరదులు, బావ – మరదళ్ళు, వదినె – మరదళ్ళు, ఆలు – మొగలు మొదలైనవారిపై సామెతలు కలవు. ఉమ్మడి కుటుంబాలు, చిన్న కుటుంబాలు, పేదరిక, అణగారిన కుటుంబాల నుండి అనేకమైన సామెతలు కలవు. ఇవన్నీ కూడా తెలంగాణాలో కల కుటుంబ జీవన స్థితిగతులను తెలియజేస్తాయి. వీటిలో శృంగార సామెతలు ఎక్కువగా కనబడతాయి.

***1. ఇంట్లో మొగున్ని కొట్టి బజార్లకుపోయి ఏడిసిందట :*** పూర్వం భర్త భార్యను కొట్టడం సహజం. భార్య భర్తల మధ్య గొడవ జరిగినప్పుడు భార్య భర్త కంటే గయ్యాళిగా ఉండి, భర్త తప్పును ఎత్తి చూపడం, అతనికి ఎదురు మాట్లాడటం, అంటే భర్తను భర్తగా భావించకపోవడం, అమాయకుడైన భర్తతో ఆడుకోవడం వంటివి. ఇంటిలోపల ఎవరికి తెలియకుండా మొగుణ్ణి కొట్టి బజార్లకు వచ్చి అందరికీ తెలిసేటట్లుగా నన్నే కొట్టాడని అబద్ధం చెప్పి భార్య ఏడిచిందట. ఈ సామెతలో భర్త అమాయకత్వం, భార్య గయ్యాళితనం కనబడుతుంది.

***2. అగడుబడ్డ పోశమ్మ మొగున్ని మింగిందంట :*** ఇక్కడ 'అగడు' అనేది అత్యాశను చూయిస్తుంది. పోశమ్మ అంటే భార్య. మామూలుగా గ్రామదేవతలకు జంతుబలి ఇవ్వడం మన ఆచారం. వీరికి గొర్లు, మేకలు హారంగా ఇవ్వాలని 'శిగం' ఊగెటోళ్లు చెప్తుంటారు. అట్లాగే భార్య భర్తను చీరలు, నగలు తేవాలని, పక్కింటి వారికి ఏవి ఉంటే అవే కావాలి అనడం, ఇంట్ల గవ్వ లేకున్నా, తినడానికి తిండి లేకున్నా భర్తను గొంతమ్మ కోరికలు కోరి బ్రతికుండానే బలి చేసేది భార్య. ఇలా కాల్చుకు తినే భార్యను అగడు పడ్డ పోశమ్మ అంటారు తెలంగాణలో.

***3. జల్ది గల పెళ్లాం జల్లెడతో నీళ్ళు మోసిందట :*** ఇక్కడ జల్ది అంటే తొందర, హుషారు అనే అర్థానిస్తుంది. ఈ సామెత వ్యంగ్యంతో కూడుకున్నది. ఉషారు గల పెళ్లాం జల్లెడతో నీళ్ళు మోసిందట. అంటే ఏ పనికి పనికిరాదని, చాతకాని స్త్రీ అని అర్థం. తినడానికి ముందు దండి, పనికి వెనకాల ఉండటం. ఒకవేళ పని చేసినా అది పనికి రాకుండా పోతుందని భావన. బిందెలతో నీళ్ల మోయచ్చు గాని జల్లెడతో మోస్తే రంధ్రాల నుండి నీళ్ళు కారిపోతాయి కాబట్టి అది వ్యర్థమైన పని అని ఈ సామెత తెలియజేస్తుంది.

## 3. తెలంగాణ సామెతలు – సాంఘిక జీవన చిత్రణ

సాంఘిక జీవన చిత్రణలో కుల, వృత్తి, ఆహార, వాతావరణానికి సంబంధించిన సామెతలుంటాయి.

***1. ఉండి ఉండి ఉప్పరోని ఎంట బోతె సచ్చేదాక తట్ట మోసుడే:*** ఇక్కడ ఉప్పరోడు అంటే ఇండ్లు కట్టేవాడు. ఉప్పరోన్ని లగ్గం జేసుకున్నా, వాని వెంటబోయినా వాడు చేసే పనే చేయిస్తాడు. అతడు మేస్త్రి అయితే భార్య తట్ట మోయాల్సిందే. ఎవరి వృత్తి వారిది. సిమెంట్, ఇసుక, కంకర తట్టలు మోసి ఆమె నెత్తి మాడిపోయినా (మాడ) ఆమె సచ్చేదాక మోయాల్సిందే. ఈ సామెతలో మరొక కోణం కనబడుతుంది. సచ్చేవరకు తట్ట మోసుడే అంటే ఇక భార్యభర్తలు చివరివరకు కలిసే ఉంటారని భావం.

***2. ఈదుల్లకు పోయినోడు ఇల్లు కాలినారాడు :*** ఈదుల్లు అంటే ఈత చెట్లు. 'గౌండ్లకులం' వారు ఈతచెట్టు గీసి కల్లు అమ్ముతారు. కల్లు తాగడానికి ఈత చెట్లల్లకు పోయినోడు ఆ కల్లు మత్తులో ఉండి, పెండ్లాం, పిల్లలు, ఇల్లు సైతం మరిచిపోతాడు. అంటే ఒకవేళ వాడి ఇల్లు కాలినా కాని తాగిన మత్తులో ఇంటికి రాడని భావం.

***3. ఎండల్లో ఏకులాడి ఆనల్లో అడ్లు దంచిందట :*** ఒక కాలంలో చేసే పనిని మరొక కాలంలో చేయడం. ఇక్కడ ఏకులాడి అంటే ఖాళీగా ఉండడం. ఏ కాలంలో చేసే పని ఆ కాలంలో చేయాలి. అత్త అడ్లు (వడ్లు) దంచమని ఎండాకాలంలో చెప్పితే వర్షాకాలంలో దంచిందంట కోడలు. అత్త చెప్పిన పని సమయానికి చేయకపోవడం, చేసినా ఆలస్యంగా చేయడం వల్ల ఆ పని అక్కరకు రాకుండా పోవడం చేత ఈ సామెత పుట్టి ఉండవచ్చు. ఏ పని అయినా సమయానికి చేయకపోతే దాని పలితం శూన్యం. అడ్లు ఎండాకాలంలో దంచితేనే గింజపై పొట్టు పోతుంది. వర్షాకాలంలో గింజ మెత్తబడి పొట్టు సరిగా పోదు అని భావం.

## 4. తెలంగాణ సామెతలు – సాంస్కృతిక జీవన చిత్రణ

సాంస్కృతిక జీవనంలో పండుగలు, విద్య, వైద్య, ఆచార వ్యవహారాలు, వస్త్ర, భూషణాలు, వినోదాలు మొదలైన సామెతలుంటాయి.

***1. ఇటుకులాడికి ఇష్టంతోటి రైక పెడితే కంపకు పెట్టుకొని చింపుకుందట :*** ఇటుకులాడి అంటే సోకులాడి, అందానికి ప్రాధాన్యమిచ్చి, రుబాబ్‌గా ఉండడం. ఇటువంటి భార్యకు భర్త ఇష్టంతోటి రైక (జాకెట్) కొనిస్తే దాన్ని పిండి ముండ్లపొదపై ఎండేసిందట. ఎండిన తర్వాత తీస్తే ఆ ముండ్లకు తట్టుకొని చినిగిపోయిందట. ఇందులో ఇంకో నిగూఢార్థం ఉంది. ముండ్ల పొదలల్లకు పోయి రైకను చింపుకుందని భావం.

***2. తాయెత్తులకే పిల్లలు పుడితే తానెందుకు :*** తెలంగాణలో మూఢ నమ్మకాలు ఎక్కువ. పిల్లలు పుట్టకపోతే మంత్రాలు వేయించడం, తాయెత్తులు కట్టించుకోవడం ఆచారం. భార్య, భర్తల్లో ఎవరి లోపంతో అయినా పిల్లలు పుట్టకపోతే దేవుళ్ళను కొలువడం, తాయెత్తులు కట్టించుకోవడం, పూర్వీకులనుండి ఆనవాయితీగా వస్తుంది. ఒకవేళ తాయెత్తులకే పిల్లలు పుడితే పెళ్ళి ఎందుకు? భర్త

ఎందుకు? భర్త లేకుండానే తాయెత్తులతో పిల్లలు కనచ్చు అని ఈ సామెత చెపుతుంది.

***3. ఇచిత్రాల పెండ్లి కొడుకు అక్షింతలేస్తే నొసలు గోక్కొని నోట్లేసుకుండట :*** ఇచిత్రాల పెండ్లి కొడుకు అంటే లోకజ్ఞానం లేనోడు లేదా మతి స్థిమితం లేనోడు అని అర్థం. సమాజంలో అందరితో కలిసిపోకుండా ఉండేవాడు అటువంటి వాడికి పెండ్లి చేసేప్పుడు అక్షింతలు చల్లితే నొసలు గులగుల అయితుందని గోక్కుంటే వేలికి అక్షింతలు తగిలితే తీసి నోట్ల వేసుకొని నమిలిండట. అంటే పెండ్లిలో అక్షింతలు ఎందుకు వేస్తారు అనే ఆచార వ్యవహారాలు కూడా తెలియనివాడని అర్థం.

### 5. తెలంగాణ సామెతలు – భాష

సామెతలలో భాష ఒక భాగం. భాషలో ప్రశ్నార్థక సామెతలు, ఆశ్చర్యార్థక సామెతలు, సంబోధనాత్మక సామెతలు, వర్ణనాత్మక, ఆలంకారిక సామెతలు, సంశయాత్మక సామెతలు, తెలంగాణ – తెలుగు భాషా పదాలకు తేడాలు వంటివి కనబడతాయి.

***1. ఇగురం లేని కోడి బజార్లకు పోయి గుడ్డు పెట్టిందట :*** ఇగురం అంటే బుద్ధి. బజారు అంటే వీధి. ఇగురం, బజారు అనే పదాలు తెలంగాణ భాషా పదాలు. బుద్ధి కలిగిన కోడి ఇంట్లో గుడ్డు పెడుతుంది. ఇంటి పెద్దకు ఆ గుడ్డు దక్కుతుంది. బుద్ధి లేని కోడి బజార్లకు పోయి గుడ్డు పెడితే ఆ గుడ్డు ఎవరి పాలైనా కావచ్చు. లేదా నేల పాలు కావచ్చు. అట్లాగే మనుషులలో కూడా ఇగురం లేనోడు పనికి రాని పనులు చేసి ఇతరులకు ఇవ్వడు. వాడు తినడు అనే నీతిని తెలియజేస్తుంది ఈ సామెత.

***కడుపుల లేని ప్రేమ కాగలిచ్చుకుంటే అస్తుందా?***

***ఏమయ్య కరణం పంతులు బాయిలవడ్డవ్? అంటే ఏదో మజాక్ చేస్తున్న అన్నడట.***

***తెల్లవారిన సంగతి నీకెట్ల తెలిసిందే? అంటే బయటికి పోవలసి వచ్చింది అన్నడట.***

ఏది ఏమైనప్పటికీ తెలంగాణ సామెతలలో భాష యాసనే వేరు.

## దృష్టి



కవిత్వం ఎక్కడుంది
అని నీ అనుమానం
చూస్తే ఎక్కడ లేదు
అని నా సమాధానం
భూమి గుండ్రంగా తిరగడంలో
కవిత్వం లేదా

భూమ్మీద ప్రాణులు
శూన్యంలోకి
రాలిపడకపోవడంలో
కవిత్వం లేదా

భూగోళంలాంటి గ్రహాలు
రోదసిలో ఎన్నో వున్నాయని
చిన్నప్పుడు తరగతి గదిలో
ఉపాధ్యాయుడు చెప్పినప్పుడు
ఆ పసి నయనాల్లో వెలిగిన
ఆశ్చర్యంలో
కవిత్వం లేదా

తనపైన మొలిచిన మనిషి
తనకన్న ఎత్తుగా ఎదిగినప్పుడు
అవని పొందే సంతృప్తిలో
కవిత్వం లేదా

మీమాంస అక్కర్లేదు
నీకూ మట్టికీ ఉన్న
ఆంతరిక
చైతన్య సంబంధమే కవిత్వం
చూడాలి అంతే
సరికొత్త మానవాళే కవిత్వం.

**- డా. ఎన్. గోపి**
**ఫోన్ : 93910 28496**

---

**దీక్షన్ కక్ష్య పరిభ్రమించు గ్రహముల్ దీపించుచున్ చూడ, ప్ర**
**త్యక్షం బౌచు శివుండు, విష్ణువును, బ్రహ్మాదుల్ దినేశున్ సదా**
**యక్షీణాంశుగతుండ కమ్మని యనేకాశీస్సులందించె నా**
**దక్షాదుల్ మహితాత్ములెల్ల త్రిజగత్కల్యాణ మిమ్మంచనెన్**

(నూతలపాటి వెంకట రత్న శర్మ … సూర్య చరితము పద్యకావ్యం నుండి..)




## భిన్నత్వంలో ఏకత్వం

మానవత్వంపరిమళిస్తే
దానవత్వందహించిపోతే
సమతమమతలసుగంధం
ప్రపంచమంతానిండిపోతే
మనుషులంతాఒక్కటై
మనస్సులన్నిఏకమై
స్నేహగీతంపాడుతుంటే
విశ్వజనీనతవెల్లివిరియదా!

దేహాలువేరైన
మనుషులంతా ఒక్కటేకదా!
విచక్షణతో
విలక్షణతో
వివక్షతల విషవృక్షాన్ని
నేలకూల్చితే
పుడమిపౌరులుఏకమై
ప్రగతిదారుల నడువగలిగితే
మానవీయ సౌరభాలు
మదులనిండి మానవత
మరందంపొంగిపొరలితే
జగతినగనత
సమత మమతారాగం వినిపిస్తే
విశ్వమానవులు
భిన్నత్వంలో ఏకత్వం
సాధిస్తే సంతోషాల సంబరాల
సప్తస్వరగీతి పాడదా ..!

**డా. గన్నోజు శ్రీనివాసాచారి**
మహబూబ్‌నగర్
ఫోన్ : 8555 899 493

## నీ స్వాతంత్ర్యం కోసం పోరాడు



నీ స్వాతంత్ర్యం కోసం పోరాడు
ప్రతిరోజు ప్రతి నిమిషం ప్రతి గంట మరిసిపోక
గడిచిపోయిన జ్ఞాపకాల్లో చిక్కుకున్నావా?
బయటపడే ఉపాయమేంటో ఆలోచించు

అప్పుల ఊబిలో దిగబడిపోతున్నావా?
పైకి లేచే ప్రయత్నం యేదో మొదలుపెట్టు

సంసార సాగరంలో మునిగిపోతున్నావా?
ఒడ్డుకు చేర్చే పడవ ఎక్కడుందో కనిపెట్టు

ఉద్యోగం కోసం ఆనందాలన్ని
లైబ్రరీ బ్యాంకులో తాకట్టు పెట్టావా?
విడిపించక వచ్చే దస్తావేజు ఏదో తయారు చేస్కో

సమాజం గుర్తించడం లేదని
మథనపడుతున్నావా?
సమాజానికి సమయం ఇవ్వలేనంతగా
పనిలో పడిపో



అదిగో
అప్పుడు వస్తుంది
సమాజంలో గుర్తింపు
అది ఓటముల సంకెళ్లను తెంపు

దాని పేరే.... గెలుపు...
స్వాతంత్ర్యమనే పిలుపు




**యడవల్లి సైదులు**
పరిశోధక విద్యార్థి, ఉ.వి., ఫోన్ : 7032188578

# దేశ హితైషి – సంస్కరణాభిలాషి

**డా. వొజ్జల శరత్ బాబు** , ప్రభుత్వ ఉపాధ్యాయులు, హైదరాబాదు. ఫోన్ : 9494183937

**కోపమొకింత లేదు, బుధ కోటికిఁ గొంగుఁబసిండి, సత్యమా**
**రూపము, తారతమ్యము లెఱుంగు, స్వతంత్రుడు, నూతన ప్రియా**
**టోపము లేని నిశ్చలు డిటుల్ కృత లక్షణుఁడై చెలంగఁగా**
**ద్వాపర లక్షణుం డనగవచ్చునొకో యల ధర్మనందనున్?**

చేమకూర వేంకటకవి – (విజయవిలాసం – ప్రథమాశ్వాసం)



ఈ లక్షణాలన్నీ ధర్మరాజును ఉద్దేశించి చెప్పబడినవి. చేమకూర గారు చమత్కార పాక కవీశ్వర సిద్ధహస్తుడు. కాబట్టి అక్షరాల ధర్మరాజు గుణగణ వర్ణన చేశారు. అయితే ఈ పద్యంలో ఉండే గుణగణాలు భారత మాజీప్రధాని పీవీ నరసింహారావు గారికి సరిపోతాయని చెప్పడం అతిశయోక్తి కాదేమో అని నా అభిప్రాయం.

అలీన ఉద్యమం నుంచి దూరం జరగడంలో నైనా, ఆగ్నేయాసియా సంబంధాల దృష్టి సంబంధమైనా, అమెరికాతో అచంచల మైత్రి సంబంధం విషయంలో అయినా, లుక్ ఈస్ట్ పాలసీ ఐనా, విద్యా సంస్కరణలైనా, వైద్య ఆరోగ్య శాఖ సంస్కరణలైనా... ఇలా ఒకటేమిటి అనేక సంస్కరణలకు ప్రాణవాయువును అందించారు. శరీరనిర్మాణాన్ని కల్పించారు. చరిత్రలో తిరుగులేని విధంగా సంస్కరణలను ప్రవేశపెట్టిన సంస్కరణారూపశిల్పి పి.వి అని చెప్పకోడం మనకు గర్వకారణం. ఆనాటికి మన దేశంలోని ఏ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి ఇలా సాహసాలకు ఒడిగట్టిన దాఖలాలు మన కంటికి కనబడవు. వ్యవస్థలో అవస్థలు లేకుండా వ్యవస్థీకృతంగా రూపొందించడమే ఆయన ప్రధాన ఎజెండాగా కనబడుతుంది. ఈ మహాయజ్ఞంలో అధికారులను, సొంత పార్టీ నాయకులను, ప్రతిపక్ష నాయకులను, మేధావులను, రాజనీతిజ్ఞులను భాగస్వామ్యం చేయడంలో ఆయన వెనుదీయలేదు. విజయ ఢంకా మోగించారు. ఆయన చేసిన సంస్కరణలు ఒకసారి స్మరణతో పరిశీలించినట్లయితే ఔరా! అని అనిపించక మానదు.

ఏ పదవి కొరకు ఆయన పాకులాడలేదు. కానీ ప్రతిపదవీ తనంతట తాను వచ్చిందే. వచ్చిన ప్రతి పదవీగౌరవం నిలబెట్టాడు. కీర్తి మూటను అందించాడు. అదే ఆయన విలక్షణత. దానికి కారణం ఆయనలో ఉన్న సంస్కరణాభిలాష, సమాజ ఉద్ధరణ, ప్రజా ప్రయోజనాలే ప్రధాన కారణాలు. దేశ ప్రయోజనమే లక్ష్యంగా పనిచేసిన మహామనీషి. ఎన్ని పదవులు చేపట్టాడు. ఎన్ని సంస్కరణలు తెచ్చాడు? ఒకసారి స్మరణ చేసుకుందాం.

**జైళ్ల శాఖ మంత్రిగా :**

1962లో నీలం సంజీవరెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పివి గారికి జైళ్లశాఖ అప్పగించారు. జైలు శాఖ అంటే అప్రయోజనకరమైన శాఖని ఆనాటికి కొంతమంది అభిప్రాయం. కానీ సంస్కరణల పథంలో నడిపాడు. జైళ్ల శాఖ రూపురేఖల్ని మార్చివేశాడు. 1964 ఫిబ్రవరి ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ఒక అద్భుతమైన సదస్సుకు తెరలేపాడు. దానికి అధ్యక్షుడు ఆనాటి స్పీకర్ సి బి వి సుబ్బారెడ్డి గారు. ఆ సదస్సుకు అనేకమంది విద్యావేత్తలను, అధికారులను, న్యాయకోవిదులను, సంఘసంస్కర్తలను, సంఘ సేవకులను, విజ్ఞానవేత్తలను మొదలైన వారి నందరిని ఆహ్వానించారు. అందరి సూచనలు స్వీకరించారు. తత్ఫలితంగా కొన్ని జైళ్ళలో గ్రంథాలయాలు ఏర్పాటుకు బాటలు పడ్డాయి. ఆటల పోటీలు మొదలయ్యాయి. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ఆరంభమైంది. జైల్లో వైద్యశాఖ అధికార్ల హోదా పెంచడం జరిగింది. వారికి శిక్షణ ఇప్పించడం మొదలైంది. వీటన్నింటి కంటే ప్రధానమైంది ఆరుబయట జైళ్ళను నిర్వహించడం. భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా మన రాష్ట్రంలో అంటే ఆనాటి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన జీవం పోసారు. 1965లో 1600 ఎకరాల భూమిని కేటాయించారు. అది అనంతపురం జిల్లాలో. అదే మొదటి ఆరు బయట జైలు. జైల్లో ఉండే ఖైదీలు వ్యవసాయం చేయడం ప్రారంభించారు. తోట పనులు చేయడం ప్రారంభించారు. ఒక ఉల్లాస వాతావరణానికి అలవడేలాగా నియమాలను ఏర్పర్చారు. వారిని జైలు నుండి బయటకు పంపించే విధంగా విధివిధానాలను రూపొందించారు. జైళ్ళ శాఖలో ఇది ఒక ప్రధానమైన సంస్కరణ.

**విద్యాశాఖామాత్యులుగా :**

విద్యాశాఖ మంత్రిగా పివి గారు ప్రవేశపెట్టిన సంస్కరణల ఫలితమే నేడు అనేక రకాలుగా ఉన్నగురుకుల విద్యాలయాలు, మధ్యాహ్న భోజన పథకం, తెలుగు బోధనా మాధ్యమం. ఇలా వీటన్నింటి సృష్టికర్త ఆయనే. ఆంధ్ర ప్రదేశ్ గురుకుల పాఠశాలలకు జూనియర్ కళాశాలలను ప్రారంభించారు. అప్పటిదాకా ఇంగ్లీష్ మాధ్యమంలో కూనారిల్లుతూంది. అలా వెళుతున్న విద్యావ్యవస్థలో తెలుగు మాధ్యమాన్ని సమర్థవంతం చేయడంలో సాహసం చేయడం గొప్ప విషయం. తత్ఫలితంగా తెలుగు బోధనా మాధ్యమంగా అవతరించింది. దాని కొరకు 1969లో తెలుగు అకాడమీ స్థాపన చేశాడు. స్వయంగా చైర్మన్గా ఉన్నతంగా నడిపించాడు. దాని ఫలితమే శిశు తరగతి నుండి డిగ్రీ స్థాయి వరకు తెలుగు మాధ్యమంలో అవసరమున్న అన్నీ శాస్త్రాలకు సంబంధించిన పుస్తకాల తయారీ. అది తెలుగు మాధ్యమానికి బీజభూతమై నేటికీ అనువర్తిస్తూన్నది. కానీ అదేమీ దౌర్భాగ్యమో! ఈనాడు తెలుగు మాధ్యమం బలవంతంగా పక్కకు తప్పించడం. అది ఆ మహాత్ముని ఆశయాలకు, ఆకాంక్షలకు గండి కొట్టడమే. అంత వ్యవస్థను నిర్వీర్యం చేయాడంలో నేటి ప్రభుత్వాలు సాక్షులుగా మారాలని అనుకోవడం కూర్చున్న చెట్టును నరుక్కోవడమే.

మరో ప్రధానమైన సంస్కరణ పదవ తరగతి వరకు డిటెన్షన్ విధానాన్ని నిలిపి వేయడం. అంటే రద్దు చేయడం. పిల్లలకు ఎటువంటి పరీక్షల మానసిక ఒత్తిడి లేకుండా చేయడంలో ఆయన ఆలోచన విధానం స్పష్టం. కేవలం పదవ తరగతికి మాత్రమే కామన్ పరీక్షను ప్రవేశపెట్టాడు. అదేం దురవస్థనో కానీ నేడు అది అనేక వెర్రి తలలు వేయడంలో పరాకాష్టగా మారతోంది. విద్యార్థులను ఉపాధ్యాయులను శారీరక, మానసిక ఒత్తిళ్లకు గురి చేసే రకంగా అధికారగణం తయారు చేస్తున్నారు. ఇది ఆ మహానుభావుడి ఆలోచనల పరంపరకు గండి కొట్టడమే.

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా :**

ఆయన ఏ పదవిని చేపట్టినా సాకల్యంగా అవగాహన చేసుకోవడంలో దిట్ట. ఆ అవగాహన నుండి ప్రజల ప్రయోజనార్థం ఆలోచిస్తారు. చేయవలసిన సంస్కరణ విధానాన్ని రూపొందించు కుంటాడు. ఆయా ముఖ్యమంత్రులకు, ప్రధాన మంత్రులకు దాన్ని వివరిస్తారు. దానికి వారిని ఒప్పించడం అనేది ఆయన విశేషమైన ప్రజ్ఞకు తార్కాణం. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఈ శాఖలో తీవ్రమైన మార్పులు తీసుకువచ్చాడు. ఈ మార్పులు శాఖకు కొత్త ఊపునిచ్చాయి. అందులో ప్రధానమైనవి రెండు కనబడతాయి. మొదటిది రాష్ట్రంలో ఉన్న చట్టాలు, కేంద్ర ప్రభుత్వ చట్టాలు, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, అనేక కమిటీల సిఫార్సులు, వివిధ రాష్ట్రాల ఆచరణలు, అనేక విధాన నిర్ణయాలు, ఇలాంటి వాటినన్నిటినీ దృష్టిలో పెట్టుకొని శాఖకు విధివిధానాలను ఖరారు చేయడం గొప్ప విషయం. వైద్యశాఖ, ఆరోగ్యశాఖలుగా ఉన్న రెండు శాఖలను వైద్య ఆరోగ్య శాఖగా విలీనం చేయడం అనేది విప్లవాత్మక సంస్కరణ అని చెప్పక తప్పదు. దీని ప్రభావం వల్ల ఆనాటినుండి ఈనాటి వరకు సామాన్య ప్రజలకు ప్రయోజనం కలుగుతునే ఉంది. మరో మార్పు ఏంటంటే వైద్యశాఖలో పనిచేసే డాక్టర్ల యొక్క ప్రైవేట్ ప్రాక్టీస్‌లను సమూలంగా నిషేధించడం. దీనికి సంబంధించిన బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టి ప్రజల ఆరోగ్యం పట్ల ఉన్న శ్రద్ధ కనబరిచారు. ఇవే కాక మరిన్ని సంస్కరణలు కూడా తీసుకొచ్చాడు.

**దేవాదాయ శాఖ మంత్రిగా :**

పివి గారు దేవదాయ శాఖకు మంత్రిగా రాకముందు అదో అరణ్య వ్యవస్థగా ఉండేది. సరైన విధానాలు లేవు. నియామక ప్రక్రియకు సూత్రాలు లేవు. తత్సంబంధిత యోగ్యతల విధానాలు లేవు. కావలసిన లేదా చేయవలసిన నిర్వహణ శాఖ విధులు సరైన స్థాయిలో లేవు. అర్చకులకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు లేవు. జీతభత్యాల గురించి స్పష్టత లేదు. ఇలాంటి వాటినన్నింటిని ఒంటి చేతితో సవరించాడు. అవసరమైన బిల్లులు శాసన సభలో ప్రవేశ పెట్టాడు. విజ్ఞులైన రూపకర్తలచే కావలసిన విధి విధానాలను ఇలా అనడం కంటే దేవాదాయ శాఖకు అవసరమైన విధివిధానాలను రూపొందింప చేశాడు. సంస్కరణలకు మార్గం వేసాడు. భారతదేశం లోనే ఆధునిక రీతిలో దేవాదాయ ధర్మాదాయ శాఖను పునర్నిర్మించాడు. పునర్వ్యవస్థీకరించారు. దీనివల్ల దేవాదాయ నిర్వహణ వ్యవస్థ ఒక మార్గంలో పడింది. ఆనాటి సూత్రాల ఆధారంగానే నేటికీ ఈ వ్యవస్థ నడుస్తూ ఉండటం గమనార్హం. కానీ ఇక్కడ కూడా ఒక విషయం చెప్పుకోవాలి. సహృదయంతో, సదాలోచనలతో, శ్రద్ధాసక్తులతో, నిజాయితీగా రూపొందించిన సూత్రాలను తుంగలో తొక్కి వ్యవస్థను నిర్వీర్యం చేసే పన్నలో మనం నిమగ్నం కావడం పివి గారికి ఇచ్చే నివాళి ఏ మాత్రం కాదు.

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా :**

పీవీ గారికి వచ్చిన పదవులు అన్నీ దాదాపు అనూహ్యంగా వచ్చినవే. ముఖ్యమంత్రి పదవి దానికి అతీతం ఏమీ కాదు. ముఖ్యమంత్రి అయిన తర్వాత రాజకీయంగా కూడా చక్కని సంస్కరణను ప్రవేశపెట్టాడు. అదే అసెంబ్లీ ఎన్నికల్లో బిసి, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ, స్త్రీలకు ఎక్కువ సీట్లు కేటాయించడం. ఈ పనిని ఆయన సమర్థవంతగా చేయగలిగాడు. ఇలా 1971 సెప్టెంబర్ 30న ఆంధ్రప్రదేశ్ ప్రమాణ స్వీకారం చేసిన ఆయన ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన సిద్ధాంత సూత్రాలతో సునాయాసంగా విజయం సాధించగలిగాడు. ఆ తర్వాత వెంటనే ముఖ్యమంత్రిగా దేశంలో ఎక్కడా కనీవినీ ఎరుగని విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. మహోన్నతమైన ఆదర్శానికి చరిత్రలో స్థానం

కల్పించాడు. అవే భూసంస్కరణలు. తాను ప్రకటించిన భూ సంస్కరణలు చట్ట రూపం దాల్చే లోపల భూకామందులు ఏ ఇబ్బందులు పెడతారో అనే భయంతో వెనువెంటనే ఆచరణకు పూనుకొన్నాడు. ఆనాటి గవర్నర్ భూసంస్కరణల ఆర్డినెన్సు జారిచేసారు. ఆ తర్వాత దాన్ని చట్టం చేసారు. వ్యవసాయ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాడు. భూ పరిమితి విధించాడు. మిగులు భూములను పేదలకు పంపిణీ అయ్యేట్లు చూసినాడు. తాను స్వయంగా 600 ఎకరాల భూదానం చేసినాడు. 12 నుంచి 27 ఎకరాల తరి భూమికి పరిమితి విధించారు. 30 నుండి 55 ఎకరాల ఖుష్కి భూమిని పరిమితిగా చేశాడు. ఈ చట్టాన్ని చేస్తున్నప్పుడు ఆనాటి అసెంబ్లీలో పీవీ మాటలను గుర్తుకు తెచ్చుకుందాం.

**"మనం తెచ్చే ఏ చట్టమైనా సామాన్య ప్రజలకు లాభం చేకూర్చేదిగా ఉండాలి. అంతే తప్ప అది మనకు ఇష్టం కాబట్టి చట్టం చేశామనే విధంగా ఉండకూడదు"**

ఈ మాటలు శాసన కర్తలకు నాటికైనా, నేటి కైనా, ఎప్పటికైనా శిరోధార్యమే.

**భారతదేశ విదేశాంగ శాఖ మంత్రిగా:**

అపారమైన తెలివితేటలు, అనేక విషయాలపై ఆయనకున్న పట్టు విశేషమైనది. వీటిని అన్నింటిని దేశ కేంద్ర నాయకత్వం గమనించింది. ముఖ్య మంత్రిగా రాజీనామా చేసిన ఆయనను ఢిల్లీకి పిలిపించింది. వంగరలో ప్రశాంతంగా ఉన్న ఆయన ఢిల్లీకి ఎకాయెకి వెళ్ళాడు. అంతే ఇక ఆయన మళ్ళీ వెనుకకు రాలేదు. ఆనాటి మన దేశం ప్రధానమంత్రి ఆయనలోని సంస్కరణ జిజ్ఞాసను పసిగట్టారు. విదేశాంగ శాఖ బాధ్యతలను ఆయనకు ఇచ్చారు. ఆ శాఖ నిర్వహణ అనేది కత్తి మీద సాము లాంటిది. అప్పటికే మన విదేశాంగ విధానం అటు అమెరికాను పక్కన పెట్టింది. ఇక అలీన విధానంలో నలిగి పోతున్నాం. ఇది ఏమాత్రం రుచించని పీవీ మెల్లమెల్లగా అలీన దేశాల నుండి పక్కకు వచ్చే ఆలోచనలను చేయడం ఓ పెద్ద సంస్కరణ అని చెప్పక తప్పదు. కాకపోతే అప్పుడు అది పూర్తిగా ఆయనకు సాధ్యం కాలేదు. కారణం ఆనాటివరకు ఉన్న ప్రధానమంత్రి భావాలు కావచ్చు లేదా ఆనాటికి ఆచరణలో ఉన్న సిద్ధాంతాలు కావచ్చు. ఇక ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలు పునరుద్ధరించే దిశగా అడుగులు వేయడం ఆయన సంస్కరణల దూరదృష్టికి నిదర్శనం. ఇజ్రాయిల్ – భారత దౌత్య సంబంధం బంధానికి పునాది ఆనాటి సంస్కరణ ఫలితమే. పాలస్తీనా విమోచన నాయకుడు యాసర్ అరాఫత్‌ను ఆనాటి ఇజ్రాయిల్ ప్రధానమంత్రిని కాల్పుల విరమణ చేయించడంలో పి.వి. ముఖ్య పాత్ర పోషించడంలో ముందు ఉన్న విషయాన్ని ప్రపంచం మరిచిపోదు.

అలీన దేశాల్లో ఉన్న బీద దేశాలతో మనం ముందుకు వెళ్ళలేమనే విషయాన్ని గ్రహించాడు. అందుకే లుక్ ఈస్ట్ పాలసీ రూపొందించాడు. ఇది తన సూక్ష్మదృష్టిని, పరిణతను తెలుపుతుంది. ఎందుకంటే ఈనాడు మన విదేశాంగ విధానంలో ఇది ఒక అత్యవసరంగా మారింది. అవశ్యవిధానమైంది. అమెరికాతో సంబంధ బంధాలకు బీజాలు వేయడం మొదలు పెట్టాడు. అదే సమయంలో ప్రతి దేశంతో స్నేహపూర్వక హస్తాన్ని చాచడంలో ముందు నిలిచాడు. ఈలాంటి అన్నీ విషయాలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. పీవీని ఆనాడు ప్రపంచం వేనోళ్ళ కొనియాడింది. ఆయన పరిణతికి ముగ్ధురాలైంది. ఆనాడు విదేశాంగ విధానంలో వచ్చిన సంస్కరణల సత్ ఫలితాల వల్ల ఈనాటికీ మనం వాటిని కొనసాగించక తప్పని పరిస్థితి ఏర్పడింది. అదే మన భారతదేశాన్ని విదేశాంగ విధాన యవనిక మీద మహోన్నతంగా నిలబెడుతున్నది.

**కేంద్ర మానవవనరుల శాఖామాత్యులుగా:**

ఆనాటి వరకు ఉన్న విద్యాశాఖను, మరిన్ని సారూప్యమైన మరిన్ని శాఖలను కలిపి మానవ వనరుల శాఖగా సృష్టించిన మేధావి. ఇది దేశానికి అనేక ప్రయోజనాలను కల్పించింది. జాతీయ విద్యా విధానానికి పురుడు పోసింది. మానవ వనరుల శాఖామాత్యులుగా ఉన్న పి.వి. జాతీయ విద్యా విధానపు సారథిగా అడుగులు వేసాడు. దేశ విద్యా విధానంలో ముఖ్యమైన మార్పులకు శ్రీకారం చుట్టాడు. అవి, వాటి ప్రభావం నే దేవిధంగా ఉందో ఇక్కడ చెప్పుకుంటే చర్విత చర్వణం అవుతుంది.

**భారత ప్రధానమంత్రిగా:**

ముందే చెప్పుకున్నట్లు పదవుల కొరకు ప్రాకులాట లేదు. పదవులే వచ్చి ఆయన కాళ్ళ పైన వాళ్ళ మాకు కీర్తి నివ్వు మహా ప్రభో! అని వచ్చి వాలాయి. ఇలా వచ్చిన మరో అత్యున్నతమైన పదవి భారత ప్రధానమంత్రి. ఆనాటి ఎన్నికల్లో ఆయనకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని ఆలోచన కూడా లేదు. డబ్బయ్యవ ఒడిలో ఉన్న ఆయన రాజకీయాలకు దూరంగా కుర్తాళం పీఠానికి చేరుకోవాలని సంకల్పించుకున్నారట. కానీ తానొకటి తలిస్తే దైవమొకటి తెలుస్తుంది కదా! ఈ దేశాన్ని గాడిలో పెట్టడానికి, పరమ ప్రయోజనం కలిగించడానికి, విధి పీవీని ఎన్నుకున్నది. అందుకేనేమో ముక్తకంఠంతో ఆనాటి కాంగ్రెస్ వాదులంతా ఆయన్ని భారత ప్రధాన పీఠం మీద ప్రధానిగా కూర్చోబెట్టారు.

ఆయన కూర్చున్న పీఠం శ్వాస అందుకోలేని దుర్భర ఆసనం. ఆయాసంతో కూడుకున్న అశనిపాత సమయం. దేశం 47 టన్నుల బంగారాన్ని ఐ ఎం ఎఫ్ కు తాకట్టు పెట్టిన సమయం. విదేశీ మారక నిల్వలు అడుగంటిపోయిన కాలం. ఎగుమతులు తరుగుతున్న సమయం. దిగుమతులు పెరుగిపోతున్న విపత్కాలం. విదేశీ మారక నిల్వలు కనాకష్టంగా తయారయ్యాయి. ఏమీ చేయలేని పరిస్థితా అన్నట్లుంది ఆనాటి దేశ పరిస్థితి. రాజకీయ స్తబ్దం, ఆర్థిక మాంద్యం... వెరసి దేశం కూపంలో కూరుకు పోయినట్టయింది. ఆ సమయానికి

పీవీ తన సంస్కరణ జూలు విదల్చినాడు. రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ అయిన మన్మోహన్ సింగ్‌ను ఆర్థికశాఖ మంత్రిగా కూర్చో బెట్టారు. మంత్రికి ఉండే సంకెళ్ళను తీసివేసినారు. పారిశ్రామిక విధానాల్లో తీవ్ర మార్పులు తీసుకువచ్చారు. ఆర్థిక సరళీకరణ మార్గాలను ప్రవేశపెట్టారు. అడుగంటి పోయిన విదేశీ మారక నిల్వలు 72 బిలియన్ల ఉన్నత స్థాయికి చేర్చారు. అందుకు అవసరమైన లైసెన్స్ రాజులను చెత్తబుట్టలో పడేసారు. పీ.ఎం.వో ప్రిన్సిపల్ సెక్రెటరీ నరేష్ చంద్ర ఒక ఆర్థిక నోటును తీసుకొచ్చి పీవీకి ఇచ్చారట. అది ఎనిమిది పేజీల నోట్. పీ.వీ ఆయనతో **"ఆర్థిక వ్యవహారాల గురించి నాకేమీ తెలియదు"** అని అంటూనే ఎనిమిది పేజీల నోట్ ను క్షణాల్లో చదివాడు. ఆమోద ముద్ర వేసారు. ఆర్థిక విషయాల్లో ఆయన అవగాహన ఎంతటిదో అర్థమవుతుంది. వెనువెంటనే రూపాయి విలువ తగ్గించడం. ప్రైవేటీకరణ వైపు మొగ్గు చూపడం. ప్రైవేటు కంపెనీలకు తలుపులను బార్లా తెరవడం. వ్యాపార రంగంలో సరళీకరణ మార్గంలో ముందడుగు వేయడం. వీటన్నింటి ఫలితమే 1991 – 92 లో 132 మిలియన్ డాలర్లు గా ఉన్న విదేశీ పెట్టుబడులు 1995 – 96 నాటికి 5.3 బిలియన్ డాలర్ల శిఖర స్థాయికి చేరుకోవడం ఎంత నిబద్ధమైన సంస్కరణలు మహోన్నత మైన ఫలితమో. ఒక్క మాటలో చెప్పాలంటే భారతదేశ ఆర్థిక స్వాతంత్ర్యం 1991 లో వచ్చిందని చెప్తూ ఉండడం. ఇది వాస్తవం. **'హౌ పీవీ నరసింహారావు మేడ్ హిస్టరీ'** అనే సంజయ్ బారు రాసిన గ్రంథం పీవీ ఆర్థిక సంస్కరణలకు దర్పణంగా ఉంటుందంటారు. ఈనాటికీ ఆ సంస్కరణలు కొనసాగింపు జరుగుతున్నదంటే అవి ఎంత అవసరమైనవో! ఎంత బలిష్టమైనవో! ఆ విషయం మనకు ఇప్పుడు అవగతమవుతుంది. 'ధైర్యే సాహసే లక్ష్మీ' అనే మాటలు అక్షరాల ఈ విషయంలో సరి పోతాయి.

ఇక ఇక ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రజలకు మేలు చేయడంలో మరో అడుగు వేసాడు. ఆ వ్యవస్థను పటిష్టం చేశాడు. బహిరంగ అంగట్లో కంటే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా తక్కువ ధరలో ప్రజలకు వస్తువుల్ని అందించేలా వ్యవస్థను రూపొందించాడు. మరొక కీలక సంస్కరణ పంచాయతీ రాజ్ వ్యవస్థను నిలబెట్టడం. దానికి కావలసిన చట్టాలు చేయడం. ఆ చట్టాల ప్రకారం గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు, నగరపాలికలకు విశేషమైన ప్రాధాన్యం కల్పించడం. పరిపాలనా సంస్కరణలతో దేశాన్ని బలోపేతం చేయడంలో ఆయన సారించిన దృష్టి అమోఘమైనది.

ఇకపోతే ఈనాడు మనం చూస్తున్న కొన్ని పింఛన్లకు ఆయనే ప్రధాన కారణంగా చెబుతారు. ఉదాహరణకు వృద్ధాప్య పింఛన్లు, సిపాయి కార్మికుల యోగక్షేమ నిధులు మొదలైనవి. ఆహారం లేకపోవడం వల్ల మధ్యలో బడి మానివేసే పిల్లలకొరకు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిపుష్టం చేసిన మహానుభావుడు. ఇలా ఎన్ని సంస్కరణలు చేసుకుంటూ ముందుకు వెళ్ళాడో.

దేశ ప్రయోజనాల విషయంలో కూడా దేశమంతా ఒకటే అనే ఓ అద్భుత సంస్కరణను ప్రపంచం ముందు నిలిపాడు. పాకిస్తాన్ చేస్తున్న కుతంత్రాలను తిప్పికొట్టేందుకు మానవ హక్కుల సంఘం వారు నిర్వహించిన జెనివా సమావేశానికి ప్రతిపక్ష నాయకుడిని నాయకుడిగా చేసి పంపడం ఎంత ఉన్నతమైన కార్యం. అంటే మనదేశం వరకే మనం స్వపక్ష విపక్షులం. బయటకు వెళ్ళినప్పుడు విజ్ఞుడైన ఏ పక్షం వాడికైనా దేశప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని భాగస్వామ్యం కల్పించాలి. అది దేశానికి మేలు చేస్తుంది అని చెప్పకనే చెప్పిన పరమోదారుడు. జెనీవా సమావేశంలో వాజ్‌పేయి దేశానికి అఖండ విజయాన్ని సాధించి పెట్టాడు. దానికి కారణం పీవీ వేసిన అడుగు.

మరొకటి ప్రపంచ శాంతినే కోరుకున్నాడు. కానీ అవసరమైతే శత్రువును ఏ స్థాయిలోనైనా దెబ్బతీస్తామని చెప్పడానికి అణ్వస్త్ర ప్రయోగానికి కూడా సిద్ధం చేసిన దురంధరుడు. దార్శనికుడు.


పీవీ ఏ సంస్కరణ చేసిన ప్రజాహితమే. తాను ఏ మార్గం అవలంబించిన దేశ అభివృద్ధే. ఆయన ఏ పథం ఎంచుకున్నా అది దీర్ఘకాలిక మార్గదర్శ పథమే.

విదురుడు చెప్పిన మాటలను పీవీ నరసింహారావు గారు పుణికిపుచ్చుకొని వాటన్నింటిని వదలినట్లున్నాడు. అందుకే అలా నడుచుకున్నాడెమో! అని అనిపించక తప్పదు. ఎన్ని సంస్కరణలు తీసుకు వచ్చిన తాను తాను గానే ఉన్నాడు. ఆ విషయం ఈ క్రింది పద్యంతో మనకు అవగతమవుతుంది.

**కోపము నుబ్బును గర్వము**
**నా పోవక ఒక యూనికియు దురభిమానము ని**
**ర్వ్యాపారత్వము నసునివి**
**కాపురుష గుణములంద్రు కౌరవ నాథా!** (ఆంధ్ర మహాభారతం ఉద్యోగపర్వం ద్వితీయాశ్వాసం 32 వ పద్యం)

**'ఎంత గొప్పవాడైనా, ప్రపంచం ఆయనను కీర్తించినా ఆయన ఆయన గానే సత్ పురుషుడుగానే మహోన్నత రాజకీయ సంస్కరణ దురంధరుడిగా'** నిలవడం యావద్భారత దేశానికి గర్వకారణం. అనుకరణలు లేని సంస్కరణాభిలాషికి జయహో!

సర్వదా దేశహితైషీ అమర్ హో!



# సాహిత్యం – సిద్ధాంతం – ఆచరణ – సమాజం

వడ్డేపల్లి మల్లేశము, ఫోన్ : 901 420 6412

**సాహిత్యం అంటే ఏమిటి :**

సమాజంలోని భిన్న వర్గాలు, సమస్యాత్మక సమూహాలు, సామాజిక రుగ్మతలు, అంతరాల వ్యవస్థలు నిర్మూలించి సామాజిక రుగ్మతలను సరిచేయడానికి అంతిమంగా సమ సమాజాన్ని స్థాపించడానికి మేలు కోరే అంశమే సాహిత్యం.

అది మాట, పాట, గద్యము, కవిత, వచనము, గేయము, కథ, కథానిక, నవల, నాటకం, బుర్రకథ, వ్యాసము, లేఖలు, పద్య శతకము, గద్య శతకము, సంభాషణలు, వీధి నాటికలు ఇలా ఎన్నో రూపాలలో సామాజిక అంశాన్ని కేంద్రంగా తీసుకొని విభిన్న పాత్రలను అలరింప చేయడం ద్వారా సమస్యను సమస్య పరిష్కారాన్ని ముగింపును ఇవ్వగలిగే రూపమే సాహిత్యము. ఇది మౌఖికంగానూ లిఖిత రూపంలోనూ ప్రదర్శన రూపంలోనూ పాత్రోచిత నటన రూపంలోనూ జనం లోకి వెళుతుంది.

ఇంతటి గురుతరమైన బాధ్యతను నిర్వహించడానికి సామాజిక చింతన, సామాజిక బాధ్యత, సమయస్ఫూర్తి, సామాజిక కోణములో ఆలోచించగలిగే కవులు కళాకారులు రచయితలు మేధావులు వ్యాసకర్తలు తమ తమ ఆలోచనా పరిధి మేరకు రచన రూపాన్ని అందిస్తారు. ఆ రచన చదవడం ద్వారా, అధ్యయనం ద్వారా, పరిశీలన, సామాజిక పరిశీలన ప్రదర్శనల ద్వారా ప్రజల మనసుల పైన బలమైన ప్రభావాలను ఈ రూపాలు చూపుతాయి.

తద్వారా మానసిక పరివర్తనకు సామాజిక సంక్షోభాలు నివారణకు సామాజిక రుగ్మతలపై సమరభేరి మ్రోగించడానికి అవకాశం సాహిత్యానికి ఉంటుంది.

**సిద్ధాంతం అంటే :**

ఈ కేంద్రంగా సమాజ హితాన్ని ఆకాంక్షించి సామాజిక మార్పుకే దోహదపడే బలమైన ధోరణలు, దృక్పథాలు, వైఖరులను కలిగి ఉ ండటం సిద్ధాంతం కిందికి వస్తుంది. ఈ రకంగా రచయిత తన కంటూ ఒక భావజాలం కలిగి ఉండి వీలున్న మేరకు ఆచరించడానికి సంసిద్ధంగా ఉన్నప్పుడు మాత్రమే ఒక రచన ప్రక్రియను సృష్టించడానికి అవకాశం ఉంటుంది. లేకుంటే చుక్కాని లేని నావ లాగ, సమాజ మార్పుకె దోహదపడని విద్య లాగా, తుప్పు పట్టిన కత్తి లాగా నిరుపయోగమే అవుతుంది ఆ రచన. అంటే బలమైన సిద్ధాంతం బలమైన ఆచరణకు పునాది అవుతుంది. ఆ మంది రచయితలకు సమాజ సంక్షోభాలను నివారించడానికి మౌలికమైన భావజాలం లేని కారణంగా పైపై ఆలోచనలతోనే రచనలు చేయడంతో అది పునాదిలేని భవనము లాగా బలహీనంగా ఉంటుంది ఇది రచయితలు కవులు గమనించవలసిన నిత్య సత్యం.

ఎందుకు కవులు రచయితలు మేధావులు వ్యాసకర్తలు ప్రముఖ తత్వవేత్తల, ప్రకృతివేత్తల, సాహితీవేత్తల పరిశీలనలు రచనలను అధ్యయనం చేయవలసి ఉంటుంది అప్పుడు మాత్రమే మౌలికమైన భావజాలం కలిగి ఉండడానికి ఆస్కారం ఉంటుంది. ఆ మౌలికమైన భావజాలం కలిగి ఉన్నామ? అని మనకు మనమే ప్రశ్నించు కోవలసిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే సామాజిక బాధ్యతను సరిగా నిర్వహించగలం. సామాజిక సంక్షోభాలను నివారించగలం.

సిద్ధాంతం అంతా సమాజము గురించే చెప్తుంది. సమాజంలో ఉన్నటువంటి వైరుధ్యాలు, సంఘర్షణలు, క్లిష్టతలు, వివక్షతలు, అసమానతలు, అంతరాలు దోపిడీ, పీడన, వంచన, ఆధిపత్యము వంటి అసాంఘిక అంశాలను పరిష్కరించడానికి రచయితగా ముందు సిద్ధంగా ఉండాలి. వ్యవస్థను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడానికి భావజాలపరంగా కలిగి ఉండే సాంకేతిక అంశం, సంసిద్ధతయే సిద్ధాంతము అనబడుతుంది.

**ఆచరణ ఎక్కడ కనిపించాలి :**

సాహిత్యానికి సంబంధించి పైన పేర్కొన్న రచయితలు కలిగి ఉ ండవలసిన సిద్ధాంత ప్రాతిపదిక పరిణామక్రమంలో సుహృద్భావ పూరిత వాతావరణంలో మనం ఆశించే సమాజం వైపు తీసుకెళు తుంది. అంటే ఆచరణ సమాజము మొత్తములో అన్ని విభాగాలలో అన్ని వైరుధ్యాల లో దాని ఫలితము కనపడాలి. ఆ రకంగా కవులు రచయితలు ఆశించే సమాజ హితానికి సంబంధించిన మార్పు, ఫలితము తమతోనే ప్రారంభించవలసి ఉంటుంది.

ఉల్లిగడ్డ కథలాగా సమాజం గురించి మాత్రమే వర్ణించడానికి సాహిత్యం కాదు. రచయిత తన స్వీయ అనుభవంలో వైరుధ్యాలు పోకడలకు సంబంధించిన ఆచరణను చూపగలగాలి. ఇప్పటికీ అనేక మంది సమానత్వం కావాలని వివక్షత కూడదని చెబుతున్నప్పటికీ కులపరమైన మతపరమైన వివక్షతలను చూపుతూ నిజజీవితంలో తప్పుడు భావనలకు పాల్పడుతున్న రచయితలు అనేకమంది ఉ న్నారు. అది అస్పృశ్యత పాటించడం కావచ్చు. వివక్షతకు గురి చేయడం కావచ్చు.

హీనంగా చూచి చిన్నచూపు గా అవమానించడం లోనూ మనకు సర్వత్రా కనబడుతూనే ఉంటుంది. తనకు మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం అన్నట్లే తను ఆచరించకుండా సమాజానికి చెప్పే నీతి అది సాహిత్యం అని అనబడదు అందుకే ఆచరణ కవి కులం తోనే ప్రారంభం కావాలి. అప్పుడు రచయితలు మరింత బలంగా తమ రచనకు పదును పెట్టే అవకాశం ఉంటుంది.

**ఏ రంగాలు బలోపేతం కావాలి :**

ఉత్తమ సాహిత్యం, రచనలు రచయితల ఆలోచనా సరళి రాజ్యంలోని భిన్న వర్గాలను ప్రభావితము చేయవలసిన అవసరం ఉంటుంది అప్పుడు మాత్రమే మనం ఆశించే మార్పులు సాధ్యమవుతాయి. యువత, సాహిత్య రంగము, ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు, మేధావులు, విద్యార్థులలో ఈ మార్పును చూడగలగాలి. సామాజిక మార్పు సాహిత్యరంగం ఎంత దోహద పడుతుందో విద్యారంగము కూడా అదే స్థాయిలో పనిచేస్తుంది ఈ మౌలికమైన అంశాన్ని అటు ఉపాధ్యాయులు ఇటు రచయితలు సమాంతరంగా నిర్వహించడం ద్వారా మాత్రమే సామాజిక సాహిత్య సాంస్కృతిక పరమైన మార్పులు సమాజంలో సాధ్యమవుతాయి. ఈ రంగాలలో సంభవించిన మార్పులు సమాజానికి దారితీసే క్రమంలో మనము చూడవచ్చు. ఇందుకు వ్యవస్థల, వ్యక్తుల, సంస్థల చిత్తశుద్ధి, అంకితభావం, నిబద్ధత, చాలా అవసరము.

విద్యా రంగంలో పనిచేసే ఉపాధ్యాయులు పాఠ్యాంశాలకు తోడుగా తరగతిగది ని తన పూర్తి స్వాధీనములో నికి తెచ్చుకుంటే సమాజం పట్ల తన మౌలికమైన ఎటువంటి మార్పులు ఆశించే నిబద్ధత కలిగిన వ్యక్తిగా ఉన్నట్లయితే సమాజాన్ని తరగతిగదిలో విద్యార్థులకు చూపడం ద్వారా సామాజిక పరిష్కారాలను కనిపెట్టవచ్చు. ఈ బోధనా లేదా బోధనాభ్యసన ప్రక్రియలో విద్యార్థులను ప్రశ్నింప చేయడం, ప్రశ్నింప నేర్పడం అనే మౌలిక అంశాలను ఉపాధ్యాయులు మరచిపోరాదు.

అటు ఉపాధ్యాయులు, ఇటు సాహిత్య సృజనకారులు సమాంతరంగా చిత్తశుద్ధిగా సవాలుగా స్వీకరించి నట్లయితే వ్యవస్థలో మార్పులు ఊహించినదానికంటే ముందే సాధించవచ్చు కానీ ఈ రెండు రంగాల మధ్యన సమన్వయ పరిచే వ్యక్తులు కావలసిన అవసరం ఉన్నది. వాళ్లే బుద్ధిజీవులు, మేధావులు.

**మేధావుల బాధ్యత :**

ఇవ్వాల రాజకీయంలో రాజనీతిజ్ఞత కొరవడింది. ప్రతి వర్గం లోనూ స్వార్థ చింతన పెరిగి ఆశయము ఆకాంక్షలు కనుమరుగవు తున్న వేల జీవులు మేధావులు రాజకీయ రంగానికి దిక్సూచిగా పని చేయడంతో పాటు ప్రధాన వ్యక్తులుగా ఉన్న విద్యారంగం సాహిత్య రంగాన్ని సరైన దారిలో పెట్టడానికి సమగ్ర ప్రణాళికను ఏర్పాటు చేయవలసిన బాధ్యత మేధావులదే. ఇప్పటికే ఆ బాధ్యతను విశ్వవిద్యాలయ స్థాయి మేధావులు ప్రొఫెసర్లు ఆచార్యులు ఆలోచిస్తున్న అప్పటికీ ప్రభుత్వం యొక్క దుందుడుకు చర్య వలన, నియంత్రణ, నిర్బంధ విధానాల వలన ఆలోచన ఆచరణ వైపుగా వెళ్ళడానికి కాలయాపన జరుగుతున్నది. అందుకే రచయితలు ఉపాధ్యాయులు తమ యొక్క వేగాన్ని మరింతగా పెంచి తమ తమ వృత్తులలో సమాజమే కేంద్రంగా పని చేసినట్లైతే ఉత్తమ సాహిత్యాన్ని ఉత్తమోత్తమ సమాజాన్ని రూపకల్పన చేయవచ్చు. అందుకే మెరుగైన సమాజం ఆవిర్భావానికి సాహిత్యము సిద్ధాంతముతోపాటు ఆచరణ ప్రముఖ పాత్ర పోషిస్తుంది అనే విషయాన్ని బుద్ధిజీవులు సాహిత్యకారులు ప్రతి అడుగులోనూ ఆలోచించవలసిన కర్తవ్యం ఉన్నది.

( ఈ వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు కవి రచయిత విమర్శకులు, మీరు ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు అధ్యక్షులు జాగృతి కళాసమితి హుస్నాబాద్ జిల్లా సిద్దిపేట తెలంగాణ రాష్ట్రం)

# అచ్చులతో మెరుపులు

'అ'తో అమ్మ
అమ్మకు వందనం
తల్లీ దీవించమ్మ
జీవితం నూరేళ్ళ నందనం!!

'ఆ'తో ఆవు
సకల దేవతలు కొలువున్న దైవం
పూజించు గోవు
వరమిచ్చు దైవం!!

'ఇ'తో ఇల్లు
నివసించడానికి ఉపాధి
కష్టాలకు చెల్లు
దొరికితే జీవనోపాధి!!

'ఈ'తో ఈక
పిట్టతోకలో భాగం
పక్షుల మూక
ప్రకృతిలో భాగం!!

'ఉ'తో ఉడుత
సామెతకు నెలవు
చిన్నజీవుల నడత
క్రమశిక్షణ కొలువు!

'ఊ'తో ఊయల
ఆనందాల నిలయం
పిల్లలు జోల
నిద్రకు దేవాలయం!!

'ఋ'తో ఋషి
తపస్సుకు దాసుడు
దైవం అతన్ని చూసి
కురిపించు వరాలు దోసెడు!!

'ఎ'తో ఎలుక
రంధ్రాల వీరుడే
బయటకు వస్తే ఎలుక
ధాన్యం చోరుడే!!

'ఐ'తో ఐకమత్యం
ఇదే దేశం కోరిక
సాధించాలి సమానత్వం
ఉండాలి ఓపిక!!

'ఒ'తో ఒంటె
ఎడారిలో పరుగులు
జీవితం ఉంటే
నిత్యం ఉరుకులు!!

'ఓ'తో ఓడ
నీటి ప్రయాణం తేలిక
గురువే నీడ
జీవిత ప్రయాణం మేలిక!!

'ఔ'తో ఔషధం
ఆరోగ్యానికి వరం
అనారోగ్యమే విషాదం
జీవితం దుర్భరం!!

'అం'తో అంతం
దుర్గుణాలతో యుద్ధం
చేయాలి జీవితాంతం
అదే పని చేద్దాం!!

'అః'తో అంతఃపురం
కలల మేడ
విశ్వమే అనంతపురం
వెతకాలి జాడ!!

**పూజారి చౌడయ్య**

# తెలంగాణ అభ్యుదయ కథలు – చైతన్యం

డా॥ కె. సుభాష్ చంద్రబోస్ ఫోన్ : 9966956953

నిర్బంధం, గ్రామాల్లో భూస్వాముల ఫ్యూడల్ దోపిడీని తట్టుకోలేక, ఉన్న భూమిని కోల్పోయి కడుపు చేత పట్టుకుని ఎందరో రైతులు, రైతు కూలీలు బతుకుతెరువు కోసం కాలేరు కెళ్ళి బొగ్గు గనుల్లో కార్మికులుగా చేరారు. అయితే అక్కడ వారికి శ్రమరూపం, దోపిడీ రూపం, మారిందే తప్ప కష్టాలు, కన్నీళ్ళు తప్పలేదు. పల్లెల్లో స్వచ్ఛమైన గాలి, వెలుతురు, నీరు, స్వేచ్ఛగా లభించేవి. ఇక్కడ అవి కూడా వారికి కరువయ్యాయి. గ్రామాల్లో తమ కష్టాలకు కారణమైన దొర ప్రత్యక్షంగా కన్పించేవాడు కానీ గనుల్లో తమ రక్తాన్నీ, ఎముకల్ని, మూలుగునీ పీల్చేసే శత్రువెవరో కూడా గుర్తించలేని స్థితిని వారు ఎదుర్కోవాల్సి వచ్చింది. గని అయినా, పల్లె అయినా, పట్నమయినా పోరాడందే బతుకు బాగుపడదని వారు గ్రహించారు. దోపిడీకి గురయ్యే కార్మిక జీవితంలో అది తొలగించుకోవాలంటే పోరుదారే తప్పదని గమనించారు. తెలుగులో తక్కిన కథలకన్నా కార్మిక పోరాట కథలు విలక్షణమైనవి, విశిష్టమైనవి. బొగ్గులో బొగ్గుగా మారిన కార్మికులే రచయితలుగా మారి రాసిన కథలివి.. అందుకే వీటిలో కార్మిక వర్గ చైతన్యం ప్రత్యక్షంగా కన్పిస్తుంది. ఈ కథలు సింగరేణి కార్మికుల పోరాట వివిధ దశల్ని చిత్రంచే కార్మికోద్యమ చారిత్రక వాస్తవాలు.

**రాజీ (అల్లం రాజయ్య) :** గాలి, నీళ్ళు, సరైన నివాసం లేక సమస్యల వలయంలో చిక్కుకున్న బొగ్గుగని కార్మికుల జీవితాన్ని చిత్రించే అల్లం రాజయ్య 'రాజీ' కథ 1978లో రాసింది. కార్మిక కథల్లోనే మొదటి కథ. కార్మికులకు నీళ్ళు దొరకని పరిస్థితుల్లో ఆఫీసర్లు స్విమ్మింగ్ పూల్స్‌లో ఈతలు కొట్టే అసమానతల్ని, ట్రేడ్‌యూనియన్ నాయకులు మేనేజ్‌మెంట్‌తో చేతులు కలిపి కార్మికుల నోళ్ళలో మన్నుకొట్టే దురాగతాల్ని కార్మికులకు కనీసావసరాలు తీరక నీళ్ళకోసం, నీడకోసం యూనియన్ల ప్రమేయం లేకుండానే సమ్మె చేయక తప్పని పరిస్థితుల్ని స్థూలంగా ఈ కథ చిత్రించింది. 'చమురు దొంగలు' బట్టలమిల్లు కార్మికుడికి కట్టుకోవడానికి సరైన బట్టలు,మందుల ఫ్యాక్టరీ కార్మికుడికి రోగమొస్తే వేసుకోవడానికి మందులుండవు. తమ శ్రమశక్తి ద్వారా ఉత్పత్తయిన వస్తువు అతనికే మాత్రం ఉపయోగపడదు. అలాగే బొగ్గు పని కార్మికుడికి వంట చేసుకునేందుకు బొగ్గు దొరకదు. తమకు అవసరమని ఫ్యాక్టరీలోంచి బొగ్గు తెచ్చుకుంటే దొంగలుగా పిలువబడి జైలుపాలైన దీన స్థితిని తెల్పిన కథ.

**ఇల్లు (తుమ్మేటి రఘోత్తమరెడ్డి) :** పెట్టుబడిదారు లాభాపేక్ష మానవ సంబంధాల్ని శాసిస్తుంది. మానవతా విలువల్ని మంటగలుపుతుంది. కుటుంబ సభ్యుల్ని విడదీస్తుంది. సరైన వసతి లేక భార్యకు దూరమైన నారాయణ కొడుకు బాధ చూడలేని తండ్రి వీరయ్య నీడకోసం కంపెనీ ఖాళీజాగలో ఇల్లు కట్టుకుంటారు. కానీ యాజమాన్యం పోలీసుల అండతో దాన్ని కూల్చివేస్తుంది. దాంతో కార్మికులు ఏకమై ధైర్యంతో కంపెనీ కార్యాలయ ఆవరణలోనే సంసారాలు పెట్టి పోరాటస్ఫూర్తి చూపుతారు. ఇలా కార్మికులు సంఘటిత శక్తితో జీవితాన్ని మెరుగుపరచుకోవడానికి చైతన్యం కావల్సిన అవసరాన్ని అద్భుతంగా చూపిన కథ.

**జడ్తి– (పి.చంద్) :** తమ భూమిలోని సంపద వల్ల రైతులు, కార్మికులు భూనిర్వాసితులవుతే, అరబ్బులు కోటీశ్వరులవుతున్నారు. బొగ్గుకోసం బ్లాస్ట్ చేయబడే కృత్రిమ భూకంపాల మధ్య ఎందరో అనారోగ్యం పాలవడమే గాక వారికి కరెంట్, నీరు, కూడు, గూడు కూడా కరువై ఈ నేపథ్యంలో ఒక ఊరంతా బలిచ్చే మేకలా 'జడ్తి'కి గురికావడం ఈ కథాంశం. ఓపెన్‌కాస్టు బొగ్గుగని ప్రాంతపు పదేళ్ళ జీవిత చిత్రణను ఒక ఉపాధ్యాయుని అనుభవాల రూపంలో వివరించిన కథ.

**బొగ్గు పొరల్లో – (తుమ్మేటి) :** కార్మికులంతా ఏకమై సమ్మెకు దిగాల్సిన అవసరాన్ని కార్మికులను దోపిడీ చేసే యజమాన్యంపై సమ్మెకు దిగాలని నిర్ణయించుకోవడంతో కార్మికులకు అవసరమైన చైతన్యాన్ని గురించి తెల్పిన చక్కని కథ. 'సంవత్సరాలుగా చీకటి గుయ్యారాల్లో బొగ్గు తవ్వి తవ్వీ బొక్కలు తేలిన శరీరాల వాళ్ళు, ఎండిపోయిన ముఖాల వాళ్ళు, లొండ్ల కండ్లవాళ్ళు, చప్పిడి దవడల వాళ్ళు భగభగ మండుతున్నారు' అంటూ కార్మికుల్లో వచ్చే చైతన్యాన్ని చిత్రించింది.

**బోనస్–(పులుగు శ్రీనివాస్) :** సామాన్య కార్మికుడైన చంద్రయ్య మొదటిసారిగా బోనస్ అడిగి కింత చైతన్యం ప్రదర్శిస్తాడు. దాంతో యాజమాన్యం అతన్ని హత్య చేసి, ప్రమాదంగా భ్రమింపచేస్తుంది. కార్మికులు ఉద్యమం చేయాల్సిన అవసరాన్ని చాటి చెప్పిన కథ. రైతన్నలు కరువుకాటకాల వల్ల పల్లెల్లో పనిలేని స్థితిలో అక్కడి స్వచ్ఛమైన గాలి నించి కార్మికులుగా మారి బొగ్గు పొరల్లో ఊపిరి సలపనిపని యంత్రాల్లోకి, మురికికూపాల్లోకి, అప్పుల ఊబిలోకి వ్యసనాలకు బానిసలై రావల్సివచ్చింది. వారి పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యింది. సమ్మెలు చేసినా ఫలితం శూన్యం. ఈ నేపథ్యంలో కార్మిక కథలొచ్చాయి.

**కార్మిక కథలు :**

**బండికింది బతుకులు (అల్లంరాజయ్య, రఘోత్తమరెడ్డి) :** వీరిద్దరు కయితికాల పోశెట్టి పేరుతో ఈ కథలను రాశారు. 'గుక్క తిరక్కుండా చెప్పిన మాట చెప్పకుండా చిత్రమైన విషయాల్ని చెప్పుకొచ్చే వాడిని తెలంగాణా మాండలిక భాషలో కయితికాల మనిషి' అంటారు. సింగరేణి కథలు (కార్మిక), కోల్ బెల్ట్ కథలు (మూట శంకర్), ఆరు కార్మిక కథలు (పులుగు శ్రీనివాస్), నల్లకలువలు (సంకలనం), బొగ్గుపొరల్లో (సంకలనం) సింగరేణి కార్మిక లోకాన్నంతా స్వగతాలుగా మన కళ్ళ ముందుంచిన కాలం కథలివి.

'నల్లవజ్రం, బొగ్గుపొరల్లో, నీళ్ళతగువు, ఇల్లు, పురుడు, పెండ్లి, పట్టు, వాల్‌పోస్టర్, శత్రువు' కథలు – గోదావరి ఖని బొగ్గు గనుల కార్మికుల జీవితాలను ఇతివృత్తంగా తీసుకుని చిత్రించిన కథలు. తెలంగాణ కల్లోలిత ప్రాంతాలలో పరస్పరం జరుగుతున్న హరణోద్యమానికి నిలువెత్తు ప్రతీక 'జాడ' కథ. కాలువ మల్లయ్య గారు రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో పనిచేయడం వల్ల సింగరేణి, యన్.టి.పి.సి., యఫ్.సి.ఐ. తదితర కార్మికుల జీవితాన్ని, ఆ జీవితాల్లోని కష్టసుఖాలు, లోతుపాతులు ప్రత్యక్షంగా చూడగలిగారు. కార్మికులతో ఉన్న అనుబంధం కాలువ మల్లయ్య గారిని వాస్తవికంగా కార్మిక జీవనాన్ని చిత్రించేటట్లు చేసింది. వ్యవసాయంతో పూటగడవక, జీవితంలో ఎదుగుదల లేక ఇబ్బందుల పాలైన సన్నకారురైతులు, కూలీలు సింగరేణి బొగ్గుగనుల్ని ప్రత్యామ్నాయ జీవనాధారంగా ఎంచుకున్నారు. పల్లెల్లోని ఆత్మీయతను, ప్రేమను, పల్లె సంస్కృతిని తమతో మోసుకవచ్చి బస్తీలుగా నివాసాలు ఏర్పరచుకున్నారు. పారిశ్రామికీకరణలో గ్రామీణులు భాగస్వామ్యులైనప్పటికీ బతుకు దుర్భరమే అయ్యిందని తెలిపే కథ 'ప్రస్థానం'. పల్లెలు వదలి గని కార్మికులుగా స్థిర పడ్డాక పీల్చుకోవడానికి స్వచ్ఛమైన గాలి కూడా కరువైంది. రోజురోజుకు ఆరోగ్యాలు దిగజారడంతో అప్పులు పెరుగుతూ వచ్చాయి. ఎప్పుడు ప్రాణాలు పోతాయో తెలియని ప్రమాదకరమైన ఉద్యోగంతో సతమతమయ్యే కార్మిక జీవన ప్రస్థాన కథలో చిత్రితమయ్యింది. 'అన్న' కథ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో కార్మికుల కోసం జీవితాన్ని అంకితం చేసిన కార్మిక నాయకుడికి సంబంధించింది. ఈ కథలో రాజమల్లు ఇరవై ఏళ్ళుగా గని కార్మికునిగా జీవితాన్ని గడుపుతున్న వ్యక్తి. ఆయన పల్లెలో పుట్టి పెరిగి దొరల దోపిడికి గురయ్యాడు. జీవితాన్ని గెలుచుకుందామని సింగరేణిలో చేరితే, ఇక్కడకూడా అధికార్ల రూపంలో దొరతనం సాగుతుందని గ్రహిస్తాడు. అధికార్లు, ప్రభుత్వ యాజమాన్య విధానాలు కార్మికుల్ని అణచివేస్తూ దోపిడి చేయడం గమనిస్తాడు. కార్మికుల పక్షాన నిలిచి అధికార్ల అవినీతిని, యాజమాన్య కుటిల విధానాల్ని ప్రశ్నించే శక్తిగా ఎదుగుతాడు. కార్మిక వర్గ పోరాట ప్రతినిధియై నిలుస్తాడు. కార్మికుల హృదయాలలో 'అన్న'గా సుస్థిరస్థానం సంపాదించుకుంటాడు. విప్లవోద్యమాలు కార్మికరంగ సమస్యల పరిష్కార దిశగా దృష్టి నిలపడంతో సి.కా.స. వంటి తీవ్రవాద భావజాల సంస్థలు వెలిసాయి. ప్రభుత్వం ఇట్లాంటి సంస్థలను నిషేధిస్తూ అణచి వేస్తున్న క్రమంలో కార్మిక నాయకుల్ని టార్గెట్‌గా చేసుకుని ఎన్‌కౌంటర్లకు పాల్పడు తున్నట్లు ఈ కథ వల్ల తెలుస్తుంది. 'మళ్ళీ తల్లి ఒడిలోకి' కథ. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ మూతబడపోతుందనే సంకేతాలు అందిన సమయంలో వచ్చిన కథ. ఫ్యాక్టరీ మూత బడితే జీవనాధారం లేక భార్య పిల్లలను ఎట్లా పోషించాలనే సంఘర్షణ కార్మికులలో కల్గింది. ఇంత వరకు ఉద్యోగజీవితాన్ని అనుభవిస్తూ పల్లెల్లో ఉంటున్న రక్త సంబంధీకుల్ని, బంధువుల్ని లక్ష్య పెట్టకపోవడం, అయినా కష్టకాలంలో వాళ్ళే ఆత్మస్థైర్యం నింపి పల్లెల్లో తమతో బ్రతకడానికి ఆహ్వానించడం, పల్లెవాసుల ఆత్మీయత ఈ కథలో స్పష్టమవుతుంది.

'ఉరితాడు' కథ ఈ పరిస్థితుల నేపథ్యంలో వచ్చిన కథ. ఫ్యాక్టరీ మూతబడితే బతుకే దుర్భరమవుతుందన్న భయంతో, ఆత్మస్థైర్యం కోల్పోయిన కార్మికులు ఆత్మహత్యయే పరిష్కారంగా ఎంచుకున్న పరిస్తితులను విశ్లేషిస్తుంది. రాజవీరు అనే ఫ్యాక్టరీ కార్మికుడు బతుకు భయంతో ఉరివేసుకుంటాడు. ఇట్లాంటి కార్మికుల వెతలు, జీవన సమస్యలు, ఫ్యాక్టరీ మూతబడటానికి దారితీసిన పరిస్థితులు ఈ కథలో చర్చకు వస్తాయి. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న దినసరి కూలీల బతుకుల్లోని వ్యథను 'అడ్డ' కథ ఆవిష్కరిస్తుంది. గ్రామాల్లో పోరాటాల ఉధృతి వల్ల పాలేర్ల జీతాలు, కూలీరేట్లు కొంత వరకు పెరిగినప్పటికీ వ్యవసాయరంగంలోని ప్రచ్ఛన్న నిరుద్యోగిత పల్లెల్లోని కూలీలను, సన్నకారురైతులను పని వెతుక్కునే దిశగా పట్నం బాట పట్టించింది. 'లేబర్ అడ్డ' ఈ కథకు వేదికయ్యింది. దళిత బహుజన కుటుంబాల నుంచి పొట్ట చేతబట్టుకొని చుట్టూ పది కిలోమీటర్ల నుండి వచ్చే వారిది ఒక్కొక్క వ్యథ. ఆడ, మగ అన్న భేదం లేకుండా అన్ని వయస్సుల వాళ్ళు పని వెతుక్కునే అడ్డ అది. పండుముదుసలి, పచ్చిబాలెంత, ముక్కు పచ్చలారని పిల్లలు వాళ్ళ జీవితాల వెనుక ఉన్న వెతలు, పల్లె నుండి వలస బాట పట్టడానికి గల కారణాల్ని రచయిత వాస్తవిక సామాజిక దృక్కోణం నుంచి చిత్రించారు.

పోరాడే ప్రజల నుంచే కథా సాహిత్యం వచ్చింది. **'ఈ పోరాట కథా సాహిత్యం రూపంలో, వస్తువులో, భాషలో బూర్జువా, పెటీబూర్జువా సాహిత్యానికి పూర్తి భిన్నంగా ఉందని'** రాజయ్యనే స్వయంగా రాశారు. కార్మికుల జీవితాలను, శత్రు ఎత్తుగడలను, సామాజిక జీవితాన్ని సమ్మెలో పోరాట రూపాలను కార్మికులందరికి తెలియచేయాలనే లక్ష్యంతో అల్లం రాజయ్య రాసిన పెద్ద కథ 'సమ్మె'

(1981) 'ఆరంభం'లో గనిలో దెబ్బతగిలిన కార్మికుని గాయం మానకముందే డాక్టర్ ఫిట్ సర్టిఫికేట్ ఇచ్చి పనిలోకి పంపుతాడు. కార్మికుడు గాయం మానలేదని, పనిచేయలేనని యజమాన్యానికి గుర్తింపు సంఘాలకు (ఏఐటియుసి, ఐఎన్‌టియుసి) మొరపెట్టు కుంటారు. ఎవరు పట్టించుకోరు. చివరికి తోటి కార్మికులు అతనికి జరిగిన అన్యాయానికి నిరసనగా రెండు రోజులు బంద్ పాటిస్తారు. బంద్ చేసినందుకు యాజమాన్యం 8 హాజర్లు కోతపెడుతుంది. దీనికి నిరసనగా సమ్మె ప్రారంభమవుతుంది. కథ చదువుతున్నప్పుడు మధ్యలో రిపోర్టు రాసినట్లు ఉంది. ఉద్యమ అవసరాల కోసం కొన్ని విషయాలు అవసరమనుకున్నప్పుడు, సమ్మె కథను నవలగా రాసి ఉంటే బాగుండేది. పోరాటంలో సామాన్యమైన మనుషులే అసామాన్య నాయకులుగా ఎలా మారగలరో రాజయ్య 'అతడు' (1995) కథ ద్వారా చూపించాడు.

## సాధన పంచకమ్

**వేదో నిత్య మధీయతాం తదుదితం కర్మ స్వనుష్ఠీయతాం**
**తేనే శస్య విధీయతా మపచితిః కామ్యే మతిస్త్యజ్యతామ్**
**పాపౌఘః పరిధూయతాం భవసుఖే దోషోऽను సంధీయతాం**
**ఆత్మేచ్ఛా వ్యవసీయతాం నిజగృహాత్తూర్ణం వినిర్గమ్యతామ్**

**3. కామ్యే మతి స్త్యజ్యతామ్ –**

కామ్య కర్మలను మనస్సునుండి త్యజించాలి. కామ్యం, కామం కామన అంటే కోరిక అని అర్థం. కోరికలు ఉండటం సహజం. కాని, మితిమీరిన కోరికలు, వెర్రి కోరికలు ఉండటం ప్రమాదం. పతనానికి కారణం. కోరిక లేకుండా మనిషి క్షణమైనా ఉండలేడు. మనిషిలోని సుఖాభిలాషయే కోరిక పుట్టుకకు కారణం. అనుక్షణం కోరికలతో పరుగెత్తుతూ ఉండడం మనస్సుకు సహజం. ఆ పని చేసి దానిని పొందాలి. ఈ పనిచేసి దీనిని వదిలించుకోవాలి అనేటువంటి విభిన్నమైన ఆలోచనలు మనస్సులో నిరంతరం తరంగాల వలె వస్తూ పోతూ ఉంటాయి. వీటినే కామ్యకర్మలు అంటారు.

భద్రత కొరకు చేసే కర్మలు – ధర్మార్థ కామ మోక్షములు అనెడు చతుర్విధ పురుషార్థాలలో – అర్థమనే పురుషార్థానికి – కామమనెడు పురుషార్థానికి సంబంధించినవి. అయితే సుఖ సౌఖ్యాల కోసం చేసే కర్మలు – కామమనెడు పురుషార్థానికి సంబంధించినవి అని తెలుసుకోవాలి. తనకు ఒక ఇల్లు కావాలి అని కోరుకోవడం అర్థం కాని ఆ ఇల్లు చాలా అందంగా ఉండాలి. ఆకర్షణీయంగా ఉండాలి అని అనుకోవడం కామం. ఇట్లే వస్తువులు, వస్త్రాలు, సమకూర్చుకోవడం అర్థం. కాని, రుచులు, అభిరుచులు కలిగి ఉండడం కామం. వాస్తవానికి లోకంలో సుఖమనే వస్తువే లేదు. అయినా మనం వస్తువులను కావాలని కోరుకుంటూనే ఉన్నాం. వాటిని కేవలం సుఖమునకు కారణమని మన తలంపు. కాని అవియే సుఖమని మాత్రం కాదు. ఒకవేళ వస్తువే సుఖమైతే, అందులోనే సుఖమంటూ ఉంటే ఆ వస్తువు అందరికీ, అంతటా, అన్నివేళలా సుఖాన్ని ఇవ్వగలగాలి. కాని మనకు కలిగే అనుభవం ఇందుకు భిన్నంగా ఉన్నది. ఎందుకంటే ఒకరికి సుఖాన్ని ఇచ్చే వస్తువు వేరొకరికి సుఖాన్ని ఇవ్వలేకపోవడమే కాక, దుఃఖాన్ని కలిగిస్తున్నది. కావున ఏ వస్తువును కూడా ఇది సుఖము లేదా దీని స్వరూపము సుఖము అని నిర్ణయించుటకు అవకాశమే లేదు. ఒక కారణం వలన లేదా ఒక నిమిత్తం వలన కలగిన సుఖాలను నైమిత్తిక సుఖాలు అంటారు. ఈ ప్రపంచంలో ఉండేవన్నీ నైమిత్తిక సుఖాలే కాని పూర్ణ సుఖాలు కావు అని తెలియాలి.

కామ్య కర్మల వల్ల మనిషి అనేక పాపాలు చేస్తూ ఉన్నాడు. "రజోగుణము నుండి పుట్టినదే కామము. తీరనప్పుడు ఇదియే క్రోధ రూపము దాల్చును. ఇది గొప్ప తిండిపోతు. భోగానుభవముతో ఇది తృప్తి చెందేది కాదు. పైగా అంతులేని పాపాలు చేయించుటకు ఇదియే ముఖ్య ప్రేరకము అని తెలుసుకో. అంతేకాదు నీకు బద్ధశత్రువు నీ కోరికలే అని గమనించుము (3–37) అని తెల్పుతూ చివరగా – ఓ మహాబాహూ! బుద్ధిద్వారా మనస్సును వశపరచుకొని జయింపలేని గొప్ప శత్రువైన కామమును నిర్మూలింపుము. "జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్" (3–43) అని ఎంతో చక్కగా ఉపదేశించింది భగవద్గీత. అందుకే మనస్సులోనుండి కామ్య కర్మలకు సంబంధించిన ఆలోచనలను ప్రయత్న పూర్వకంగా తొలగించుకోవాలి. పాపాలకు, పాపకర్మలకు దూరంగా ఉండాలి సుమా! అని హితవు చెపుతుంది సాధన పంచకమ్...

# మూసీ పదవినోదం - 27

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 3 లా | | గు | 7 | 9 లు | X | 2 |
| 4 కా | | ను | X | 10 వ | | 11 హ | |
| 5 | చీ | X | X | | యి | | మం |
| 6 చి | | ట్నా | X | ము | X | | తు |
| X | 8 దు | | 18 చు | X | 12 | శ | |
| 13 | X | 14 క | | 19 గు | X | | స్వా |
| 15 ధా | | X | 20 ము | | X | ము | |
| 16 | 17 కా | | X | 21 ము | | లు | X |

**ఆధారాలు (అడ్డం)**

1. జయశంకర్ భూపాలపల్లిలోని పాండవుల గుట్టకు చేరువలో... బొర్రా గుహలను మరిపించేలా ఉన్న గుహలు (6)
4. స్థిరముగ నిలుచు (3)
5. చిన్న గోనె (2)
6. ఉర్దూలో కౌగిలించుకోవటం (3)
8. దుల్ల చేయు, వదిలించు, పతనము చేయు (3)
10. మేఘాన్ని చెప్పే వలాహక శబ్దంలో చివరి అక్షరం సరళమయింది (4)
12. వ్యవహారమును తెలిసినవాడు, నిపుణుడు (3)
14. బియ్యము కడిగిన నీళ్లు (3)
15. వాన నీళ్లు, వర్షపు నీరు (2)
16. సజాతీయ ప్రాణుల సమూహమే కాదు ఈ పదానికి పరమాత్మ అని కూడా అర్థం (3)
20. చందర్ గొప్ప భూస్వామి బిడ్డడు. ఎప్పుడూ చేతి --- డబ్బు ఆడుతూ ఉండేది. అని గురజాడ అప్పారావుగారు కథలో ఈ మూడు అక్షరాల కళింగాంధ్ర మాండలికం వాడారు. చివరి అఠరం ఈ భాషా ప్రపంచంలో పారిపోయింది (2)

**ఆధారాలు (నిలువు)**

1. కె.ఎన్.వై. పతంజలి తన దిక్కుమాలిన కాలేజీ కథలలో పాల్తిన్ కవరుకు పెట్టిన పేరు (4)
2. గొల్లగట్టు జాతరలో శివుని పేరు (7)
3. మోసగించుటకు అంగీకరించు (5)
7. అందము (4)
9. అడవి గేదె (3)
11. నేతి భోజనములు (7)
13. ప్రగ్గడకు ప్రకృతి పదం. ప్రస్తుతం మోదీగారు ఈ పదవిలో ఉన్నారు (3)
14. నల్గొండ ప్రాంతంలో కిందా మీదయిన ఈ పదానికి మెట్లు అని అర్థం. నెల్లూరు ప్రాంతంలో నిషేక ముమూర్తము అని అర్థం (3)
17. మంచుతో కప్పబడిన పర్వతము తిరగబడింది (2)
18. తెలుగు కుమార సంభవ కావ్యంలో పారవశ్యము అను అర్థంలో పదాన్ని వాడారు. తలకిందులయితే ముడుచుకుపోతుంది(3)
19. దాసుడు, దాసురాలు (3)

**(సమాధానాలు ఈ సంచికలోనే మరో పేజీలో....)**


**నిర్వహణ**

**డా. తాడేపల్లి పతంజలి**

**ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట.**

**ఫోన్ : 98666 91587**

## సత్సంగం



### కర్మను దాటే ప్రయత్నం?

కొన్ని సిద్ధాంతాల ప్రకారం పూర్వజన్మలలోని కర్మలు తప్ప భగవంతుడంటూ ఎవరూ లేరు. శాస్త్రాల ననుసరించి, ఈ జన్మలో చేసిన కర్మను పురుషకార్యమంటారు (మానవ ప్రయత్నం), పూర్వజన్మలోని కర్మలూ, ప్రస్తుత కర్మలూ పొట్టేళ్ళవలె ఢీకొంటాయనీ, వాటిలో బలహీనమైనది మాసిపోతుందనీ అంటారు. అందువల్లే, ఈ సిద్ధాంతాన్ని నమ్మేవారు పురుషకార్యాన్ని బలపరచాలంటారు. వాళ్ళని అసలు కర్మకి మూలమేమిటని అడిగితే, "చెట్టుముందా, విత్తుముందా" అని అడగటం వంటిదే అదీను. నిష్ప్రయోజనమని అంటారు.


ఇట్లాంటి వాదనలేవీ అంతిమ సత్యాన్ని కనుగొనలేవు. అందువల్లనే ఆరంభంలోనే, నీవెవరివో తెలుసు కొమ్మని చెప్పాను. "ఎవరిని నేను. ఈ జన్మదోషం నాకెట్లా కలిగింది" అని ప్రశ్నించుకుంటే అహంకారం సమసి పోతుంది. ఆత్మసాక్షాత్కార మవుతుంది. ఈ విచారణని సరిగ్గా చేస్తే "దోష" మనే భావం పోతుంది. శాంతం కలుగుతుంది. కలగటమేమిటి? తానుగా ఆత్మ ఉంటుంది.

"కర్తగా, కర్మలనాచరించే నేనెవరిని" అని విచారణ చేసికొని, తన గురించిన యథార్థాన్ని తెలుసుకోవాలి. కర్మయొక్క సారాంశమిదే. విచారణ వల్ల కర్మలని ఆచరించే అహంకారాన్ని ధ్వంసం చేయకపోతే, కర్మ యోగానికి ఫలితమైన పరమానందం లభించదు.

# బాలసాహితీవేత్త – కీ.శే. వాసాల నరసయ్య (స్మృత్యంజలి)


**బర్ల రవి కుమార్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉ.వి.వి. ఫోన్ : 9492 791 872

**'కలమే హలమని నమ్మి'** బాల సాహితీ క్షేత్రంలో అక్షర మొగ్గలు పూయించిన ప్రముఖులు, సుదీర్ఘకాలం పాటు బాలసాహిత్యంలో తన రచనలు చేసి బాలల మేధో వికాసానికి బాటలు వేసిన దార్శనికుడు, వృత్తి ఏదైనా ప్రవృత్తిని సాహిత్యంగా నమ్ముకుని నిరంతరం తన రచనలతో బాలసాహిత్యంలో తన పేరు చిరస్థాయిగా నిలుపుకున్నా ప్రముఖ బాల సాహితీ వేత్త **'మధురకవి'** దశాబ్దాల సాహితీ సేవకు గాను **"కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు"** అందుకున్న వారు డాక్టర్ **'వాసాల నరసయ్య'** గారు.



పూర్వపు కరీంనగర్ జిల్లా ప్రస్తుతం జగిత్యాల జిల్లా 'చౌల మద్ది' అనే గ్రామంలో 1942 జనవరి 26న లక్ష్మమ్మ వెంకటయ్య దంపతులకు జన్మించిన వాసాల నర్సయ్య పాఠశాల దశనుంచి వీరి రచన కౌశలాలు దిద్దుకున్నాయి. వీరి నాన్నగారు మరియు అన్నయ్య వీధి నాటకాలు ఆడేవారు. అలా వీరికి నాటకాల పై ఆసక్తి పెరిగింది వారి ప్రోత్సాహంతోనే పాఠశాల స్థాయిలోనే 1958 సౌగంధికాప హరణం పౌరాణిక నాటకం రచించారు అలా అలా తర్వాత పాఠశాలలో స్కూల్ మ్యాగజైన్లకు సంపాదకత్వం వహించారు ఆ తర్వాత గేయాలు కవితలు వ్యాసాలు గ్రంథ సమీక్షలు రచించారు **కర్షకుడా కార్మికుడా!** అనే తొలి గేయ సంపుటిని 1978 సంవత్సరంలో ముద్రించి సాహితీ ప్రపంచానికి పరిచయమయ్యాను.

మొదట ఒక సంవత్సరం ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించినా తర్వాత పోస్ట్ మాస్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే సాహిత్య సేవను నిరంతరం కొనసాగించారు. వీరి కలం నుండి ఇప్పటివరకు 36 పుస్తకాలు వెలువడినాయి. అందులో 25 పుస్తకాలు బాలసాహిత్యానికి సంబంధించినవి. 1978 తర్వాత మిత్రుడు ఆప్తుడు అయిన 'టి. వేదాంత సూరి' గారి ప్రేరణతో బాలసాహిత్యంలోకి అడుగులు వేసిన వీరు కవితలు, బాలగేయాలు, పొడుపు కథలు, అనువాదాలు, వ్యాసాలు, వచన కవితా సంపుటాలు మొదలగు వివిధ ప్రక్రియలలో రచనలు చేశారు. అలాగే 'ఆకాశవాణిలో' వీరి కవితలు ప్రసారమయ్యాయి. ఇతని రచనలు జోక్స్ లు కూడా వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి. తపాల శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన వీరు తపాల ఐ.డి ఉద్యోగుల (రూల్స్) తపాలా చార్జీలు, తపాలా ప్రపంచం, సర్కిల్ పిన్ కోడ్ వంటి రచనలు కూడా చేశారు.




బాలల మేధోవికాసానికి వారికి అర్థమయ్యే స్థాయిలో రచనలు చేయడం వీరి నైజం. వీరికి తొలి పురస్కారం 1984 లో **'రంగారెడ్డి**

**జిల్లా సాహితీ సమితి కథా పురస్కారం'.** వీరు ఇప్పటివరకు 16 పైగా సాహితీ పురస్కారాలు అందుకున్నారు. అందులో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు 2009 సంవత్సరంలో రాష్ట్రస్థాయి బాల సాహిత్య పురస్కారం **"చిట్టిపొట్టి కథలు"** అనే పుస్తకానికి రావడం ఎంతో అదృష్టంగా భావిస్తారు. అలా తనకు వచ్చిన నగదు బహుమతితో బాలసాహిత్యంలో కృషి చేస్తున్న వివిధ ప్రముఖ కవులకు మరియు నవతరం కవులను ప్రోత్సహించేందుకు అదే సంవత్సరం 2009 నుండి **"వాసాల నరసయ్య బాలసాహిత్య పురస్కారం"** ప్రారంభించారు.

తన పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతి సంవత్సరం 'జనవరి 26' న ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు. తొలి పురస్కారాన్ని టి.వేదాంత సూరి గారికి అందించారు. వీరి ప్రోత్సాహంతోనే బాల సాహిత్యంలోకి ప్రవేశించాను అని అంటారు. **"నా ఆలోచనల ప్రవాహాన్ని బాలసాహిత్య క్షేత్రంలోనికి మరలించిన ఆత్మీయులు"** అని వారిని సంబోధించేవారు. ఇంకా "చిట్టిపొట్టి కథలు" పుస్తకం టి. వేదాంత సూరి గారికి అంకితం ఇచ్చారు. ఇలా ఇవ్వడం కూడా సాహిత్యపరంగా ఎంతో సంతృప్తిని ఇచ్చిన సంఘటన అని అనేవారు. ఇలా ఇప్పటివరకు దాదాపు 12 మందికి ఈ పురస్కారాన్ని ప్రదానం చేయడం జరిగింది. ఇంకా మరెన్నో ఇతర సంస్థలతో వీరికి సాహిత్య అనుబంధం ఉంది. అనేక సాహితీ పురస్కారాలు పొందిన వీరి రచనలు అన్ని బాల సాహిత్య పత్రికల్లో ప్రచురితమయ్యాయి అంటే అతిశయోక్తి కాదు. ఉద్యోగ విరమణ తర్వాత శేషజీవితాన్ని పూర్తిగా బాలసాహిత్యానికి అంకితం చేసిన మహానుభావులు వీరు. వీరి దశాబ్దాల సాహితీ కృషి మెచ్చుకొని కేంద్ర సాహిత్య అకాడమీ 2017 లో కేంద్రసాహిత్య పురస్కారాన్ని ప్రకటించింది ఇంతటి పురస్కారానికి తనను గుర్తించినందుకు కేంద్ర ప్రభుత్వానికి వారి కుటుంబం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


తన పదవీ విరమణ తరువాత తపాలా బిళ్ళల సేకరణ (ఫిలటలి) లో పిల్లలను ప్రోత్సహించడం. వివిధ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు బాల సాహిత్య పుస్తకాలు పంపిణీ చేయడం. బాల సాహిత్యం వర్క్‌షాప్ లు నిర్వహిస్తూ నిరంతరం సాహిత్య అధ్యయనం చేస్తూ ఉండేవారు. 2021 ఫిబ్రవరి 14వ తేదీన వీరు పరమపదించడం సాహితి లోకానికి తీరనిలోటు. బాల సాహిత్యంలో అపూర్వమైన కృషి చేసిన ఈ చిరకాల సాహితీ మూర్తికి సాహితీలోకం పక్షాన, మూసీ పత్రిక పక్షాన ఇదే అశ్రునివాళి.

# భాషలందు మాతృభాష లెస్స

అమ్మబడి నుండి ఉగ్గుపాలతో
ఒడిసిపట్టేదీ మాతృభాష

అక్షర విరులు పద పరిమళాలు
మాతృభాష గుభాళించేది
సంస్కృతికి రూపం మాతృభాష

మనసులను వికసింపచేసేది మాతృభాష
మాతృభాష లేని మనిషే లేడు మనుగడే లేదు
ప్రాంతాలేవైనా భాష పరిమళిస్తే
అనుబంధాలు బలపడుతాయి
తల్లినోటి నుండి వచ్చిన భాషనే
మాతృభాషగా స్వీకరిస్తాం, ఆదరిస్తాం
మాతృభాష మరిస్తే
అమ్మ అనే పదం అంతరించిపోవడమే
మాతృభాష దినోత్సవ సంబరాలతో సరిపోదు
మాతృభాష అమలుకు నోచుకున్నప్పుడే అభివృద్ధి
ఇపుడు ప్రపంచీకరణ
మాతృభాషను మింగేస్తుంది
మాతృభాషను అరకొరగా నేరిస్తే చాలదు
మాధ్యమంగా వినియోగిస్తే జీవితాన్నిస్తుంది
అందుకే భాషలందు మాతృభాష లెస్స




**ఎం.డి. ఖాజా మైనుద్దీన్**
మహబూబ్‌నగర్, ఫోన్ : 9396626276

కె. విశ్వనాథ్ చలన చిత్రాలు -
సామాజిక అవలోకనం - 11

# నేరము – శిక్ష

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254

**"కె.విశ్వనాథ్ చలనచిత్రాలు – సామాజిక అవలోకనం"** నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం "నేరము – శిక్ష". ఈచిత్రం 1973 జూలై 18 న విడుదలైంది. కృష్ణ కథానాయకుడిగా తెరకెక్కించబడిన ఈ చిత్రం నిడివి దాదాపు 3గంటలు. చిత్ర కథ, కథనం చిత్రం చూస్తున్నంత సమయం చాలా విషయాలను సృజిస్తుంది. నిజానికి మన చుట్టూ వుండే సమాజంలో అక్కడక్కడా ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతుండడాన్ని మనం చూస్తూనే వుంటాం. సరిగ్గా అలాంటి అంశాలతో కూడిన కథనే చిత్రంగా రూపొందించినప్పుడు ప్రేక్షకుడు చిత్రంలోని భావోద్వేగాలను పూర్తిగా అనుభూతి చెందుతాడు అనడానికి మంచి ఉదాహరణగా వుంటుంది ఈ చిత్రం.



చిత్ర కథలోకి వెళితే రాజశేఖరం(కాంతారావు) – శాంతాదేవి (పండరీ దేవి) దంపతులు అత్యంత ధనవంతులు. పెద్ద వ్యాపారాలతో పాటు సమాజంలో మంచి పేరు. దానికి తోడు అత్యున్నత స్థాయి వ్యక్తిత్వం కల్గిన వ్యక్తి రాజశేఖరం. వీరి ఒక్కగానొక్క కుమారుడు విజయ్(కృష్ణ). విజయ్ ఆస్తి, అంతస్తుల్లో పుట్టి పెరగడం చేత మనుషులంటే లెక్కలేనితనం, జల్సాలు, డబ్బుతో ఏదైనా చేయగలం, అన్నింటికీ మించి స్నేహం పేరుతో ఎంత డబ్బునైనా దుబారాగా ఖర్చుపెట్టే లక్షణాలు గల వ్యక్తి. విజయ్‌కి స్నేహితుడిగా అతడి నాన్నకు దగ్గరగా బుద్ధిమంతుడైన అబ్బాయిగా చెలామణి అయ్యేవాడు సత్యమూర్తి (సత్యనారాయణ). సత్యమూర్తి పూర్తిగా జిత్తులమారి నక్క స్వభావం కల్గిన వ్యక్తి. ఒకరోజు రాజశేఖరం భార్య శాంతతో ఆమె పేరుపై కొత్త వ్యాపారం మొదలుపెట్టబోతున్నట్లు చెప్తాడు. ఆ వ్యాపారంలో తన చిన్ననాటి స్నేహితుడైన నారాయణరావు భాగస్వామి ఆని చెప్తాడు. కాని తన కుమారుడు విజయ్ బాధ్యతారాహిత్యమైన ప్రవర్తన కారణంగా తాను మరో కుమారుడిగా భావించే సత్యమూర్తిని వ్యాపార నిమిత్తం నారాయణరావు వద్దకు పంపుతాడు. అక్కడకు వెళ్ళిన సత్యమూర్తి మేనేజర్‌గా నియమించబడి, ఆ వ్యాపారం నిర్వహించడంలో కీలకంగా వ్యవహరించే నారాయణరావు కూతురు సుజాత(భారతి)ను వివాహం చేసుకుని ఆమె ఆస్తిని కాజేయాలని పథకం వేస్తాడు.

రాజశేఖరం వద్ద డ్రైవర్ గా పనిచేసే వ్యక్తి గోపాలం. గోపాలంను డ్రైవర్ అనే చులకనతో విజయ్ ఇంట్లో వున్న కార్ల విషయంలో ప్రతి చిన్న విషయానికి నోరు పడేసుకోవడం దానికి గాను తల్లి శాంతాదేవి కల్గజేసుకుని గోపాలం మనసు చిన్నబుచ్చుకోకుండా ఆమె మంచితనంతో కొడుకు ప్రవర్తనను గురించి చెప్తూ సర్దుకుపోయేలా చూస్తూ వుంటుంది. కాని కుమారుడిపై వున్న ప్రేమ కారణంగా విజయ్‌ను మాత్రం తన వైఖరి మార్చుకోమని ఏ మాత్రం హెచ్చరించదు. డ్రైవర్ గోపాలం భార్య కాంతం, సోదరి ప్రభావతీ దేవి (పి.ఆర్.వరలక్ష్మి). వదిన కాంతం, ప్రభావతితో నిత్యం రుసరుసలాడుతూ వుంటుంది. గోపాలం తన చెల్లి వివాహానికి ఒక సంబంధం వెతుకుతుంటాడు. ఆ ప్రయత్నంలో చిన్నయ్య అనే వ్యక్తి ఫోటో చెల్లికి చూపిస్తూ త్వరలో సంబంధం కుదుర్చబోతున్నట్లు చెప్తాడు. చిన్నయ్య (ఎం.బాలయ్య) తన అన్న, వదిన జానకమ్మ (కృష్ణ కుమారి) లే ప్రపంచంగా జీవిస్తూ వుంటాడు. ఒకరోజు చిన్నయ్య తన అన్నతో కలిసి ప్రభావతీ దేవిని పెళ్లి చూపులు చూడడానికి వెళ్తుండగా కౌసల్యపురం వద్ద రోడ్డుపై ఒక కారు తన అన్నయ్యను, తనను ఢీకొని వెళ్తుంది. దానితో చిన్నయ్య అన్న మరణిస్తాడు. చిన్నయ్యకు చూపు పోతుంది. ఇక ఆ ఢీకొన్న కారు మరెవరిదో కాదు సరదాలు, జల్సాలు తప్ప మనుషుల విలువ లెక్కపెట్టని విజయ్‌ది. కారు ప్రమాదం గూర్చి తెలిసి పోలీసులు విచారణ నిమిత్తం విజయ్ ఇంటికి వెళతారు. జరిగిన సంఘటన గురించి తెలుసుకున్న శాంతాదేవి తన కుమారుడిపై వున్న ప్రేమతో తను అరెస్టు అవ్వబోతున్నాడు అనే విషయాన్ని తట్టుకోలేక తమ వద్ద పనిచేసే డ్రైవర్ గోపాలాన్ని ఆ ప్రమాదం చేసినట్లు అబద్ధం చెప్పమని ప్రాధేయపడుతుంది. ఒకవైపు తన చెల్లి పెళ్ళి సంబంధం తంతు వున్నా తన యజమానిపై వున్న విశ్వాసంతో ఒప్పుకుంటాడు. ఆ సంఘటన కారణంగా అటు చిన్నయ్య కుటుంబం, గోపాలం కుటుంబాలు తలక్రిందులవుతాయి. జరిగిన విషయం తెల్సిన రాజశేఖరం కుమారుడి వైఖరిని శాంతాదేవి సమర్థించడాన్ని

తప్పుబడతాడు. ఆ సమయంలో అక్కడే వున్న విజయ్‌కు తన తండ్రికి మధ్య ఆవేశంతో కూడిన వాగ్వాదం జరుగుతుంది. ఆ వాగ్వాదంలో విజయ్ పౌరుషంగా తాను ఇంటినుండి వెళ్ళిపోయి స్వంతంగా బతికి చూపిస్తాను అంటూ సవాలు విసురుతాడు.

తన సవాలుకు పర్యవసానంగా అతి తక్కువ కాలంలోనే సమాజంలో సాధారణ మనిషి కష్టాలు, వెతలు అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. ఉద్యోగం నిమిత్తం సగటు యువకుడు పడే సంఘర్షణలు ఎలాంటివో అనుభవం చెందుతాడు.

ఒకరోజు రోడ్డుపై వెళ్తున్న చిన్నయ్యను విజయ్ కారు ప్రమాదం నుండి తప్పిస్తాడు. ఆ సమయంలో విజయ్ చిన్నయ్యకు చూపులేదని అర్థం చేసుకుని మాటల్లో చిన్నయ్యకు చూపు పోవడానికి కారణం కౌసల్యపురం వద్ద తాను చేసిన కారు ప్రమాదమే అని తెలిసి నిర్ఘాంతపోతాడు. తన నిర్లక్ష్యం కారణంగా చిన్నయ్య కుటుంబం ఏ స్థాయిలో కష్టాల లోతులో కూరుకుపోయిందో అర్థం చేసుకుని తన తప్పుకు ప్రాయశ్చిత్తంగా వారి కుటుంబానికి అండగా నిలవాలను కుంటాడు. చిన్నయ్యను ఇంటి వద్ద వదలి అతడి వదిన జానకమ్మతో మాట్లాడి వెళ్తాడు. ఆ తర్వాత తరచూ చిన్నయ్య కుటుంబాన్ని కలుస్తూ వారికి ధైర్యంగా నిలుస్తాడు. కాని చుట్టూ వుండే మనుషులు భర్త లేని జానకమ్మకు, విజయ్‌కు మధ్య సంబంధాన్ని వక్రీకరిస్తూ వుండడం, జానకమ్మను తప్పుడు చూపులు చూడడం మొదలుపెట్టారు. విజయ్ ఉద్యోగం వెతికే క్రమంలో రాజశేఖరం స్నేహితుడైన నారాయణరావు ఇంట్లో వినయ్‌గా పేరు మార్చుకొని బట్లర్ గా చేరతాడు. నారాయణరావు కూతురు సుజాత వద్ద అప్పటికే మేనేజర్ గా చేరిన సత్యమూర్తి, కొంతకాలం కింద స్నేహితుడిగా ఉన్నప్పుడు విజయ్ తనకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని మరిచి గర్వంతో చులకనగా చూస్తాడు. కాని విజయ్ తన ప్రవర్తన, మాట తీరుతో సుజాత వద్ద కొంత మంచి సంబంధాన్ని ఏర్పరుచుకోగల్గుతాడు.

డ్రైవర్ గోపాలం తాను చేయని తప్పుకు శిక్ష అనుభవించే క్రమంలో జైలుకు వెళ్ళినప్పుడు ప్రభావతీ దేవిని వదిన కాంతం సూటిపోటి మాటలతో ఇంటినుండి బయటకు పంపిస్తుంది. ఒకనాడు ప్రభావతీ దేవి గుడ్డివాడైన చిన్నయ్యను అతడు రోడ్డు దాటేటప్పుడు కలుస్తుంది. ఆ తర్వాత కూడా చిన్నయ్య కుటుంబంతో సాన్నిహిత్యం గా వుంటుంది. అంతేకాక విజయ్ కూడా ప్రభావతీ దేవిని యాధృచ్ఛికంగా కలిసినప్పుడు ఆమె డ్రైవర్ గోపాలం చెల్లి అని తెలిసి తనవల్లే తనకు ఆ పరిస్థితి ఏర్పడింది అనే నిజాన్ని తెలుసుకొని ఆమెను అన్నయ్యలా చేరదీస్తాడు. స్వంత చెల్లిలా విజయ్‌కు అన్ని విషయాల్లో ప్రభావతీ దేవి చేదోడువాదోడుగా వుంటుంది.

చిన్నయ్యకు ఎలాగైనా కళ్ళు వచ్చేలా చెయ్యాలనే సంకల్పంతో వున్న విజయ్ కు విదేశాల నుండి ప్రముఖ నేత్ర వైద్యుడు వస్తున్నాడనే విషయం తెలిసి చిన్నయ్యను వెంటబెట్టుకొని వెళ్లి సంప్రదిస్తాడు. ఆ వైద్యానికి స్థాయికి మించిన డబ్బులు అవసరమవుతాయి అని తెలిసి కూడా వైద్యానికి అంగీకరిస్తాడు. కాని చిన్నయ్య మాత్రం తనకు కళ్ళు రాగానే తాను, తన కుటుంబం కష్టాల పాలు అవ్వడానికి కారణమైన ఆ మూర్ఖుడిని చంపాలనే కసిని విజయ్ ముందు వ్యక్తపరుస్తాడు. ఆ వింత సందర్భానికి విజయ్ నిస్సహాయుడిలా ఉ ండిపోతాడు. గతంలో చిన్నయ్య మరియు తన అన్నకు ప్రమాదం జరగడానికి కొంత సమయం ముందు సత్యమూర్తితో కారు ఛాలెంజ్ లో భాగంగా వేగంగా వెళ్తున్న విజయ్ కారు రేడియేటర్ వేడెక్కి ఆగిపోతుంది. అప్పుడు అటు నుండి నీళ్ళ కడవలతో వెళ్తున్న చిన్నయ్య వద్ద నుండి నీళ్ళ కడవలు లాక్కొని కారులో పోసుకొని దానికి వంద నోటు ఇచ్చి డబ్బు కావరాన్ని ప్రదర్శించి వెళ్తాడు. ఆ సందర్భంలో చిన్నయ్య విజయ్ ముఖాన్ని గుర్తుపెట్టుకుని వుంటాడు.

నారాయణరావు ఇంటికి వెళ్ళిన రాజశేఖరం దంపతులు అతడితో కుమారుడు విజయ్ ఇంట్లో నుండి వెళ్ళిపోవడం పట్ల విచారాన్ని వ్యక్తం చేస్తారు. కాని అప్పటికే విజయ్, వినయ్ పేరుతో నారాయణ రావు ఇంట్లో పనిచేస్తూ వుంటాడు. మరోవైపు విజయ్ చిన్నయ్య కుటుంబాన్ని తన కారణంగా చుట్టూ వున్నవారు అపార్థం చేసుకుంటున్నారని తెలిసి పిచ్చివాడి వేషంలో వాళ్ళ ఇంటి వద్ద వుంటూ వారికి ధైర్యంగా వుంటాడు. కాని ఆ విషయం వారికి తెలియదు అనే భ్రమలో వుంటాడు. చివరికి చిన్నయ్య కోసం చాలా కష్టాల మధ్య డబ్బులు సర్దుబాటు చేసి నేత్ర వైద్యం చేయిస్తాడు. మరోవైపు చిన్నయ్య తనకు కళ్ళు రావడానికి, తన కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు తోడుగా వుంటూ వస్తున్న విజయ్‌ను దేవుడయ్యగా భావిస్తుంటాడు. తనకు ఇన్నాళ్లు సహాయం చేసిన వ్యక్తి, తన కుటుంబ పరిస్థితి దిగజారడానికి కారణం అయిన వ్యక్తి ఒక్కడే, ఆ వ్యక్తి విజయ్‌నే అనే విషయం తెలియని చిన్నయ్య తనకు కళ్ళు రాగానే దేవుడయ్యను ముందుగా చూడాలని ఆశపడ్తాడు. అదేవిధంగా తన అన్నయ్య చావుకు కారణమైన వాడిని చంపడానికి ఉవ్విళ్ళూరుతూ వుంటాడు.

మరోవైపు సత్యమూర్తి, నారాయణ రావును తన కపట వినయంతో తన కూతురు సుజాతతో వివాహానికి ఒప్పిస్తాడు. కాని సుజాత మాత్రం తండ్రితో తాను వివాహం చేసుకోబోయేది మన ఇంట్లో పనిచేసేవాడినే, కాని అది సత్యం మాత్రం కాదు అని తెగేసి చెప్తుంది. తాను వినయ్‌ను వివాహం చేసుకోబోతున్నట్లు చెప్తుంది. ఆ సమయంలోనే రాజశేఖరం దంపతుల ద్వారా మాటల మధ్యలో విజయ్ ఫోటో చూపించడం వల్ల ఇన్నాళ్లు సుజాత వాళ్ళ ఇంట్లో వుంటున్న వినయే విజయ్ అనే విషయం అందరికీ తెలిసిపోవడంతో సంతోషిస్తారు. చిన్నయ్యకు కళ్ళు రావడంతోనే దేవుడయ్యను చూడాలని ప్రయత్నించినా వీలుకాదు. చిన్నయ్య రోడ్డుపై వెళ్ళే సమయంలో దూరంగా తన అన్నకు కారు ప్రమాదం చేసిన విజయ్ కనిపించడంతో అతడిని చంపడానికి వెంబడిస్తాడు. అదే

సమయంలో సత్యమూర్తి, బలవంతంగా సుజాతను వివాహం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. విజయ్‌ను చంపే ప్రయత్నం చేస్తున్న చిన్నయ్యను వదిన జానకమ్మ, చేసుకోబోయే భార్య అయిన ప్రభావతీ దేవి, ఆమె అన్న గోపాలంలు అడ్డగించి మీ అన్న చావుకు ఎవరు కారణం అని చంపాలనుకుంటున్నావో అతడే దేవుడయ్యి రూపంలో నీకు ఇన్నాళ్ళు కళ్ళు తెప్పించడానికి కారణం అయ్యాడు అని చెప్తారు. మన కుటుంబాలకు కష్టాల్లో తోడుగా వుంటున్నది నువ్వు చంపాలనుకుంటున్న విజయే అని చెప్పడంతో చిన్నయ్య పశ్చాత్తాపం చెందుతాడు. విజయ్ సత్యమూర్తి నుండి సుజాతను కాపాడతాడు. అందరూ కలిసిపోతారు. కాని తాను చేసిన తప్పుకు తాను శిక్ష అనుభవించాల్సిందే అని కుటుంబ సభ్యులందరితో చెప్పి చిన్నయ్యను తాను చేసిన తప్పుకు సాక్ష్యం చెప్పమని కోరుతూ తాను చేసిన నేరానికి గాను శిక్షింపబడటానికి సిద్ధమవడంతో చిత్రం పూర్తవుతుంది

**చిత్ర విశేషాలు :**

నేరము- శిక్ష చిత్రం అంతా కూడా బాధ్యతారహితమైన, మనుషులంటే ఏ మాత్రం లెక్కపెట్టని, డబ్బు మదంతో యవ్వన ప్రాయంలో విలాసాలకు అలవాటు పడిన ఒక యువకుడు చేసిన తప్పిదం వల్ల జరిగిన సంఘటన వివిధ కుటుంబాల్లో ఏ స్థాయి ప్రభావం చూపుతుంది అనే దానికి ఉదాహరణగా ఈ చిత్రం వుంటుంది. సాధారణంగా సమాజంలో జరిగే ప్రమాదాలు మనకు ఏ మాత్రం సంబంధం లేనివి కాబట్టి దాన్ని ఒక సంఘటనగా మాత్రమే చూసి వదిలేస్తాం. కాని కొన్నాళ్ళు లోతుగా పరిశీలిస్తే తప్ప ఆ సంఘటనకు అనుబంధంగా ఉత్పన్నమైన కుటుంబ సంక్షోభాలు అర్థం కావు. సరిగ్గా ప్రేక్షకుడికి ఆ దుర్భరమైన ప్రయాసలు ఎలా వుంటాయో కళ్ళకు కట్టినట్టు చూపిన చిత్రం ఇది. నిజానికి చిత్రంలో కథానాయకుడు చేసే కారు ప్రమాదం ఒక సంఘటన మాత్రమే కాని ఆ సంఘటన ను ఊతంగా చేసుకొని చాలా విషయాలను తెలిపే ప్రయత్నం చేశారు. ఆ అంశాలేవో పరిశీలిస్తే.

విజయ్ చేసిన కారు ప్రమాదం వల్ల ఒక నిండు ప్రాణం కోల్పోవడమే కాక మరో వ్యక్తి గుడ్డివాడుగా మారతాడు. ఇంటికి పెద్ద దిక్కుగా వున్న వ్యక్తి మరణం చెందడం, ఆ గృహానికి మగదిక్కుగా మిగిలిన చిన్నయ్య అంధుడిగా, అసమర్థుడిగా మారడం, అంతకుమించి వయస్సు మీరని స్త్రీ అయిన జానకమ్మ విధవరాలిగా, నిస్సహాయరాలిగా మారుతుంది. భర్తలేని జానకమ్మ దురదృష్టాన్ని ఆసరాగా చేసుకొని ఆమె అందాన్ని, శరీరాన్ని పొందడమే అదృష్టంగా వాంఛించే మగాళ్ళ వక్రబుద్ధులు ఎలా వుంటాయో కొన్ని సన్నివేశాలు స్పష్టపరుస్తాయి. ఇక మంచి మనసుతో మగ దిక్కులేని స్త్రీకి ఏ మగాడు సహాయం చేసే ప్రయత్నం చేసినా లేనిపోని అనుమానాలు, అపార్థాలతో అక్రమ సంబంధాన్ని అంటకట్టే పాడు సమాజం తీరును




దృశ్యీకరణ చేశారు. విజయ్‌పై తన తల్లికి వున్న ప్రేమ కారణంగా విజయ్ చేసిన పనికి అతన్ని పోలీసులకు అప్పజెప్పకుండా అతడిని కాపాడడం కోసం డ్రైవర్ గోపాలాన్ని జైలుకు పంపించడంతో, పెళ్ళీడుకొచ్చిన గోపాలం చెల్లి ప్రభావతీ దేవికి చిన్నయ్యతో చూసే పెళ్ళి సంబంధం ఆగిపోవడమే కాక ఆమె వదిన కాంతం మాట్లాడే ఎత్తిపొడుపు మాటలు ఆమెను ఇంటి నుండి బయటకు వెళ్ళేలా చేస్తాయి. ఎలాంటి తప్పు చెయ్యకపోయినా గోపాలం జైలుకు వెళ్ళడం దారుణమైన విషయం అయితే, యజమాని మాట పట్ల గోపాలానికి ఏ స్థాయి గౌరవం, కృతజ్ఞతా భావం వుందో గమనించవచ్చు. తను చేయని తప్పిదానికి తాను బాధ్యుడినని గోపాలం తీసుకున్న నిర్ణయం ఇతరులపై అంతటి మూర్ఖమైన గౌరవాభిమానాలు ఉండకూడదు అనే విషయాన్ని తెలుపుతుంది.

తల్లి ప్రేమ విజయ్‌ను శిక్ష నుండి తప్పించేలా చేస్తే, తండ్రికి కొడుకు పట్ల వున్న బాధ్యత విజయ్‌ను మనిషిగా మారుస్తుంది. తన తప్పును సమర్థించుకునే విషయంలో విజయ్ తండ్రితో తగువులాడి పౌరుషంగా ఇంటి నుండి బయటకు వస్తాడు. చిన్ననాటి నుండి ఐశ్వర్యవంతమైన జీవితాన్ని అనుభవించిన విజయ్ అతి తక్కువ కాలంలోనే సగటు మనిషి కష్టాలెలా వుంటాయో తెలుసుకుంటాడు. ఏదో ఒకచోట ఉద్యోగాన్ని సంపాదించడానికి ప్రయత్నాలు చేస్తున్నప్పుడు సమాజం యొక్క ముఖచిత్రం ఎలాంటిదో అర్థం చేసుకుంటాడు. ఉదాహరణకు విజయ్ ఒక ఉద్యోగం నిమిత్తం

ఇంటర్వ్యూ కు వెళ్ళినప్పుడు అక్కడ ఇంటర్వ్యూ చేసే వ్యక్తి మాటల్లో భాగంగా ''ఈ ఉద్యోగం మినిస్టర్ గారి మనిషికని ఎప్పుడో నిర్ణయమైపోయింది" అని చెప్తాడు. వెంటనే విజయ్ "అలాంటప్పుడు ఉన్నగానొక్క ఉద్యోగం కోసం అప్లికేషన్ చేసుకోమని చెప్పడం ఎందుకు సార్, అంటే డబ్బులు లాగడానికి మీ ప్రభుత్వం వేసిన పథకమేగా" అంటూ అక్కన్నుండి కోపంగా వెళ్తాడు. కష్టాల విలువను అర్థం చేసుకోవడం మొదలుపెట్టిన విజయ్ తాను చేసిన తప్పుకు బాధపడుతూ వుంటాడు. కొన్ని విచిత్ర పరిస్థితుల మధ్య ప్రభావతీ దేవి, చిన్నయ్యలను కలిసిన విజయ్ అటు చిన్నయ్య కుటుంబానికి దేవుడయ్యగా, ప్రభావతీ దేవికి అన్నలా వ్యవహరిస్తాడు. అంతేకాక చిన్నయ్య కు కష్టపడి స్వంత డబ్బులతో నేత్ర వైద్యం చేయించి కళ్ళు వచ్చేలా చేస్తాడు. అంతేకాక తన నేరానికి తాను శిక్ష అనుభవించాల్సిందే అనే నిజాయితీ గల వ్యక్తిత్వం సంపాదిస్తాడు. తల్లికి తన కుమారుడి తప్పిదాన్ని సమర్థించేంత ప్రేమ వుంటే, తండ్రికి తన కుమారుడిని తిట్టేటంతటి కోపం కొడుకును సక్రమ మార్గంలో నడిపించే బాధ్యతాయుతమైన స్పృహ కనిపిస్తుంది. ఏదేమైనా తల్లిదండ్రులు కోపం, ప్రేమ దేన్ని ప్రదర్శించినా అది పిల్లల బాగుకే అన్నది సత్యం.

ప్రత్యేకంగా మాట్లాడుకోవలసిన మరొక పాత్ర సత్యమూర్తి. పేదవాడైన సత్యమూర్తిని విజయ్ స్నేహితుడిగా చేరదీసి సకల సౌకర్యాలు అందజేసి తన ఇంట్లో స్థానం కల్పిస్తాడు. సత్యమూర్తి తన వంకర బుద్ధులతో విజయ్ తండ్రిగారైన రాజశేఖరం వద్ద బుద్ధిమంతుడిగా పేరు సంపాదిస్తాడు. నిజానికి విజయ్‌ను చాలా విషయాల్లో పనికిమాలిన పొగడ్తలతో మరింత చెడుదారులు తొక్కేందుకు కారణమవుతాడు. కారు పందెం వేసుకోవడానికి రెచ్చగొట్టేది కూడా సత్యమూర్తే. విజయ్ కారు ప్రమాదం చేసిన తర్వాత చిన్నయ్య కుటుంబానికి సహాయంగా డబ్బు అందజేయడానికి సత్యమూర్తి వెళ్తాడు. కాని చిన్నయ్య తనకు, తన కుటుంబానికి జరిగిన నష్టానికి ఆవేశపూరితంగా స్పందిస్తాడు. ఆ మాటలు విని ఆ డబ్బును తనే తీసుకొని విజయ్ వద్ద మాత్రం **"పేదవారికి ప్రాణాల కన్నా డబ్బే ముఖ్యం రా, డబ్బులు చూడగానే సంతోషంగా తీసుకుని సైలెంట్ అయిపోయారు"** అనే రీతిలో చెప్తాడు. అంతేకాక రాజశేఖరం సిఫారసు మేరకు నారాయణరావు ఇంట్లో ఉద్యోగం పొందిన కొన్నాళ్ళకు సుజాతను వివాహమాడి ఆస్తిని కాజేయాలని నక్క వినయాలు ప్రదర్శిస్తాడు. ఇక విజయ్ ఇంటి నుండి బయటకు వచ్చి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న సందర్భంలో నారాయణరావు ఇంటి వద్దకు వచ్చినప్పుడు స్నేహితుడు అనే ఇంగిత జ్ఞానం లేకుండా, గతంలో విజయ్ ద్వారా తాను పొందిన సౌకర్యాలు, విలాసాలు అన్నీ మరిచి విజయ్‌ను మనసు చిన్నబుచ్చుకునేట్లు మాట్లాడతాడు. సత్యమూర్తి పాత్ర ఒక మనిషిలో వుండే కుట్రలు, మాయదారి నటనలకు సంకేతంగా వుంటుంది. సత్యమూర్తి పాత్ర స్నేహం అనే మాటకు తూట్లు పొడిచే లక్షణాలతో మనుషుల మంచితనాన్ని ఆసరాగా చేసుకొని వారి బలహీనతలతో నాటకాలాడుతూ లబ్ది పొందే విధంగా వుంటుంది.

ఇక నారాయణరావు కూతురు సుజాత పాత్ర చిత్రానికి కథానాయిక అయినప్పటికీ చిత్ర కథలో వుండే సంఘర్షణల వల్ల అన్ని చిత్రాల్లో వుండే రీతిలో సాధారణ కథానాయిక పాత్రలా వుండదు. సత్యమూర్తి, సుజాత మధ్య వుండే సన్నివేశాలు ఘర్షణ పూరితమైనవిగా వారి మధ్య ఏ మాత్రం పొసగని సంబంధాన్ని


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

వ్యక్తీకరించేలా వుంటాయి. వినయ్ పేరుతో సుజాత ఇంట్లో బట్లర్‌గా చేరిన విజయ్ డబ్బు అవసరం కొద్దీ వంటమనిషిగా చేరతాడు. ఇక ఆ సందర్భంలో వుండే సన్నివేశాలన్నీ హాస్యపూరితంగా వుంటాయి. ఈ చిత్ర కథ, కథనం సాగే పంథా కొద్దీ చిత్రంలో ప్రత్యేకంగా హాస్య సన్నివేశాలు గాని, హాస్యం కోసమే వుండే పాత్రలు కాని వుండవు.

చిత్రం అంతా కూడా పూర్తిగా సహజరీతిలో సాగిపోతూ వుండడం వల్ల చిత్రంలోని పాటలు కేవలం కథానాయకుడు – కథానాయిక మధ్య వుండే పాటల శైలిలో కాకుండా సందర్భసహితంగా వివిధ పాత్రల మధ్య వుండే సంఘర్షణలను వ్యక్తపరిచే విధంగా వుంటాయి. సాలూరి రాజేశ్వరరావు గారి సంగీతం నిజానికి ఆరు పాటలను ఆరు విభిన్న రీతుల్లో వ్యక్తపరిచిందని చెప్పొచ్చు. ఒక చిన్న పాటలోని పదాల కూర్పుతో కూడిన చిన్న చరణాలు చిత్రంలో విజయ్ చేసిన తప్పిదానికి ఇతరులు ఏ విధంగా శిక్షించబడ్డారు అనే విషయాన్ని తెలియజేస్తుంది. అది **"చేసిన పాపం నీది/ చితికిన బతుకు ఇంకొకరిది/ ఒకరిదా నేరం / ఇంకొకరికా శిక్ష"** అనే పదాలు ఒకరు చేసిన నేరం కారణంగా మిగతా పాత్రలు పడే సంఘర్షణను తెలియపరుస్తాయి. కారు ప్రమాదం తర్వాత అంధుడిగా మారిన చిన్నయ్య దీనస్థితిని తెలియజేస్తూ **"కన్నులా వెలుగారిపోయే/ ఉన్న ఊతం జారిపోయే"** అంటూ సాగుతుంది.

నిర్లక్ష్యముతో కూడిన, సమాజం అంటే బాధ్యతలేని, పెద్దలు సంపాదించిన ఆస్తులతో విలాసాలకు అలవాటుపడిన యువకుడు చేసిన తప్పిదం వల్ల ఎందరి జీవితాలు అతలాకుతలం అయ్యాయి అనే విషయాన్ని దర్శకుడు చక్కగా చిత్రం రూపంలో వివరించి చూపాడు అని చెప్పొచ్చు.

**"మనిషికి మనసే సాక్షి మనిషి విధించే శిక్ష తప్పినా, మనసు వేధించే శిక్ష తప్పదు. నేరానికి శిక్ష తప్పదు."** అనే మాటలతో దర్శకుడు కె.విశ్వనాథ్ గారు పరోక్షంగా ప్రతి మనిషికి తను చేసిన తప్పొప్పులకు మన మనసే సాక్ష్యంగా వుంటుంది. ఎవ్వరికి ఏ సమాధానం చెప్పి సమర్థించుకున్నా మన మనసు ముందు దోషిగా నిలబడకూడదు అనే చక్కటి విషయాన్ని చిత్రంగా ఆవిష్కరించారు.

చిత్రం : **నేరము – శిక్ష**
తారాగణం : కృష్ణ, భారతి, కృష్ణ కుమారి, పి.ఆర్.వరలక్ష్మి, కాంతారావు, రావుగోపాలరావు, సత్యనారాయణ తదితరులు
కథ : మన్నవ బాలయ్య
సంగీతం : సాలూరి రాజేశ్వరరావు
నిర్మాత : అలపర్తి సూర్యనారాయణ, మన్నవ వెంకట్రావు
**దర్శకత్వం : కె. విశ్వనాథ్**


**STATEMENT OF OWNERSHIP & OTHER PARTICULARS ABOUT "MUSI" TELUGU MONTHLY**
**FORM IV (See Rule 8)**

| | |
|---|---|
| **1.** Place of Publication | Hyderabad |
| **2.** Periodicity of its Publication | Monthly |
| **3.** Printer's Name | **B. Ananta Laxmi** |
| a) Whether citizen of India? | Yes |
| b) if foreigner, state the country of origin | - |
| address | 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderabad-500027 |
| **4.** Publisher's Name | **B. Ananta Laxmi** |
| a) Whether citizen of India? | Yes |
| b) if foreigner, state the country of origin | |
| address | 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderabad-500027 |
| **5.** Editor's Name | **Dr. Sagi Kamalakara Sharma** |
| a) Whether citizen of India | Yes |
| b) if foreigner, state the country of origin | |
| address | 2-2-1109/BK-LIG-10, Bathukamma kunta, Bagh Amberpet, Hyderabad -500013 (Telangana) |
| **6.** Name and address of individuals who own the Newspapers and partners or share holders holding morethan one percent of the total capital. | **B. Ananta Laxmi** |

I, **B. Ananta Lakxmi,** hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

*Sd/-*
01.03.2021 **B. ANANTA LAXMI**
Publisher

# నన్నేరుక రండి!!



కొన్ని జ్ఞాపకాలను ఏరుకుందామని
ఆశగా నా దగ్గరికి వచ్చాను
జీవితంలో కొన్ని లోతులను
నీ జ్ఞాపకాలతో నింపేయాలనుకున్నాను
వెచ్చని ఒక ఉషోదయాన్ని చూపుతూ
గట్టిగా అలుముకున్నావు
మెల్లిగా నా చుట్టూ తిరుగుతూ
చల్లని ప్రేమగిలిని పంచావు
అలా పశ్చిమ కనుమల అంచుల్లోకి తీసుకెళ్లి
తనివి తీరని ఆశలెన్నో కల్పించావు
టీ తోటలపై నుండీ, నీలగిరి చెట్ల మధ్యలోంచీ లాక్కెళ్లి
జలపాతాలలో నిండా ముంచావు
వయ్యారంగా సాగే నదుల్లో
కొబ్బరిచెట్ల సందుల్లోంచి తిప్పి తిప్పి



సముద్రపు సంధ్యలో
నీ వాడిలో సేద తీర్చావు
స్వర్గానికి నిచ్చెన వేయడమెలాగో కానీ
దారులు కనుకొని నీ దగ్గరికొచ్చాను
నన్ను హత్తుకుపోయావు
ఈ నేలలోనో గాలిలోనో
నా కలల్లోనో కలతల్లోనో
ఇక్కడే మిగిలిపొమ్మని మారాం చేసావు
కొన్ని జ్ఞాపకాలను ఏరుకుందామని
ఆశగా నీ దగ్గరికి వచ్చాను
చివరికి నన్ను నేనే
నీలో కోల్పోయాను
ఆ మున్నారు కొండల్లోని మేఘాల్లోనో
టీ తోటల సందుల్లోనో
యూకలిప్టస్‌ల చాటునో
నన్ను వెతకండి
వంకలు తిరిగిన నదుల్లోనో
ఆ నదులను ముద్దాడే కొబ్బరి తోటల్లోనో
కడలి ఇసుక తిన్నెల చాటునో
నన్ను వెతకండి
అయినా కనపడకపోతే
పచ్చనిదారుల్లో దిగులుగా నడుస్తున్న
నల్లని కాటు కళ్ళ కుట్టీ మనసులోనో
కచ్చితంగా దొరుకుతాను.
మీరో ఎవరైనా అటువైపుగా వెళ్తే
ఆ ప్రకృతిలోంచి నన్నేరుకరండి
ఆ మలబారు తీరపు మత్తులోంచి
నన్ను లాక్కొనిరండి



**బొల్ల ప్రవీణ్‌కుమార్**
పరిశోధక విద్యార్థి, ఉ.వి., ఫోన్ : 9989475899

# విశ్వర్షి వాసిలి 'నేను' దీర్ఘకావ్యం - సౌందర్య దృక్పథం

**ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు,** తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం. ఫోన్ : 998 962 8049

'సౌందర్యం' అనే పదానికి నిఘంటువుల్లో 'చక్కదనం, అందం, అలంకారం' అనే అర్థాలు ఉన్నాయి. దీన్ని మనం ఇంగ్లీషులో Beauty అనీ, Aesthetic అనీ అంటుంటాం. విద్యాత్మక అధ్యయనాల్లో ఈస్తటిక్స్ అనేది సాధారణంగా కావ్యం లేదా రచనలోని వస్తువు, దాన్ని అభివ్యక్తీకరించిన విధానాల్ని చర్చించే సౌందర్య చర్చగా కొనసాగుతోంది. కానీ, నిజంగా మనిషి ఆలోచించాల్సిన సౌందర్యం భౌతికమైంది మాత్రమేకాదని 'నేను' దీర్ఘకావ్యం చదివిన వారికి అనిపిస్తుంది. నాకు కూడా అలాగే అనిపించింది. అందుకే దీన్ని **విశ్వర్షి** వాసిలిగారు '**నేను**' దీర్ఘ కావ్యంలో ఎలా అభివ్యక్తీకరించారో నాకున్న పరిమిత జ్ఞానంతో ఈ పత్రంలో వివరించే ప్రయత్నం చేస్తున్నాను.

సౌందర్యాన్ని నిర్వచించడంలో అనేక సమస్యలు ఉన్నాయి. అందుకని సౌందర్యాన్ని నిర్వచించడం కంటే దాని అనుభవించడమే సులభంగా చేయగలుగుతాం అని చాలామంది కళాతాత్వికులు అన్నారు. తెలుగులో సౌందర్యం గురించి అనేక సందర్భాల్లో మాట్లాడినటువంటి వారిలో సంజీవ్ దేవ్ ఒకరు. ఒకచోట వ్యక్తిలోని ఆనందం తన బయటి అస్తిత్వంలో గోచరించడమే సౌందర్యం అని సమాధానమిచ్చారు. ఇది మాఘమహాకవి '**శిశుపాలవధ**' కావ్యంలో


**"శనైః శనైః యన్నవతా ముపైతి**

**తదేవ రూపం రమణీయతాం"** అనే శ్లోకంలోని భావమే. మొదట రూపంగా కనిపించినా లేదా రూపాన్ని ఆధారం చేసుకున్నా, తర్వాత ఆ రూపం కంటే మానవుని మనసు నుండి ఏదైతే మెలమెల్లగా ఆనందంగా బహిర్గతమౌతుందో అదే సౌందర్యం.

పదార్థాన్ని లేదా రూపాన్ని ఆశ్రయించి ఉన్నప్పటికీ అదే సౌందర్యం కాదు, దాన్ని ఆశ్రయించుకొని ఉన్న ఒక ఆనందంగా చెప్తారు. అలాగే మానవుడిగా కనిపించే ఈ పదార్థానికి కలిగే అనుభూతులు, ఆ అనుభూతుల్లోని ఆనందం, ఆ ఆనందం సత్యం, శివం, సుందరం. దీన్ని వివరించడంలో వ్యాఖ్యాతలు సౌందర్య తత్త్వాన్ని ఒక మతానికి అంటే గట్టే ప్రయత్నం చేశారనిపిస్తుంది.

మనిషి తాను జీవించడానికి కావలసిన ప్రాథమిక అవసరాల గురించి నిరంతరం తపిస్తూ ఉంటాడు. ఆహారం దుస్తులు నివాసయోగ్యమైనటువంటి ప్రాంతం కోసం ముందుగా ప్రయత్నిస్తాడు. దీని కోసం తన చుట్టూ ఉన్న పరిసరాలని ముందుగా తనకనుకూలంగా మార్చుకున్నాడు. తాను ఆనందంగా జీవిస్తూ ఉంటాడు. ఈ ఆనందం భౌతికమైన ఆనందంగా కనిపిస్తుంది. భౌతికమైన ఆనందం మనసు కూడా హాయినిస్తుంది. అంటే ఆనందం శరీరానికి మాత్రమే సంబంధించింది కాదు. ఆనందం మనసుకు సంబంధించింది కూడా.

మనిషి తాను హాయిగా జీవిస్తున్నానని సంతోషపడుతూనే దానితోనే సంతృప్తి పడడు. తన జీవితానికి గల పరమార్థం ఏమిటి? అని కూడా ఆలోచిస్తాడు. ఇలా ఆలోచిస్తూ, జీవితాన్ని ఒక్కో మెట్టుగా ఎక్కుతూ నిజమైన సౌందర్యపుటంచులు చూడాలను కుంటాడు.




కొంతమంది భౌతిక అవసరాలతోనే జీవితానందాన్ని అనుభవిస్తూ జీవిత లక్ష్యాన్ని చేరుకుంటారు. మరికొంతమంది భౌతికమైన ఆనందంతో పాటు దీనికి మించింది ఇంకా ఏదో ఉందని ఆలోచిస్తూ, దాన్ని చేరుకోవడానికి తపిస్తుంటారు. దీన్నే మనం ఆధ్యాత్మిక సౌందర్యం అనొచ్చు. దీన్ని వివరించేదే సౌందర్య తాత్వికత.

ఇక్కడే మనిషి తనును తాను తెలుసుకుంటాడు. నేను, మనం అనే భావనల నుండి విడివడతాడు. ఈ విశ్వంతో మమేకం అవుతాడు. తన భవ బంధాలనుండి విముక్తి అవుతాడు. అందరిలో తననీ, తనలో అందరినీ చూసుకోవడం మొదలుపెడతాడు. ఈ ఆనందం వ్యక్తిగతం కాదు, వ్యక్తిగతంలా కనిపించే ఒక నిజమైన సౌందర్యం...నిరపేక్షమైన సౌందర్యం. అలాంటి సౌందర్య దృక్పథమే 'విశ్వర్షి' వాసిలి వసంతకుమార్ గారి '**నేను**' దీర్ఘకావ్యంలో నాకు కనిపించింది. దాన్ని నేను తాత్త్విక సౌందర్యం అంటున్నాను.

మానవుడు అలాంటి సౌందర్యానుభూతికి రావడానికి ఎంతో పరిణతి పొందాలి. అందుకని సౌందర్యం అంటే అర్థం ఏమిటి? అనుకుంటే అందంగా జీవించడంగా చెప్పుకుంటాం. మరి– అందం అంటే ఏమిటి? అందమంటే సత్యం. మరి – సత్యం అంటే ఏమిటి? కేవలం భౌతికంగా కనిపించేది మాత్రమేనా సత్యం? సత్యం అంతా మన కళ్ళకు గోచరిస్తుందా? సత్యమంతా మనకు అవగతమై పోతుందా? అందుకని సత్యం ఒక అన్వేషణ. సత్యం ఒక నిరంతర అన్వేషణ. ఆ అన్వేషణను మనకు అందిస్తుందనుకుంటున్నాను– ఈ **'నేను'** దీర్ఘ కావ్యం. ఈ కావ్యానికి రెండవపుట అట్టమీద ఈ లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నట్లుంది.

**"ప్రపంచంలో మనం ప్రతిబింబాలం**
**జీవితంలో నీడలా వెంటాడే ప్రత్యక్షసాక్షులం**
**బింబంలో స్పష్టంగా అగుపిస్తాం**
**కానీ హృదయం కనిపించదు**
**నీడలో రేఖామాత్రంగా ప్రతిఫలిస్తుంది**
**కానీ మనసు వినిపించదు**
**ఇలా మనకు మనమే**
**స్పష్టంగా రూపాలం... అస్పష్టంగా నీడలం**
**అయినా క్రాంతి ప్రసారణతోనే**
**రూపం అయినా...నీడ అయినా...**
**అగుపించే వ్యక్తిత్వంలో కనిపించని కోణాలు ఎన్నెన్నో!**
**వినిపించే జీవితంలో వెలికిరాని రహస్యాలు ఇంకెన్నో! "**

కొంతమంది సౌందర్యం గురించి చెప్తూ, వ్యక్తి అంతర్గతంగా ఉన్నదే బహిర్గత ప్రపంచంలో అక్షరాల రూపంలో గానీ, మాటల రూపంలో గానీ, చేతల రూపంలో గాని వ్యక్తమవుతుందంటారు.

ఈ దీర్ఘకావ్యంలో సౌందర్య దృక్పథాన్ని అవగాహన చేసుకోవడమంటే సాహిత్యంలో మనం సర్వసాధారణంగా చర్చించుకునే కళ–ప్రయోజనం గురించి చర్చించుకోవడం వంటిది కాదనుకుంటున్నాను. ఇందులో ఉన్న సౌందర్యం నిరపేక్ష మైన సౌందర్యం గురించి చర్చించుకోవడం వంటిది. విశ్వ చైతన్యాన్ని తెలుసుకోవాలనుకునే చైతన్యం గురించి చర్చించుకోవడం వంటిది.

సాహిత్యంలో సాధారణంగా చర్చించుకొనే కళ కళ కోసమా? కళ ప్రజలకోసమా ? అనే ఒక చర్చ ఉంది. నిజానికి దీన్ని కూడా మనం స్వాగతించాల్సిందే. కనీస అవసరాలు తీరని వారికి ఆధ్యాత్మిక సౌందర్యం గురించి చెప్తే వాళ్ళకు అర్థం కాదు. అక్షర జ్ఞానం కూడా లేనటువంటి వాళ్లకి సాహిత్యంలో అభివ్యక్తి నవ్యతల గురించి చెప్తే వాళ్లకు అర్థం కాదు. కాబట్టి అది కూడా అవసరమే. కానీ నేను దీర్ఘ కావ్యం ఆ స్థాయిని దాటిపోయింది. ఒక మేథోగత పాఠకుణ్ణి ఆలోచించేలా చేస్తుంది. ఆ మేథోగతపాఠకుడు దీన్ని అవగాహన చేసుకుంటే, దీని సారాంశాన్ని మళ్లీ సామాన్యులకు అందించగలుగుతాడు. శాస్త్రం చేసే పనికూడా ఇదే. సాంకేతికత సామాన్యులందరికీ అర్థం కాదు, కానీ, ఆ సాంకేతికతను ఉపయోగించి, రకరకాలుగా సామాన్యుడు ఉపయోగించుకునేలా శాస్త్రవేత్త ప్రయత్నిస్తాడు.

**నా అక్షరం**
**ఆత్మ దర్శనాల నిఘంటువు**
**సాధనారహస్యాల సర్వస్వం**
**అన్నట్టు**
**నీ ఆత్మ తలుపులు తెరిస్తేనే కదా**
**నా అక్షరం నీకు ఉపదేశామృతమయ్యేది** (పుట: 76)

ఈ వాక్యాలే చెప్తున్నాయి... పాఠకుడికి అర్థం కావాలంటే 'నేను' అనే వైయక్తిక స్థితి నుండి 'నేను లోనే నువ్వూ ఉన్నావు' అనే స్థితికి ఎదిగినప్పుడు మాత్రమే ఈ కావ్యం అర్థమవుతుంది. అందుకే దీన్ని మేథోగతపాఠకుడు కావాలన్నాను.

**"నేను**
**కోరికను**
**ఏకోరికా**
**నాదికానివాడను"** (పుట:80) అనడంలో తన అభిప్రాయాన్ని తానే ఖండించున్నట్లుండే వైరుధ్యంలా అనిపిస్తుంది.

రససిద్ధాంతంలో శాంతరసం...దాని స్థాయీ భావం 'శమం' గురించి ఇక్కడోసారి ఆలోచించాలి. నిర్వికార చిత్తవృత్తి విశేషాన్ని కదా శమం అంటారు. ఆ స్థితిలో ఏ కోరికలపట్లా ఆసక్తి లేనట్లనిపిస్తుంది. కానీ తాను అనుభవించిన జీవితంలోని సుఖ దుఃఖాలు ఇతరులు అనుభ వించడంలో తనకు నిర్వికారత ఉండదు. అది పరిణత స్థితి. ఆ స్థితిలో కోరికలు తీర్చుకోవాలని ప్రయత్నించే వారిని చూసి సంతోషిస్తాడు. మానవజీవితంలోని ఆద్యంతాల పరిణామాన్ని గుర్తిస్తేనే ఇక్కడ కవి కోరికలోని వైరుధ్యం అర్థమవుతుంది.

**"నేను**
**మనిషిని**
**వందేళ్లు జీవించాల్సిన వాడిని**
**నువ్వు వృక్షానివి**
**వందేళ్లు విస్తరించాల్సిన దానివి.**
**అయినా ఇద్దరమూ**
**వర్తమానంలో కరుగుతున్నవాళ్ళమే!"**

అని చెప్పి ఈ చరాచర జగత్తులో మనిషీ, ప్రకృతీ.. అంతా కూడా నశించి పోవాల్సిందేననే సత్యాన్ని విశదీకరిస్తూ

.....
**మిత్రమా**
**కడచూపుకు**

**నేనూ కట్టేవే నువ్వూ కట్టెవే**
**కట్టకడపటికి**
**మనది విభూతి యోగమే'** అంటారు. ఇది సత్యం. భౌతిక సత్యం. కానీ విభూతి అయినతరువాత దానితో ఉన్నటువంటి జీవశక్తి ఏమవుతుంది? అది జీవిత సత్యాన్వేషణ. (పుట: 94, 95)

**ఇది అనుభూతుల సంగమం**
**ఇందులో నేను ద్వైతాద్వైత రూపంగా కనిపిస్తాడు**
**ఒకమాతృమూర్తిలా కనిపిస్తాడు**


ఇందులో నేను ఒక పసి పిల్లాడిలా కనిపిస్తాడు. ఇందులో నేను ఆవేశం ఉరకలెత్తే ఉడుకు రక్తం గల యువకుడిలా కనిపిస్తాడు. ఇందులో నేను ఒక శ్రామికుడులా కనిపిస్తాడు.ఇందులో నేను దేనికోసం వెతుకుతున్నాడో దేనికోసం బ్రతుకుతున్నాడో తెలియని వాడిలా కనిపిస్తాడు. తెలిసి సమాజాన్ని తనకనుకూలంగా మార్చుకునే తెలివైనవాడిగా మార్చుకునే మనిషిలా కనిపిస్తాడు.

**"నేను అమ్మతనాన్ని ఆరగించిన పనితనాన్ని**
**నాన్న తనాన్ని పోషించిన పాఠ్యాంశాన్ని**
**పాఠశాలన వికసించిన జ్ఞానప్రసూనాన్ని**
**కళాశాలన ప్రభవించిన విజ్ఞాన వలయాన్ని**
**విశ్వవిద్యాలయాన శోధించిన అక్షరతత్వాన్ని"** (పుట.105) అని కవిత్వంలో ఈ భావాలన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయనిపిస్తుంది.

నిజానికి ఈ దీర్ఘ కవితా సౌందర్యం మనకు తెలియాలంటే దీనిలో అనేక సందర్భాలలో ఉపయోగించిన ఆ పారిభాషిక పదాలు, ఆ పదాలలోని మార్మికత మనకి తెలిసినప్పుడు మాత్రమే సాధ్యమవు తుంది. అందుకే ఇది కేవలం సాహిత్య గ్రంథం మాత్రమే కాదు. ఇది ఒక తత్వ శాస్త్రానికి సంబంధించిన సాహిత్య దర్శనం.ఇది ఇది మానవుడు నిరంతరం చేస్తున్న అన్వేషణకు ఒక మేధోగత వైజ్ఞానిక రచనా రూపం.ఇది ఇది విశ్వాన్ని అక్షరరూపంలో వర్ణించే ఒక మహోన్నత ప్రయత్నం. అందుకే ఒక చోట ఇలా అంటారు.

**నేను**
**ఆత్మను అక్షరం లోకి దింపుతానంటే**
**ఆత్మ అక్షయంగా కదలాడతానంది**
**అక్షర అక్షరాన్ని దున్నుకుంటూ పొమ్మంది**
**మట్టిపెళ్లలు దాగిన మనిషి కథను చూడమంది**
**కథను చరిత్రగా మలిచిన తీరు కనమంది**
**చరిత్రకెక్కని శేషభాగాన్ని చేయమంది.(పుట.133)**


నేను దీర్ఘ కావ్యం ఒక క్రైస్తవుడు చదువుకుంటే అది క్రైస్తవ దార్శనికతను వివరించే గ్రంథంగా కనిపిస్తుంది. నేను దీర్ఘ కావ్యం ఒక హిందువు చదువుకుంటే అది ఒక హిందూ జీవన దార్శనికతను చూపిస్తుంది. నేను దీర్ఘ కావ్యాన్ని ఒక బౌద్ధ సన్యాసి చదువుకుంటే ఒక బౌద్ధ దార్శనికత కనిపిస్తుంది. ఒకవేళ మనిషిగా మాట్లాడలేని




ఈ ప్రకృతి కనుక నేను దీర్ఘ కావ్యాన్ని చదువుకుంటే అది తన అస్తిత్వం గురించి చెప్తున్నదని సంతోషిస్తుంది. ఒక్క మాటలో **నేను** దీర్ఘకావ్యం ఒక ప్రాంత, కాల, కుల, మత,జాతి భేదాలు లేకుండా మనిషికీ ఈ విశ్వానికీ మధ్య గల అవినాభావ సంబంధాన్ని అన్వేషించే గొప్ప కావ్య సౌందర్యం అనుభూతిలోకి వస్తుంది.

ఈ **'నేను'** దీర్ఘ కావ్యం గురించి మాట్లాడ్డమంటే, మళ్ళీ కవిత్వమై మాట్లాడ్డమేనేమో అనిపిస్తుంది. విమర్శ రచనలోని గుణ గణాలను విశ్లేషిస్తుంది. పరిశోధన రచనలోని తత్వాన్ని అన్వేషిస్తుంది. కళాతాత్త్వికుడు సౌందర్యాన్ని ఆస్వాదిస్తాడు. ప్రతిదానిలోనూ సౌందర్యాన్ని చూస్తాడు. ప్రతిదానిలోనూ మమేకమై ఒక మహా అనుభూతికి గురవుతాడు. ఈ కావ్యం చదివిన తర్వాత నాలో విమర్శకుడు, నాలో పరిశోధకుడు కంటే, నాలో కళా తాత్త్వికుడే నన్ను జయించాడు. మనకు తెలియనిదేదో విశ్వంలో ఉన్నట్లే, పాఠకునికే తెలియనిదేదో ఈ **నేను** దీర్ఘకావ్యంలో కూడా ఉందనడమే నిజమైన సౌందర్య దృక్పథంగా భావిస్తున్నాను.

*(యోగాలయ, సికిందరాబాద్ వారు 19 .09.2020 నుండి 25.09.2020 వరకు అంతర్జాలం ద్వారా జరుగుతున్న తెలుగు సాహిత్యంలో నేను యౌగిక కావ్య సప్తపథ సమాలోచన సదస్సు'లో సమర్పించిన పత్రం)*



# పసితనం

బాల్యం మసకబారుతుంది
బాల్యం మరిగిపోతుంది
బాల్యం బందీఖానాల
కింద బలౌతుంది
బాల్యం బందెలదొడ్డిలో
బందీయై విలపిస్తుంది

లేత గులాబీ మొక్కలు
వాడిపోతున్నాయి
లేత చిగురు బుగ్గలు
మాడిపోతున్నాయి

బాల్యం ప్రత్తి తోటలో
నలిగిపోతున్నది
పసితనం
కుమ్మరి కొలిమిలో
సెగలౌతున్నది
గొర్లకాడ బర్లకాడ
చెట్టు పుట్ట గుట్టలకు
వేలాడుతుంది

బాల్యం ఇటుక బట్టీల్లో
ఇనుప కంచెల్లో
కంపు కాలువలో
ఎక్కి ఎక్కి ఏడ్చి
ఓదార్పు లేక
కండ్లల్లో నీళ్ళు
ఆవిరైపోతున్నాయి
చాయ కప్పులతో
చిరిగిన బట్టలతో
అరిగిన చెప్పులతో
చిన్నారి చిట్టి చేతులు
కాయలు కాసి
కాలిన వాసనతో
నలిగిపోతున్నాయి

ప్రభుత్వాలు మారినా
అధికారులు మారినా
బాల్యపు రాతలు మారలే
పథకాలు ఎన్ని వచ్చినా
పంచేవోడు పంచుకున్నాడు
తినోటోడు బలిసిపోతున్నాడు
గిరిజన గూడల్లో తండాల్లో
చిన్నారుల బతుకులు
ఆగమై విలవిలలాడుతున్నాయి

దొరగాని దొడ్డికాడ
దొరసాని కాళ్ళు పిసుకుడు
వాళ్ళు తిన్న గిన్నెలు కడుగుడు
ఎంగిలి మెతుకులు తినుడు
ఎన్నాళ్లు ఈ పసి బాల్యపు
చెరిగిపోని రక్తపు మరకలు
విముక్తి ఎన్నాళ్ళకు?
బాల్యం విముక్తి కావాలి
పక్షిలా విహరించాలి





**బాటసారి**


మహబూబ్‌నగర్, ఫోన్ : 9440174050

# ఆశ్రమానికి అమ్మకురా!!

అమ్మ ఎవరికైనా అమ్మేరా
ఆత్మ అంటే అమ్మేరా
ఇలలో దేవత
ఈ జగత్తుకే వెలుగిచ్చే
ఉన్నత దీపం
ఊపిరి ఉన్నంతవరకు
ఋతువులా వికసిస్తూ
ఎదలో
ఏకమయ్యేది
ఐకమత్యమని
ఒత్తి చెప్పి
ఓర్పుతో ఎదురుచూచే
ఔన్నత్యం గల
అంకిత జీవే అమ్మరా
అంతఃకరణే అమ్మరా
అమ్మను ఆశ్రమానికి అమ్మకురా






**సుగుణారెడ్డి**

కీ.శే. బి.ఎన్.శాస్త్రి

అముద్రిత సిద్ధాంత గ్రంథం

# శాసనములలో తెలుగు భాషా పరిణామము

**శస :** శ,సలు శాసనములందు తారుమారుగా వ్రాయబడినది. అవి ఈ క్రింద నుదహరింపబడుచున్నవి.

1. బ్రంహ్మలు శుఖవాసులు...S.i.i Vol x, No.748
2. అదసమశ్యాను...S.i.i Vol x, No.748
3. సెరసమశ్యాను..S.i.i Vol x, No.748
4. బ్రహ్మంల వధశేశిన...S.i.i Vol x, No.748
5. వ్రాశిన...S.i.i Vol x, No.748
6. ప్రతిష్ఠచేశి....S.i.i Vol x, No.748
7. శిహ్వాద్రి నృశిభ్యుని...S.i.i Vol x, No.748
8. కట్టడశేశి యచ్చిశెలవుయిచ్చెను...S.i.i Vol x, No.758
9. శేయించ్చిన ధమశాసనం...S.i.i Vol x, No.755
10. కట్టడ శేశిన శాసనము...S.i.i Vol x, No.758
11. నినయం శేశినారం..S.i.i Vol x, No.763
12. వెలశితివిధర లోన వినుతికెక్కి..S.i.i Vol x, No.772
14. యదంత్తా శేశినవారు...S.i.i Vol x, No.780

**నణ :** గోలకొండ నవాబుల శాసనములందు నణలు తారుమారుగా వ్రాయబడినది. ధానన లేఖకులు పొరపాటున అట్లు వ్రాసియుండవచ్చును.

1. అధికపుణ్యం....S.i.i Vol x, No.753
2. భైరపుణంని...S.i.i Vol x, No.753
3. వాయువణ్నుందు..S.i.i Vol x, No.753
4. పొద వినాశనేశ్వరుంణ్ని...S.i.i Vol x, No.749
5. గోపినాథుంణి....S.i.i Vol x, No.749

**లళ :** లళలు శాసనములందొక దానికొకటి పొరపాటున వ్రాయబడినది.

1. నదురుళ పాడు...S.i.i Vol x, No.748
2. వెంశిస్తళం కుచ్చళ్ళు..S.i.i Vol x, No.748
3. దేవగుడ్లు గటించి...S.i.i Vol x, No.749
4. మడిస్తళాన్ను ధత్తరంగా...S.i.i Vol x, No.749
5. స్థళాలలో యద్దుము...S.i.i Vol x, No.766
6. భూమి గ్రామాలు మామూళు అవుచుంన్నవి...S.i.i Vol x, No.766

**తద:** తదలు ఒక దానికొకటి శాసనములందు వ్రాయబడినవి.

1. కుదు పనమలక వెద్రయలుంగారు...S.i.i Vol x, No.745
2. తల్లిదంద్రాదుల...S.i.i Vol x, No.749
3. తమ తల్లితంద్రాదుల...S.i.i Vol x, No.766

**ఋ రి :** ఋరిలు శాసన లేఖకుల అజ్ఞత వలన ఒకదానికొకటి వ్రాయబడిన చోట్లు శాసనములందు కనిపించుచున్నవి.

1. మాత్రు పితుర హత్తేసేశిన..S.i.i Vol x, No.745
2. గభగ్రుహము..S.i.i Vol x, No.749
3. కమళయం గారి పుత్రులు..S.i.i Vol x, No.755
4. పాపరాజు పుత్రుడైన...S.i.i Vol x, No.774
5. ఆరుస్తంబ సూత్రమ యాన గోత్రులైన...S.i.i Vol x, No.774
6. వీరాచిత్తుని పుత్రుడైన...S.i.i Vol x, No.774

**వికర్షము**

గోలకొండ నవాబుల కాలపు శాసనములందు వికర్షము నొందిన పదములు కనిపించుచున్నవి.

1. మాత్రు పితురుహత్తె...
2. శతకవరుషంబులు..
3. సాహుసులు తాని...
4. కుతు మనమల్క ఒడయలుంగారు...
5. దంవేసులకును...
6. మహారాజయ భురాంశహవు డెలుంగాం...
7. మహమందు ఖుల్లి పాదశహరజా అయిషతి...
8. సాబాజీ ఆలమణానుందు ఖానణాను..
9. యరీతల యభురాహిముసాదు శహా...
10. హజరతిమహమద ఖుల్లికుతుబుపాదశహెూ....

కొన్ని శాసనములందు వర్గయుక్కులకు బదులు వర్గ ప్రథమ తృతీయాక్షరములును మరికొన్ని చోట్ల వర్గ ప్రథమ తృతీయాక్షరములకు బదులు వర్గయుక్కులు వాడబడినవి.

1. యరువయ ఆరుస్తలాలశికు... S.i.i Vol x, No.743
2. కొండ్డపల్లిస్తల కరణం గోపరాజు... S.i.i Vol x, No.745
3. శతసుంఖాలకుంగాను.. S.i.i Vol x, No.751
4. యరీతలయ భోరాహిము సాదుశహెూ... S.i.i Vol x, No.751
5. వెళ్లివచ్చెనన్న ఖబురువిని... S.i.i Vol x, No.751
6. హరాంఖోలు అయినవాండ్ల... S.i.i Vol x, No.751
7. ఇచ్చిన బూదాన ధర్మ శాసనము.,,. S.i.i Vol x, No.752
8. పకీర్ల అన్నవస్త్రాలకు... S.i.i Vol x, No.753
9. మల్కి ఇబురామయ్యా... S.i.i Vol x, No.753

**శకట రేఫము**

శకట రేఫము ద్రావిడ భాషలలో నున్న ప్రత్యఏక అక్షరము. గోలకొండ నవాబుల కాలపు శాసనములందు శకటరేఫము వాడబడిన చోట్లు అచ్చుటచ్చుట వినిపించుచున్నవి. శకటరేఫ యుత పదములీ అందనొసంగ బడుచున్నవి.

1గొఱెమేంకలు... S.i.i Vol x, No.743
2. గుఱ్ఱము బండ్లు.. S.i.i Vol x, No.743
3. గొఱి మేంకల.. S.i.i Vol x, No.743
4. దూడపల్లిచెఱు.. S.i.i Vol x, No.743
5. కొల్చు వెఱుగుటకు... S.i.i Vol x, No.743
6. కొల్చు వెఱుగుటకు... S.i.i Vol x, No.743
7. పాలపత్తి ఈశాన్యాన... S.i.i Vol x, No.743
8. విద్దరాజుచెఱ్వు... S.i.i Vol x, No.743
9. పరమండల సూఱకాఱ... S.i.i Vol x, No.743
10. చాలోక్య నంక్కకాఱ.. S.i.i Vol x, No.743
11. గుఱ మఱజముండ్డైన... S.i.i Vol x, No.743
12. కద్వాఇపఱెగోషణ.. S.i.i Vol x, No.743
13. చెఱువు తూప్పవాంగు.. S.i.i Vol x, No.743
14. ఆవంగల అబాడిన... S.i.i Vol x, No.743

**అనుస్వారము...**

గోలకొండ నవాబుల శాసనములందను స్వారములు పూర్ణ విందువుగా వ్రాయబడినది. పూర్ణాను స్వారమునకు బదులు వర్గీకపించ మాక్షరము వాడబడిన చోట్లు ఈ కాలపు శాసనములందు కనిపించుట లేదు. పూర్ణాను స్వారము వ్రాయబడిన చోట్లు ఈ క్రిందనుదహరింపబడినవి.

1. చేయుచుండ్డి... S.i.i Vol x, No.711
2. మహమందుఖుల్లిపాదశ... S.i.i Vol x, No.743
3. ఖండ్డాలు.. S.i.i Vol x, No.751
4. మండ్డలిక దూమగేతులైన.. S.i.i Vol x, No.758
5. సంక్రాంత్తి నాండు... S.i.i Vol x, No.746
6. తల్లిద్దండ్రికి... S.i.i Vol x, No.746
7. కొల్లపూండి... S.i.i Vol x, No.747
8. సమపించ్చి... S.i.i Vol x, No.749
9. చంనమంగారు.. S.i.i Vol x, No.763

# మూసీ పదవినోదం - 27

## సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 మై | 3 లా | రం | గు | 7 హ | 9 లు | X | 2 లిం |
| 4 కా | లూ | ను | X | 10 వ | లా | 11 హ | గ |
| 5 సం | చీ | X | X | ణ | యి | వి | మం |
| 6 చి | ప | ట్నా | X | ము | X | ర | తు |
| X | 8 డు | లు | 18 చు | X | 12 | శ | ల |
| 13 ప్ర | X | 14 క | డు | 19 గు | X | న | స్వా |
| 15 ధా | ర | X | 20 ము | లా | X | ము | మి |
| 16 ని | 17 కా | యం | X | 21 ము | కు | లు | X |

# తెలంగాణ కథల పొదరిల్లు - గూడూరి సీతారాం

**ఎన్. మృదుల,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సాపూర్. ఫోన్ : 9441408393



తెలంగాణా ఆధునిక సాహిత్య వికాసం తెలుసుకోవాలంటే తెలంగాణా పోరాట చరిత్ర అర్థం కావాలి. ఈ నేలలో పోరాటాలు జరిగిన ప్రతిసందర్భంలోనూ వెనుక ఉండి నడిపించినవి, మార్గ నిర్దేశం చేసినవి, ఆత్మగా మిగిలినవి – కథలు, కవితలు, పాటలు, నవలలు మరెన్నో. తెలంగాణాలో ఏ పోరాట వేదిక కూడా సాహిత్యానికి భిన్నంగా లేదు. అదీ ఈ మట్టి గొప్పదనం. నిజాం వ్యతిరేక పోరాటం, రైతాంగ పోరాటం, తెలంగాణా విమోచన పోరాటం ఇలా ఏ ఘట్టమైనా సాహిత్యాన్ని ఆసరా తీసుకొని నడిచినవే.

అయితే ఈ కాలంలో కూడా ఏ ఉద్యమస్పర్శ లేకుండా మనసులో కలిగే భావాలకు అక్షరాలు కూర్చిన వెళ్ళిపోయిన కవులు, రచయితలు కూడా మనకు కనిపిస్తారు. ఏ కాలంలోనైనా, ఏ సాహిత్య చరిత్రలోనైనా, కనిపించే అంశమే ఇది. అంతమాత్రం చేత ఈ కవులు సమాజానికి, సమాజంలో జరిగే పోరాటాలకు దూరంగా ఉన్నారని కాదు, వారిని ఈ పోరాటాలే కాకుండా మరింకేవో బలంగా కూడా కలచి వేశాయని అర్థం చేసుకోవాలి. ఇలా కలతకు గురై మట్టిలోలోపలికి వెళ్ళిపోయిన ఇలాంటి రచయితలలో గునుగుపువ్వై, మోదుగపువ్వై, ఇంకా తనకు ఇష్టమైన ఎర్రనిపువ్వై వికసించిన ఆనాటి కథారచయిత శ్రీగూడూరి సీతారాంగారు.

ఆధునికత వికసించిన తొలినాళ్ళలో కథకునిగా పుట్టిన గూడూరి సీతారాంగారు ఇప్పుడు ఎందుకు గుర్తు కొస్తున్నారంటే – మన మూలాలు, మన సంప్రదాయాలు, మన ఆచారాలు, మన వ్యవహారాలు, మననేల, మనభాష, మనయాసను, మన ఉనికిని అంతా కలిసి వెతుక్కుంటున్న ఈసందర్భంలో – అరవై యేళ్ళ కిందట వచ్చిన ఆయన రచనలు ఇప్పుడు, ఈ క్షణంలో రాసినంతగా తాజాగా ఉంటాయి. మనం సాగిస్తున్న అస్తిత్వ ప్రయాణంలో తెలంగాణా ఆధునిక కథ తీసుకున్న మొదటి అస్తిత్వపు మలుపును, ఆమలుపులో వికసించిన మోదుగచెట్టును, విస్తరించిన కానుగచెట్టును చూచి మన అసలుసిసలు తనం ఆస్వాదిద్దాం.

గూడూరి సీతారాంగారు 1953 నుండి 1965 వరకు 85 కు పైగా కథలు, రెండు నవలలు (పాత కొత్తలు మొ॥), రాశారు. లేఖావళి పేరుతో పత్రికలో శీర్షిక నిర్వహించి సమకాలీన సాహిత్య సామాజిక అంశాలపై చర్చలు కొనసాగించారు. వివిధ పత్రికలలో అచ్చయిన కథలను "మానేరు రచయిత సంఘం" వారు 2004లో "గూడూరి సీతారాం కథలు" అనే పేరుతో ఒక పుస్తకం తీసుకొచ్చారు. వారికి కేవలం 14 కథలు మాత్రమే లభించాయి. మిగతా రచనల్ని వెతికి పట్టుకొనే బాధ్యతను మనకు గుర్తు చేస్తున్న ఈ పుస్తకాన్ని విహంగ వీక్షణం చేస్తే అనేక అంశాలు కనిపిస్తాయి.

**1) వస్తువు :** జీవిక కోసం గ్రామాలు, పల్లెలు వదిలి నగరాలకు వలస వెళ్ళడం, అక్కడ తిండికీ, బట్టకు, నీడకు, రోగమొస్తే మందుకు వెతుక్కోవడం. చివరికి పల్లె తల్లి ఒడిని మించింది ఏదీ లేదనిపింప చేయడం, రైలు ఎక్కడానికి కూడా భయపడే ప్రజల అమాయకత్వం, దూర ప్రాంతాలకు వెళ్ళి భాషరాక, డబ్బులేక నానా ఇబ్బందులు పడటం–మనకళ్ళముందు కనబడి, ఇప్పటికి మనవాళ్ళు అక్కడ పడే కష్టాలను గుర్తుకు తెస్తూ ఉంటాయి.

నగరాల్లో చదువులతో కొని తెచ్చుకున్న ఆశయాలు, ప్రేమలు–పెళ్ళిళ్లు : అక్కడ ఇమడలేక – వేరొకర్ని పెళ్ళి చేసుకోవడం. స్త్రీ పురుషుల సమాన హక్కుల గూర్చి వేదికలెక్కి ఉపన్యాసాలు మాత్రమే ఇవ్వడం. పిల్లలు కూడా క్షమించలేని స్వేచ్ఛను పెద్దలు కోరుకోవడం – వంటివి కథల్లో మనకు కనిపిస్తాయి. ప్రజల జీవన విధానంలో మార్పులు సంభవిస్తున్న కాలంలో – డబ్బుకు, చదువుకు, నగరానికి, పెరుగుతున్న ప్రాధాన్యతా క్రమం మనిషిని ఎలా నిలవనివ్వదో ఈ కథలు చెబుతాయి.

**2) పాత్రలు :** స్త్రీ పురుషుల్లో కనిపించే అమాయకత్వం – గడుచుదనంబీ నగరం మీద ఆశ – పల్లె మీద ప్రేమ. భర్తను తీర్చిదిద్దుకున్న భార్య – అందంగాలేని భర్తను వదిలివేసిన భార్య – ఇలా మనుషుల్లో కనిపించే భిన్న తత్వాలు పాత్రలుగా కనిపిస్తాయి. కథలనిండా రంగడు, రాజమ్మ, రాజవ్వలే కనిపిస్తారు. ఇది కరీంనగర్ మట్టివాసన. కొందరు అయ్య, అన్న, వదినె, సేటు, అమ్మాయి, అబ్బాయిగానే మిగిలిపోతారు.

**3) భాష :** సీతారాంగారి కథల్ని పరిశీలిస్తే ఏకకాలంలో భిన్నశైలీ ప్రయోగం కనిపిస్తుంది. పూర్తి వ్యావహారికంలో సాగించిన కథ – అదేసమయంలో తన ప్రాంతపు నుడికారంతో సాగించిన కథ, రెండూ మనకు కనిపిస్తాయి పల్లె జీవితాల్లో జరిగే ఘట్టాల్ని కథగా మలిచేటప్పుడు,

పల్లెభాష, పట్టణ ప్రజల ఘట్టాలను కథగా మలిచేటప్పుడు వ్యావహారికభాషను ఎంచుకున్నారు. ఈరెండు మనకు ఒకే పుస్తకంలో కనబడటంతో ఆయనలోని విలక్షణతను మనము స్పష్టంగా గమనించవచ్చు.

అంతేకాక వ్యక్తీకరణలో కరీంనగర్ యాస, పడికట్టు పదాలు, సామెతలు, జాతీయాలతో ప్రజల జీవన చిత్రాలను ముడివేసే కథలూ, గాఢమైన బంధాల్ని, అనుబంధాల్ని, ఆత్మీయతల్ని కవిత్వంతో నింపిన కథలూ మనకు కనిపిస్తాయి. ఉదాహరణకు –

**రాజమ్మ రాజీరికం**లో 'రాజమ్మ అత్తగారోల్లు తోలుకపోను మూడుసార్లొచ్చింద్రు. రేపటి అమాసకు యాడాద్నైతది అది అత్తగారింటికి పోక, ఆళ్ళకు యాట్టకచ్చింది. తోల్తే తోలుంద్రి, తోలక పోతే పంచాయితు పెడ్తమన్నరు. రాజమ్మ అయ్యకు ఇవ్వన్ని సిత్రాలు తెలువవు. బిడ్డను తోల్కపొమ్మని సాపుగా చెప్పిండు. గాని రాజమ్మ పోనని మంకు పట్టు వట్టింది. దాని అయ్య ఓనాడు యాట్టకచ్చేదాకా గోజను కొట్టినట్టు కొట్టిండు. (గూడూరి సీతారాంగారి కథలు – పేజీ–3)

'రంగడు' లో– రంగని స్థితిని వర్ణిస్తూ 'రంగడుసానాసిన్నోడు. మాఅంటే ఆరేడేండ్లుంటయ్. గంతసిన్నప్పుడే ఆడు గోదలను కాసేది. ఆడు పొద్దు పొడ్వక ముందే బర్లను కొట్టుకొని ఈదుల్లుదాటి పొయ్యేది. ఎప్పుడో పొద్దునెత్తిమీద కచ్చినాంక పొద్దుగాల తెచ్చుకున్న సద్దిగడుక తోటోళ్ళందరితో కలిసి తినేది. గదీ రంగడు చేసే పని. ఆయింత ఓనాడేమైందంటే ఆడుకానే బర్లల్లకెల్లి నాలుగైదు తప్పిపోయి దొరగార్ల సేన్లవడ్డయి. యిగ జూసుకో దొరగారి పాలేరోడచ్చి రంగన్ని కసాయోనోలె సావగొట్టిండు. కొట్టినోడు కొట్టి యిడిసన్నవెట్టలే. ఈతనారతో యిరిసికట్టేసి దొరగారింటికి తన్నుకుంటా తీసుక వోయిండు. బర్లను కట్టేసే కొట్టంల రంగన్ని గుంజకు యిరిసి కట్టిండు. రాత్రి అయితాంది. రంగనికి బుగులు బుగులు గావట్టింది. ఒక్కడేనాయె. సిమ్మంజీకటాయె. గందులోనే దోమలుగరుసుడాయె" (పేజీ–8) ఇట్లా మానేరులా సాగిపోతుంది రచన. ఎక్కడాపాలో మనకు తెలియదు.

కవిత్వం కుమ్మరించే కథలు కూడా సీతారాం గారిలో కోకొల్లలుగా కనిపిస్తాయి. 'ఎర్రని పువ్వులో – కదులుతున్న పువ్వు నాచేతికి తాకి దూరంగా పోయింది. అందుకోవాలనే ఆకాంక్ష చేయిని ముందుకు జాచింది. వికాసంగా విలాసంగా తలూపుతున్న ఎర్రని పువ్వు దగ్గరగా ఒదిగింది. ఏదోజాలో, మరిబాధో కదలినట్లనిపించింది. ఇంకా చేయిని ముందుకు పోనియ్యలేదు. అలాగే నిలుచున్నాను. ఏవో కోర్కెలు గుబాళించాయి. వెంటనే చేయి వొస్తుందనుకున్నాను. కాని కొమ్మనే వంచింది. దూరంగా ఒదిగిన పువ్వు దగ్గరగా వొచ్చింది. సిగ్గుతో తలవంచుకున్నట్టుగా ఉంది. పువ్వును కొయ్యడానికి ధైర్యం చాలలేదు. కాని కనీసం ఒక్కసారైనా తాకాలనే కాంక్ష కలిగింది. ఇంతలో పూవు కిలకిలమంటూ పోయింది.

ఇట్లా సీతారాంగారు ఎంచుకున్న వస్తువును బట్టి రచనలో ఒదిగిపోతారు. అంత వైవిధ్యం చాలా స్పష్టంగా గీతగీసినట్లు మనకు కనిపిస్తుంది. ఒక రచయిత రచయితగా నిలబడాలంటే అతనిలో కవిత్వపు ఛాయలుండాలనీ, ప్రతి చిత్రాన్ని మరిచిపోకుండా పదాలతో కూర్చాలంటే తన భాష మీద మమకారముండాలని ఆయన కథలు ఋజువు చేసి చూపిస్తాయి. పల్లెపదాలలోని సహజ సౌందర్యం, ఆయన లోని భావుకత ఈ రెండూ కలిసి ఆయనను, పాఠకుడిని కదలనివ్వని కథారచయితగా నిలబెట్టాయి.

అంతేకాక కొత్తకొత్త వర్ణనలు, అలవోకగా కదిలే సామెతలు నుడికారాలు, జాతీయాలు కథాచిత్రణలోకనిపిస్తాయి. ఎక్కడెక్కడివో ఏరికూర్చకుండా మన భాషే ఒకకవిత్వం అనిపించేంతగా వారి రచనాశైలి సాగుతుంది. వీటిని పరశీలిస్తే.....

**4) అలంకారాలు :** 'చీకట్లు బెల్లంమీద ఈగలు ముసురుకున్నట్లు చుట్టూ చుట్టుకున్నాయి. (చీకటి గొడుగులు అనే కథ) 'ఆకాశంలో చంద్రుడు గబగబా ప్రాకిపోతున్నాడు. పల్చని మబ్బులు రాజుకు పట్టే ఛత్రాల్లా ఉన్నాయి – (పిల్ఫీ ప్రేమ) 'ఆనాడు ప్రొద్దు వంకరగా గూకింది. గాంధితాత కడుపుల్నుండి నెత్తురు సిల్లినట్టు. పడమటి మొకాన మొగుల్నుండి ఎర్రటిధారలు జారినయి' (పిచ్చోడు). పిల్లి పట్టిన కోడోలె, నాలె ముచ్చోలె, గొర్రెమంకు, గొర్రెపిల్లోలె, పామోలిగె కట్టమీదకెళ్ళి రైలత్తెంది బంగారానికి యెలిగారం అతికినట్లుంది మొదలైనవి ఉదాహరణలు మాత్రమే.

**5) సామెతలు :** రాచ్చసంటోళ్ళు నిండానూరేళ్ళు బతుకుతారు. గోవసంటోళ్ళు మాయెల్లమే జత్తరు. నూతిలో పడ్డోని మీదే నూరురాళు ్ర వడతయి మొదలైనవి.

**6) జాతీయాలు :** బతుకు తొవ్వలపడ్డది, కాటకల్సిపోతవ్, నెలనెత్తి మీదకొచ్చింది, సిప్పట్టుక, తీర్తంసాగింది మొదలైనవి.

**7) నుడికారాలు :** పడకచ్చింది, జెప్ప జెప్ప, బస్సు బస్సు మొదలైనవన్నీ మచ్చుకకు మాత్రమే.

ఇట్లా సీతారాం గారి కథలను తవ్వేకొద్దీ మట్టిపరిమళాలు ఎన్నో మనల్ని తాకుతాయి. భావంలోని తీవ్రతను అందుకోవడం పల్లెపదాల సొంతాలని మనకు తెలుస్తాయి. ఉద్యోగజీవితం ఆయనలోని కవిని, కథారచయితను మాయం చేసినా, పదేళ్ళకాలంలో ఆయనరాసినవి పదికాలాలపాటు నిలిచి పోయి ఉమ్మడి కుటుంబంలోని పెద్దరికాన్ని తలపిస్తాయి. అస్తిత్వానికి ఒక పరిపూర్ణ రూపం ఇచ్చేదశలో మనం ఉన్నాం కాబట్టి వెనుకటి తరానికీ, మచ్చులంటని తరానికీ చెందిన మన గూడూరి సీతారాంగారి కథలు ఏ తరం వారైనా చదవాల్సిందే. ఈ కథలను కానుకగా ఎవరికైనా ఇవ్వవలసిందే.

**ఉపయుక్త గ్రంథసూచిక :**


1. గూడూరి సీతారాం కథలు. సంపా – డా. పత్తిపాక మోహన్
2. 'ఫాయిదా' తెలంగాణ సాహిత్య వ్యాసాలు – గుడిపాటి మొలక ప్రచురణ
3. తెలుగులో మాండలిక కథా సాహిత్యం – డా॥ ఎ.కె. ప్రభాకర్

9985194697



# సి.వి. శ్రీనివాస్ 'నానీల జీవధార'

**డా. తిరునగరి,** ప్రముఖ రచయిత ఫోన్ : 9392 465 475

ప్రక్రియ ఏదైతేనేం కవిత్వం అంటూ ఉండాలంతే, అది పాఠకుల హృదయాలను కరిగిస్తుంది కదిలిస్తుంది. కదిలించేది కవిత్వం అన్నాడు కదా శ్రీ శ్రీ. ఆధునిక సాహితీ జగత్తులో మిక్కిలి ప్రాచుర్యం పొందిన లఘు కవితాప్రక్రియ నానీలు.

ఆచార్య గోపి గారు ఏ సుముహూర్తాన నానీల ప్రక్రియకి శ్రీకారం చుట్టాడో గాని అది దినదిన ప్రవర్ధమానమైంది. యువ కవులను కవయిత్రులను ఆకర్షించింది దాదాపు 400 సంపుటాలు వచ్చాయి. ఉదీయ మాన కవులు మొదలు లబ్ధప్రతిష్టులైన కవులదాకా నానీలు రచించారు. వాస్తురీత్యా, రూపంరీత్యా నానీల రచనల్లో ఉన్న సౌలభ్యాన్ని యువత గుర్తించింది. ఇరవైఏళ్ళు కావస్తున్నా సాహితీ క్షేత్రంలో నానీలు పండిస్తూనే ఉన్నారు కవులు.

నేను చదివిన సరికొత్త నానీల సంపుటి సి.వి.శ్రీనివాస్ రచించిన 'నానీల జీవధార' అల్పాక్షరాల్లో అనల్పార్థ రచన. శ్రీనివాస్ తాను చూచిన సమాజాన్ని,అందులోని ఎగుడు దిగుడు సంఘర్షణలను, కష్టాలను, కన్నీళ్లను నానీలలో సహృదయ ద్రావకంగా పొదిగిన తీరు అపురూపం.

"రైతన్నల
నిత్యసహవాసం
ఉంటే నీళ్ళతోటి
లేకుంటే కన్నీళ్లతోటి"

అలవోకగా వచ్చిన ఈ నానీలో ఎంతటి ఆవేదన..

"ఎండిపోయింది
ఊరిచెరువు.
ఎండిపోనిది
గుండెచెరువే"

గుండెల్ని పిండేసే భావుకత.ఈ ఒక్క వాక్యానికి ఎంత వ్యాఖ్యానమైనా రాయవచ్చు.

"చేద బావిలో
ఆత్మహత్యలు
బాధల లోతుకన్నా
దానిలోతు తక్కువేమో!" కవి ఎంతో లోతుగా ఆలోచిస్తేనే ఈ అభివ్యక్తి!

"నాయకులూ
మహానటులే..
వారికేవి
ఆస్కార్ అవార్డులు'' అంటూ ప్రజా జీవితంలో నటిస్తూ తిరిగే నాయకులపై విమర్శనాత్మక నానీ...

"జీవితం
దాగుడుమూతలా!?
అందరూ దాక్కుంటుంద్రు
కాలగర్భంలోనే"

ఎంతతేలిక ఉపమేయమో అంత భావుకత నిండిన కవి శ్రీనివాస్.

సృష్టంతా
జీవవైవిధ్యమే!
కవిత్వమంటే
వస్తువైవిధ్యమే!! అని తెలిసిన కవి. అందుకే ఇంత వైవిధ్యం నానీల జీవధారలో

"రాళ్లు ధరిస్తే
అదృష్టమా?
వంటినిండా రాళ్ళున్నా
భూమికి కష్టాల్లేవా!?'' అంటూ రాళ్లు ధరించే ఛాందసవాదులకు చురక..

"పుట్టగానే
ఏడుస్తుందు మనిషి
కష్టాలకు
శిక్షణ మొదలైనట్లుంది" అన్న వాక్యాలు చదువగానే –

'ఏడవకన్న నన్నువలె ఏడిచినారు' శిశువును గురించిన పద్యం తలపులో మొదలవుతుంది.




"ఆకల్ని వడికి
దారమైందు నేతన్న
మేనిపై మెరుపై
ఇంట్లో దేపమైందు"

ఈ ఒక్క నానీ చాలు శ్రీనివాస్ కవిత్వం కన్నీటి జాడులలో తడిసే దయాపారవతాలు అని చెప్పొచ్చు.

"రక్తానిది కూడా
గ్రూపిజమే
సార్వజనీనం
కన్నీరొక్కటేనేమో"

ఇలా ఆలోచింపచేసే కవితలు ఈ సంపుటిలో ఎన్నో ఉన్నాయి. ఇది శ్రీనివాస్ తొలి కవితాసంపుటి ఐనా అనుభవజ్ఞుడు ద్రష్ట అయిన కవికన్నా గొప్పగా ఉండే భావాలు ఇందులో ఉండటం విశేషం. మంచికవిత్వం చదివితే నిండుగా భోంచేసినట్లుండాలి కొంచెం దాచుకున్నట్లుండాలి అన్నారు ఆరుద్ర గారు.

అప్పుడప్పుడుగానీ, ఎప్పుడోగానీ మంచికవిత్వం వస్తుంది. ఇన్నాళ్లకు నానీల జీవధార'లో మంచికవిత్వాన్ని చూసాను. తన భావాలను శిల్పాభిరామంగా చెప్పే నైపుణ్యం శ్రీనివాస్ లో మెండుగా ఉంది. నానీల సంపుటిలో శాశ్వతంగా నిలిచిపోతుంది సి.వి.శ్రీనివాస్ 'నానీల జీవధార'.

మూసీ సాహిత్యధార
పుస్తక సమీక్ష

# అమృత లత అ 'సృష్టిలో తీయనిది' [నవల]

**ర్యాగట్ల సాయిలక్ష్మి**, తెలుగు పరిశోధక విద్యార్థిని, తెలంగాణ వి.వి. . ఫోన్ : 9701509056

అమృతలతగారు 1977లో "సృష్టిలో తీయనది" నవల రాసారు. ఈ నవల ఎక్కువభాగం ఒక ఉమెన్స్ హాస్టల్‌లోని డిగ్రీ చదువుతున్న విద్యార్థుల చుట్టూ తిరుగుతుంది. జయ ఒక అందమైన విద్యార్థిని. అల్లరి, మంచితనం కలిగిన సులక్షణ మహిళ. ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన ధనవంతురాలైన మహిళ. అందరితోను కలుపుగోలుగా ఉంటుంది. హాస్టల్లో వార్డెన్ లీలాసుందరి మెస్‌బిల్‌లో దొంగ లెక్కలు చెప్పటం, భర్తతో వారానికి రెండుసార్లు హాస్టల్లోనే గడపటం విద్యార్థులకు నచ్చేది కాదు. అందరూ ఏకమై ఆమె గుట్టు విప్పాలని అనుకుంటారు కానీ ఎవరికీ ఆ ధైర్యం ఉండదు. జయ, నిర్మల స్నేహితురాలు బయటకి షాపింగ్‌కి వెళ్తున్నామని హాస్టల్లో పర్మిషన్ తీసుకొని కలెక్టర్‌ని కలిసి విషయమంతా చెప్పి వస్తారు. దాంతో ఆమె భాగోతం బయటపడి వార్డెన్ పదవినుండి తొలగించబడుతుంది. తర్వాత వార్డెన్‌గా భారతి మేడం వస్తుంది. ఆమె ఎంతో చక్కగా హాస్టల్‌ని చూసుకుంటుంది. విద్యార్థినులకు ఒక్కొక్కసారి ఒక్కో బాధ్యత అప్పగించి ఎన్నో సూచనలు, సలహాలు ఇస్తుంది. కాలేజీ ఎలక్షన్లలో చంద్ర, జయ ఇద్దరూ పోటీపడతారు. కానీ విజయం మాత్రం 560 ఓట్లతో జయని వరిస్తుంది. ఇలా సాఫీగా సాగుతున్న రోజులలో దసరా సెలవులు వస్తాయి. ఎవరికి హాస్టల్ వదిలి ఇళ్ళకు వెళ్ళడం ఇష్టం లేకపోయినా అందరూ వెళ్ళిపోతారు. అందరిని పంపించి జయ చివరగా వెళ్తుంది. ఈలోగా బస్సు వెళ్ళిపోతుంది. ఊరికి ఎలా వెళ్ళాలో చీకట్లో ఆలోచించే జయని వినోద్ అనే వ్యక్తి పలకరించి సమస్యని తెలుసుకొని పరిష్కరిస్తాడు. ఆ సెలవులలో స్నేహితులు ఒకరికి ఒకరు ఉత్తరాలు రాసుకోవటంతోనే సరిపోతుంది. సంక్రాంతికి మా ఇంటికి రావాలని బామ్మ అనుమతి తీసుకొమ్మని జయతో లెటర్‌లో చెబుతుంది రజిత. ఆ మాటకి జయవాళ్ళ బామ్మ ఒప్పుకుంటుంది. సెలవులకి వెళ్ళిన జయకి వినోద్ రజిత అన్నయ్య అని తెలుస్తుంది. జయకి జ్వరం రావటం వలన ఒకరోజు ఆలస్యంగా హాస్టల్‌కి వస్తుంది. అందరూ ఆనందంగా వుంటారు. వచ్చి వారం కాలేదు నిర్మలని ఇంటికి రమ్మని ఉత్తరం రాస్తారు కుటుంబీకులు. వాళ్ళంతా అనుకున్నట్టే ఆమెకు పెళ్ళి కుదరటం, ఆ పెళ్ళిలో వీరందరూ ఎంతగానో సరదా చెయ్యటం జరిగిపోతుంది. సంక్రాంతికి రజిత వాళ్ళ ఇంటికి వెళ్తుంది జయ. వినోద్ జయని ఇష్టపడడం, రజిత అదంతా గమనించటం జరుగుతుంది. కాని జయలో ఎలాంటి చలనం ఉండదు. ఒకరోజు రజితకోసం వినోద్ హాస్టల్‌కి వస్తాడు. పలకరించకపోతే బాగుండదని జయ వెళ్ళి మాట్లాడిస్తుంది. జయ రాసే నవలలు, కథలు ఎలా రాస్తే బాగుంటుందో చెబుతాడు వినోద్. డిగ్రీ అయిపోయి వెళ్ళిపోతుంది రజిత. పిజి రాస్తూ హాస్టల్‌లోనే ఉంటుంది జయ. ఒకరోజు చంద్ర ఇంటికి వెళుతుంది జయ. చంద్ర భర్త జయకి దొంగచాటుగా ఉత్తరం రాస్తాడు. జయ తప్పు లేకపోయినా చంద్రవాళ్ళ అత్తమ్మ ఎన్నో మాటలంటారు. జయ చాలా బాధపడుతూ హాస్టల్‌కి వచ్చేస్తుంది. భర్త నిజస్వరూపం తెలిసి కన్నీళ్ళతో క్షమించమని అడుగుతుంది చంద్ర. వార్డెన్ మేడం వెళ్ళిపోవటంతో జయని అందులో జాయిన్ చేస్తారు కాలేజీ యాజమాన్యం. ఓరోజు నిర్మల బాబుని వదిలి జయ దగ్గరికి వచ్చి పెళ్ళి చేసుకొమ్మని ఎంతగానో చెప్పి వెళుతుంది. ఆలోచించిన జయ రజితకి ఉత్తరం రాస్తుంది. చిన్నప్పుడు పక్కింటివాడి వింత ప్రవర్తనకి తనకి ఫోబియా వచ్చిన విషయం అంతా చెబుతుంది. ఇదంతా వాళ్ళ అన్న వినోద్‌కి చెబుతుంది రజిత. జీవితాంతం తనని తాకొద్దన్నా సరే పెళ్ళి చేసుకుంటాననటం, వాళ్ళిద్దరి పెళ్ళితో రజిత సురేష్‌కి పెళ్ళవటం నలుగురు ఒకేచోట వేరుగా కాపురం ఉండటం జరిగిపోతుంది. సంవత్సరం తిరిగేలోగా రజితకి బాబు పుడతాడు. జయ వినోద్‌ల మధ్య ఏ సంబంధం ఉండదు. తన బాబుని జయ తన బాబుగా బతకడం చూసి తనకు స్వంతంగా పిల్లలుంటే బాగుంటుందనే ఆలోచన రావాలనే ఆశతో రజితవాళ్లు వాళ్లని వదలి వెళ్ళిపోతారు. కొన్నాళ్ళకి బాబుని చూడ్డానికి వెళ్ళిన జయకి రజిత నీకు ఓ బిడ్డ ఉంటే ఎంత బాగుంటుంది, అన్నీ మర్చిపోయి సంతోషంగా అన్నతో ఉండమని చెబుతుంది. అలాగే భర్తతో ఆనందంగా గడుపుతుంది రజిత. ఆ క్షణం స్పృహ తప్పి పడిపోతుంది. వినోద్ వెంటనే డాక్టర్‌ని పిలిచి జరిగినది చెబుతాడు. ఇప్పుడంటే సరే కాని గర్భవతిగా ఉన్నప్పుడు ఇలాంటివి జరిగితే ప్రమాదమని తనకి ఇష్టం లేనిదే తనని తాకొద్దని చెబుతుంది డాక్టర్. కానీ వినోద్ భయపడ్డట్టుగానే జయ నెల తప్పుతుంది.

ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని తనకేమైనా అవుతుందేమో అనవసరంగా తనని తాకి ప్రమాదం కలిగించాను అని బాధపడుతుంటాడు వినోద్. కాని రజిత తన స్నేహితురాలు అరుణ డాక్టర్‌ని కలిసి జరిగినదంతా చెబుతుంది. అరుణ జయ స్నేహితులే కనుక నేను చూసుకుంటానని హామీ ఇస్తుంది అరుణ. రజిత మాత్రం ఎక్కువగా ఆలోచించటం ఏడవటంతో నిద్రలో జయకి ఏదో జరిగినట్టు భయపడుతుంది రజిత. వాళ్ళ అమ్మ, జయ, బాబు క్షేమంగా ఉన్నారని తెలుసుకొని ఊపిరి పీల్చుకుంటుంది.

ఈ సృష్టిలో తీయనిది నవలలో స్త్రీ, పురుషుల మధ్య ప్రేమ, స్నేహబంధం, గొప్ప స్నేహంతో కూడిన అనురాగం, ఆత్మీయత, ఆడవారిలోని అమాయకత్వం వంటి పలు రకాల భిన్న కోణాలను చూపించింది అమృతలత. మొత్తానికి పండంటి బాబుతో సృష్టిలో తీయనైనది అమ్మ ప్రేమనే అనే ఇతివృత్తంతో ఈ నవల ముగుస్తుంది.

# తిరుమల వారి 'తెలుగు పత్రికల సాహిత్య సేవ' (గ్రంథ పరిచయం)

**అట్టెం దత్తయ్య,** పరిశోధక విద్యార్థి, ఉస్మానియా తెలుగుశాఖ, ఫోన్ : 9494715445


బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాష కోవిధులు, బహుగ్రంథకర్త తిరుమల రామచంద్రగారి గ్రంథాలలో ఒకటి 'తెలుగు పత్రికల సాహిత్య సేవ'. ఈ గ్రంథానికి బీజం 1985లో మద్దుకూరి చంద్రశేఖరరావు గారి స్మారకసభ ప్రసంగవ్యాసం. ఆ వ్యాసాన్ని 1986నుండి విశాలాంధ్రలో ధారావాహికంగా ప్రచురించి, వారే అదే సంవత్సరం పుస్తకంగా ముద్రించారు. 1992లో ఈ గ్రంథం ద్వితీయ ముద్రణ కూడా నోచుకుంది. ద్వితీయ ముద్రణలో కొంత అదనపు సమాచారాన్ని చేర్చినట్లు రచయిత రాసిన ముందు మాటల్లో చెప్పుకుంటాడు. మొదటి ప్రచురణకు అక్కిరాజు రమాపతిరావు 'వినయ పత్రిక' పేరుతో, రెండవ ముద్రణకు పాకాల యశోదరెడ్డి 'వాస్తవపు మాట' పేర్లతో విషయభారం నిండిన ముందుమాటలు అందించారు.



ఇక పుస్తకంలోకి చూసినప్పుడు మొదటగా 'పత్రికల ఆవిర్భావం' శీర్షికకింద పత్రిక ప్రాధాన్యాన్ని గురించి తిరుమలవారు "సాహిత్య ప్రక్రియలలో ఇది అన్యతమమయినా అన్ని సాహిత్య ప్రక్రియలను ఏకకాలంలోనే అందించగల విశిష్టత దీనికి ఉంది" అనడం చక్కని, చిక్కని నిర్వచనాత్మక వాక్యం. తెలుగులో వార్తా పత్రిక 16వ శతాబ్దం ఉత్తరార్ధంలో ప్రారంభమైనట్లుగా అది 'రాయవాచకం'గా పేర్కొంటారు. భారతదేశంలో మొదటిదిగా 'దిగ్దర్శన్' 1818 ప్రారంభంగాక, 14 సంవత్సరాల అనంతరం తెలుగులో పత్రిక వచ్చినట్లు తెలిపాడు. అది 'ది కర్నాటిక్ క్రానికల్'. దీనిని గురించి జి.ఎన్.రెడ్డి నిరూపించినట్లుగా పేర్కొన్నాడు. తదనానంతరం 1835లో ప్రారంభించిన 'సత్యదూత', 1838లో పురుడుపోసుకున్న తర్వాత 'వృత్తాంతిని', వర్తమాన తరంగిణి' హితవాది, సుజనరంజని, శ్రీయక్షిణి, తత్త్వబోధిని, ఆంధ్రభాషా సంజీవని, పురుషార్థ ప్రదాయిని, స్వధర్మ, సుధీ రంజని, సకల విద్యాభివర్ధని మొదలుకొని ఆంధ్రజ్యోతి దినపత్రిక వరకు ఎనభైకి పైచిలుకు పత్రికలను గురించిన విషయాలను సంగ్రహంగ వివరించారు. వీటిలో ప్రత్యేకంగా మహిళా పత్రికలు, తెలంగాణ సాహిత్య పత్రికలు, భావకవిత్వపు పత్రికలు, కమ్యూనిస్టు పత్రికలు, అభ్యుదయ పత్రికలు, త్రైమాసిక, మాస, పక్ష, దిన పత్రికలను గురించిన ప్రత్యేక శీర్షికలతో కూడిన వివరణ కనిపిస్తుంది.

తెలంగాణ పత్రికలు పేరుతో ఎనిమిది పత్రికలను గురించిన సమాచారం ఇచ్చారు. కళలను గురించి ప్రత్యేకంగా అవతరించిన కళ పత్రిక, నాట్యకళ పత్రికల సమాచారం పొందుపర్చారు. వీటితో పాటు వైద్య పత్రిక అయిన 'ధన్వంతరి' గురించి ఉండడం ఆనందదాయకం. తిరుమలవారు తిమ్మావజ్జల కోదండరామయ్యతో కలిసి మూడు సంవత్సరాలు అసిధారావ్రతంగా నడిపిన పత్రిక 'పరిశోధన' గురించి ఇందులో కనిపిస్తుంది. కమ్యూనిస్టు పత్రికలు అయినా నవశక్తి, స్వతంత్ర భారత్, ప్రజాశక్తి, విశాలాంధ్ర, జనతల గురించి. అభ్యుదయ పత్రికలు తెలుగు తల్లి, అభ్యుదయ పనితీరును వివరించారు.

ఇన్ని పత్రికలలో కనిపిస్తున్న ప్రత్యేకాంశాలను చూసినట్లయితే వివిధ పత్రికలలో వచ్చిన పరీక్ష పత్రాల స్వరూపం, బాలసాహిత్య ప్రత్యేకత, వేశ్య విముఖత, మహిళా సమస్యలు, ప్రచురణ సంస్థల అవతరణం, పత్రికల ద్వారా జరిగిన చైతన్యం, సంపాదకీయాల తీరు, వ్యవహార భాషావాదం, శాసనాల ప్రచురణ, కళలు మొదలగు విషయాలను సోదాహరణంగా విశ్లేషించారు. పత్రికల స్వభావాలతో పాటు స్వరూపాలను కూడా వివరించారు. మచ్చుకు 'వివేకవర్ధని' పత్రిక "ముఖతిలకంగా భారతంలోని **"ఒరు లేయవి యొనరించిన/ నరవర యప్రియము తన మనంబున కగు దా / నొరులకు నవి సేయకునికి / పరాయణము పరమధర్మ పథములకెల్లన్"** అనే పద్యం వుండేది" వంటి అంశాలు. అంతే కాదు ఈ పత్రిక ప్రథమ సంచికలో



వీరేశలింగం పంతులుగారి పత్రిక లక్ష్యాలను తెలిపిన సంపాదకీయాన్ని సేకరించి ముఖ్య అంశాలను ప్రచురించారు. ఈ పత్రికలో వీరేశలింగంగారి వ్యాసాల సంఖ్యను కూడా తెలపడం వారి పరిశోధనకు తార్కాణం.

గ్రాంథిక వ్యావహారిక భాషోద్యమాలను గురించి వాదించుకున్న ప్రబుద్ధాంధ్ర, వజ్రాయుధం పత్రిక ఆవిర్భావ కారణాలు తెలియరాసారు. భారతి గురించి చెప్తూ "దాని దెబ్బకు సామాన్య మాస పత్రికలేవీ నిలవలేకపోయాయి..." (పు.96) మార్పుకు నాంది పలికిన పత్రిక సాంఖ్యాయన శర్మగారి 'కల్పలత'గా పేర్కొన్నారు. సాహిత్య విమర్శలో నూతన దృష్టిని కలిగించిన 'అముద్రిత గ్రంథ చింతామణి' కృషిని గురించి కొంత వివరంగా విశ్లేషించారు. వారి మాటల్లో ఈ పత్రికను గురించి **"ప్రాచీన గ్రంథ ప్రచురణం, సమకాలీన రచన ప్రచురణం, భాషా సాహిత్యాల చర్చ, మెట్రిక్యులేషన్ మొదలు ఎం.ఎ., వరకు పాఠ్య గ్రంథాల ప్రచురణ, కవుల నిర్యాణ వార్తలు, కవిపండితుల ఉత్తర ప్రత్యుత్తరాలు, గ్రంథ సమీక్షలు అని క్రోడీకరించవచ్చు"** అంటారు.

వివిధ పత్రికలకు వచ్చిన లేఖలను, ఎక్కువగా బ్రౌన్ లేఖలనుండి తీసుకున్నట్లు కనిపిస్తుంటాయి. 'ఆంధ్రభాషా సంజీవని' పత్రికలో ప్రచురించిన పత్రికా లక్షణము, విలేఖక లక్షణము, ఉపవిలేఖక లక్షణము, స్వీకర్తృ లక్షణము, పాఠక లక్షణాలను తెలిపే పద్యాలను పొందుపర్చారు.

సాహిత్య విమర్శను గురించి ఈ గ్రంథంలో వారు రాసిన వాక్యాలు తెలుగు విమర్శ ఎంత వెనుకబడి, ఏ పద్ధతిలో ఉందో అనే విషయాలను నిక్కచ్చిగా తెలియ జేస్తాయి. **"ఇన్ని పత్రికలు పుట్టిన సాహిత్య విమర్శ తీరు హెచ్చుగా పదచర్య వరకే పరిమితమై ఉందేదనవచ్చు. ప్రాచీన సంస్కృతాలంకారికుల దారిని కూడా చాలామంది తొక్కలేరు..."** (పు.41) అంటారు. ఇప్పటికీ ఆ మాటలు స్మరణీయాలే. అట్లే పత్రికలలో భాషను గురించి, పత్రికలకు అనువాదం ప్రాధాన్యతను గురించిన అంశాలను ఉదాహరణ యుక్తంగా విశ్లేషించారు.

19వ శతాబ్ది చివరివరకు గల పత్రికల తీరును తొమ్మిది విభాగాల విభజించారు. 1. ప్రాచీన కావ్య ప్రబంధాల ప్రచురణం 2. భాషా సాహిత్య విమర్శనం 3. సాహిత్య వాద వివాదాలు 4. నవలలు వ్యాసాలు కథల ప్రచురణం 5. పుస్తక పరిచయాలు, సమీక్షలు 6. సారస్వత విషయాలపై పండితుల ఉత్తర ప్రత్యుత్తరాలు 7. ఆంగ్ల సంస్కృతాల నుండి అనువాదాలు 8. అంకాలు అంకాలుగా నాటకాల ప్రచురణం 9. ఉపన్యాసాల గోష్ఠుల సారాంశాలు, సభల చర్చా విశేషాల ప్రచురణం.


ఈ గ్రంథ చివరలో అనుబంధంగా ఒక గొప్ప వ్యాసం ఉంది. అది 'పత్రికల గొప్ప ఈవి – వ్యాసం' అనేది. ఇందులో వ్యాసం పదప్రయోగం నుండి విస్తృత వినియోగం వరకు వివరించారు. వ్యాస స్వరూపం శీర్షికలో భాగంగా వ్యాసానికి ఉండవలసిన ఎనిమిది లక్షణాలను వివరించారు. వ్యాసాన్ని ప్రారంభంలో సామినేని ముద్దు నరసింహం 'ప్రమేయం'గా చెప్పుకున్న తీరును, వారి హితసూచనిలో ఉన్న ఎనిమిది ప్రమేయాలను గురించి ఉదాహరణలతో వివరించారు. అట్లే పరవస్తు వేంకట రంగనాథాచార్యులు వారు 'సంగ్రహము' ను గురించిన వివరణ, కారణం ఇత్యాదులను వివరించారు. వీరేశలింగం వినియోగించిన 'ఉపన్యాసం' అనే వాటిని గురించిన విషయాలను చర్చించి తర్వాతి కాలంలో వారే 'వ్యాసం' పేరుతో వాడిన అంశాలను వివరించారు.

కొంతమంది గొప్ప వ్యాసరచయితలను గురించిన పరిచయం కూడా ఇందులో కనిపిస్తుంది. వారు దాసు శ్రీరాములు, ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ, కొమర్రాజు లక్ష్మణరావు, మొదటి వ్యాస కర్త్రి పోతం జానకమ్మ, మద్దుకూరి చంద్రశేఖర రావు, గిడుగు రాంమూర్తి పంతులు గారలు రాసిన వ్యాస ప్రయోగాలను విశేషణాలను సోదాహరణంగా వివరించారు.


**"పందొమ్మిదో శతాబ్ది ఉత్తరార్ధంలో ప్రతి పండితులూ కొంతకాలమైనా ఏదో ఒక పత్రిక నిర్వహించారు..."** (పు.41) అనే వాక్యాలు సాహిత్య చరిత్రలోని ఎంతోమంది సాహితీమూర్తులు పత్రికల రూపంలో కూడా సేవలందించారనే విషయాన్ని మననం చేసుకునే అవకాశాన్ని కల్పించాడు.

ఈ విధంగా ఒక ఉపన్యాసం కోసం ప్రారంభమైన శోధన మంచి గంథ్రంగా రూపొంది, రెండుమూడు ముద్రణలను నోచుకుంది అంటే వారి పరిశోధన శక్తి, అంశంపై వారు చూపే ఆసక్తిని గురించి అర్థం చేసుకోవచ్చు.

## స్వ'కృతి'



**ఆత్మీయ సదనము (పద్య కవిత్వం)**
పల్లె సీను
**పుటలు :** 88 **వెల :** 80
**ప్రతులకు :** రచయిత, ఇం.నెం. 2-1-14, 3వ లేన్, సరస్వతి నగర్, గోపాలపూర్ రోడ్, విద్యారణ్యపురి, వరంగల్ (అర్బన్) -506009 ఫోన్ : 98493 80473




**సూర్య చరితము (పద్యకావ్యము)**
నూతలపాటి వెంకటరత్న శర్మ
**పుటలు :** 86 **వెల :** 100
**ప్రతులకు :** రచయిత, ఫ్లాట్ నెం. 302, జయరత్న రెసిడెన్సీ, ఫ్లాట్ నం. బి2, న్యూ సిలికాన్ బేకరీ దగగర, ఆఫీసర్స్ కాలనీ, డా.ఎ.ఎస్.రావ్ నగర్, హైదరాబాద్. ఫోన్ : 98663 76050




**రవి కిరణాలు**
సత్యనీలిమ
**పుటలు :** 65 **వెల :** 100
**ప్రతులకు :** రచయిత్రి, ఫోన్ : 9502 156 813



**నీ తలపుల్లోనే... (ప్రేమ మొగ్గలు)**
సత్యనీలిమ
**పుటలు :** 40
**ప్రతులకు :** రచయిత్రి, ఫోన్ : 9502 156 813







**ఆదిశక్తి మొగ్గలు**
సత్యనీలిమ
**పుటలు :** 34 **వెల :** 30
**ప్రతులకు :** రచయిత, ఇం.నెం. 37-9/1ఎ, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎదురుగా, వల్లభ్ నగర్, వనపర్తి జిల్లా - 509 103. ఫోన్ : 9502 156 813

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోదుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. **2-2-1109/**
బికె-ఎల్.ఐ.జి.**10**, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-**500013.**

చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట,
హైదరాబాద్.
అకౌంట్ నెం. **52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

# నా అక్షరాలు





అవి నా అక్షరాలు / ప్రతిక్షణం జతగా నడిచి
నీడల్లో నీడగా మారిన / నా ధైర్య అస్త్రాలు
కాగితంపై లక్ష్యాన్ని నిర్దేశించుకొని
చైతన్యం రెక్కలను ఆపాదించుకొని
గగన గమ్యంవైపు సాగే / నా అక్షర పావురాలు
ఆలోచనలన్నీ నా మనస్సును/ రంపమై కోసినపుడు
ఓదార్పుగా నిలిచి / నాతో జతగా నడిచిన అక్షరాలు
ఉత్తేజం నిండి, ఆనందం విరిసినపుడు
స్నేహ సౌరభాలను / వెదజల్లిన ప్రేమాక్షరాలు
విధి బలమై, బాధల సమ్మెట
నన్ను బాదినపుడు / నా అక్షరాల మనస్సు
కన్నీరు కార్చడం నే చూశాను
ముందుకు సాగక మారాం చేస్తూ
పసిపిల్లల్లా ఏడ్చే / శబ్దాలనూ నే విన్నాను
కవితకు ప్రాణం పోసి / అక్షర సుమాలతో
అర్చన చేసినపుడు / గర్వంతో తలెత్తుకొని
ప్రభాత సూర్యుడిలా / ప్రకాశించడం నే చూశాను
దేహం రాకున్నా తోడుగా/ అక్షరాల ఆత్మ ఎపుడూ నా వెంటే
దీపం లేకున్నా, చీకట్లో/ అక్షరాల కాంతి ఎపుడూ నా తోడే
నను ఆవహించిన నా అక్షరాలు
నిద్దుర పట్టగానే / కలలో ప్రత్యక్షమవుతాయ్
కలలో నా అక్షరాలు / కాగడాలై వెలుగుతో
సుదూరాలకు నన్ను నడిపిస్తాయ్
నా చుట్టూ తిరుగుతూ / అక్షర ప్రయోగ శిక్షణనిస్తాయ్
వీరుల సమాధుల వద్ద / నన్ను తీసుకెళ్తాయ్
త్యాగాలను స్మరిస్తూ విలపిస్తాయ్
నా చేతికి కలాన్ని అందించి / ప్రతిజ్ఞలు చేయిస్తాయ్
కనులు తెరిచి లేవగానే / అక్షరాలు నన్ను ప్రశ్నిస్తాయ్
రోజూ వచ్చే కలే అయినా / ప్రతిరోజు సరికొత్తగా
బాధ్యతను నెరవేర్చే క్రమంలో / మరింత చేరువగా
నా అక్షరాలు ఆదేశిస్తాయ్ / ప్రార్థిస్తాయ్, విలపిస్తాయ్
ప్రశ్నిస్తాయ్
జీవితాలకు లక్ష్యాలను నేర్పే బాటలో బలమిస్తాయ్
అవి నా అక్షరాలే కాదు జీవితం కూడా

**సిరిసిల్లా గఫూర్ శిక్షక్**
కామారెడ్డి, ఫోన్ : 9849062038